కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

కారు గుర్తుకే ఓటేద్దాం
తెలంగాణని గెలిపిద్దాం

మహబూబ్‌నగర్ : fb.com/vaartha

PUBLISHED FROM MAHABUBNAGAR, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM, SRIKAKULAM

21-11-2023 మంగళవారం సంపుటి : 29 సంచిక : 291 పేజీలు : 10+4 వెల : 6.50

# స్కాంగ్రెస్

దేశంలోనే అతి ప్రాచీనమైన రాజకీయ పార్టీ వివిధ రకాల కుంభకోణాలు

## వివిధ స్కాంల ద్వారా కాంగ్రెస్ దోచుకున్న ప్రజాధనం: రూ. 48,20,69,00,00,000

ఆగస్టు 22, 2019. జీన్యూస్

దేశంలోనే అతి ప్రాచీనమైన రాజకీయ పార్టీ వివిధ రకాల కుంభ కోణాలు, అవినీతి కార్యకలాపాల ద్వారా 48,20,69,00,00,000 మొత్తాన్ని లూటీ చేసింది.

## ఇది స్కాంగ్రెస్, A టు Z

జీప్ స్కాండల్ కేసు-1948 ఐఎన్ఏ ట్రెషర్ చెస్ట్-1947 బిహెచ్‌యు ఫండ్స్-1956 **మారుతి స్కాండల్-1974**
సెయింట్ కిట్స్ ఫోర్జరీ-1989 **బోఫోర్స్-1987** సిమెంట్ స్కాం-1981 జల్గాన్ హౌసింగ్ స్కాం-1997
టెలికాం స్కాం-1996 ఫర్టిలైజర్ ఇంపోర్ట్ స్కాం-2007 పురూలియా ఆర్మ్స్ డ్రాప్ కేసు-1995 యూటిఐ స్కాం-1993
షుగర్ ఇంపోర్ట్ స్కాం-1994 **హర్షద్ మెహతా స్కాం-1992** పామోలిన్ ఆయిల్ ఇంపోర్ట్ స్కాం-1993
వోక్స్‌వాగన్ స్కాం-2005 **వాద్రా డిఎల్ఎఫ్ ల్యాండ్ గ్రాబ్-2013** థోరియం స్కాం-2014
**నేషనల్ హెరాల్డ్-2012** ఆయిల్ స్కాం-1976 **తెల్గీ స్కాం-2002**
2జి స్పెక్ట్రమ్ స్కాం-2008 **నోట్ ఫర్ వోట్-2015** కామన్వెల్త్ గేమ్స్ స్కాం-2010
దేవాస్-ఆంత్రిక్స్ స్కాం-2011 **ఆదర్శ్ స్కాం-2012** కోల్ స్కాం-2012 తత్ర ట్రక్ స్కాం-2012 ఐపిఎల్ స్కాం-2013
**అగస్టావెస్ట్‌ల్యాండ్ ఛాపర్ స్కాం-2013** కువో ఆయిల్ స్కాం-1976 నాగర్వాలా స్కాం-1971
కోబ్లర్ స్కాం-1995 గోవా సెజ్ స్కాం-2009 మేఘాలయ ఫారెస్ట్ స్కాం-1995 రైస్ ఎక్స్‌పోర్ట్ స్కాం-2007
ఎల్ఐసి స్కాం-1957 ఎయిర్‌బస్ స్కాం-1984 స్కార్పెన్ సబ్‌మెరైన్ స్కాం-2005

*స్థలం లేకపోవడంతో, ఈ జాబితా ఇక్కడితో ఆపుతున్నాం.*

స్కాములు చెయ్యాలి
రాష్ట్రాన్ని మింగాలి
అదే వాళ్ల ధ్యేయం
వీళ్ళు మనకి కావాలా?
ఆలోచించండి,
ఆగం కాకండి.

## కారు గుర్తుకే ఓటేద్దాం
## తెలంగాణని గెలిపిద్దాం




**కేసీఆర్ భరోసా**

- **సౌభాగ్యలక్ష్మి**: పేద మహిళలకు నెలకు రూ. 3000
- **ఆసరా పింఛను**: నెలకు రూ. 5,016కు పెంచబడుతుంది
- **గ్యాస్ సిలిండర్**: వెనుకబడిన వర్గాలవారికి సబ్సిడీపై రూ. 400కే
- **అన్నపూర్ణ పథకం**: తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం
- **రైతుబంధు**: ఎకరాకు ఏటా రూ. 16,000కు పెంచబడుతుంది
- **కేసీఆర్ ఆరోగ్య రక్ష**: ఆరోగ్య బీమా కవరేజీ రూ. 15 లక్షలకు పెంచబడుతుంది

# అది 'భూమేత' పార్టీ



సోమవారం ఘాగల్లు ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కెసిఆర్, కడియం

లబ్ధిదారులందరికీ ఇండ్లు కట్టి ఇస్తామని తెలిపారు. ఒక్కటెనుక ఒకటి అన్ని పూర్తి చేస్తామన్నారు. ఏదైనా పట్టుబడితే నేను గట్టిగ ఎంబడి పడతానని అన్నారు. వ్యవసాయం, వైద్యం వెంబడి పడి ఓడాకికి తెచ్చానని చెప్పారు. ప్రజాస్వామ్యం వచ్చి 75 ఏళ్ల సుదీర్ఘ కాలం గడిచినా రావాల్సినంత పరిణతి రాలేదన్నారు. ప్రజాస్వామ్య పరిణతి వచ్చిన దేశాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయన్నారు. ఎన్నికలొస్తే మన దగ్గర పెద్ద హడావిడిలో పాటు అబద్ద వాగ్దానాలు, హామీలు ఉంటాయన్నారు. అమెరికాలాంటి దేశాల్లో ఇలాంటి ఎన్నికల సభలు ఉండవని, కేవలం టీవీల్లో మాసి ఓటేస్తారన్నారు. అలాంటి రోజులు దేశంలో రావాలని ఆకాంక్షించారు. రాయేదో, రత్నమేదో మీరే తేల్చాలని ప్రజలను కోరారు. 30 ఓట్లు, 3న లెక్కింపుతో దుకాణం ఒడుస్తుందనుకోవద్దు, అసలు పని అప్పుడే ఉంటుందన్నారు. మంచి ప్రభుత్వాన్ని ఎంచుకోకపోతే మన ఓటే మనల్ని కాటేస్తుందన్నారు. అభ్యర్థుల గుణగణాలతో పాటు, వారి వెనక ఉన్న పార్టీని కూడా చూడటం అంతకంటే ముఖ్యమని స్పష్టం చేశారు. నిరుపేదలు, రైతులు, రాష్ట్రం గురించి ఆయా పార్టీలు ఎలా ఆలోచిస్తున్నాయన్నది ప్రజలు చూడాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ పార్టీ ఎందుకు పెట్టాడని, రూ.2 కిలో బియ్యం ఎందుకు తెచ్చిండని ప్రశ్నించారు. ఎన్టీఆర్ రూ.2 కిలో బియ్యం తెచ్చిన తర్వాతనే, ప్రజలు రెండు పూటలు తినగలిగారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలు దుబాయి, బొంబాయికి ఎందుకు వలసపోయారని ప్రశ్నించారు. ఉన్నోనికి ఉండటం, లేనోనికి లేకపోవడమేనా ఇందిరమ్మ రాజ్యమని ఎద్దేవా చేశారు. ఉన్న తెలంగాణను ఊడగొడితే 58 ఏండ్ల కొట్లాడాల్సి వచ్చిందన్నారు. ఎంతోమంది సచ్చిపోవాల్సి వచ్చింది, దీనికంతటికీ కాంగ్రెస్ కారణం కాదా అని విమర్శించారు. రాష్ట్రంలో ఆటోరిక్షా నడుపుకునే వాళ్లందరికీ ఓ శుభవార్త చెబుతున్నాను, ఫిట్ నెస్ ఫీజు మళ్లీ గవర్నమెంట్ రాగానే రద్దు చేస్తామన్నారు. ఏడాదికొసారి ఆటో రిక్షాల ఫిట్ నెస్ కోసం 12 వందలు ఖర్చు చేస్తున్నారని వారి కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. నాకు కరీంనగర్‌కు ఏదో లింకుంది, ఇక్కడి పిల్లనే నేను పెళ్లి చేసుకున్ననని తెలిపారు. కరీంనగర్‌కు ఎప్పుడొచ్చినా ఇక్కడి నుండే స్కీం ప్రకటిస్తున్నా ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు ఫిట్ నెస్ ఫీజు రద్దు చేసే స్కీంను ప్రకటిస్తున్నానని చెప్పారు. ఒకప్పుడు బోర్లు వేస్తేనే నీళ్లు, బోర్ల పేరుతో లక్షల రూపాయల దోపిడి, ఎన్నో బాధలు చూసామన్నారు. ఇలాంటివి మారాలని మేము ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. రైతుల జేబుల్లో నాలుగు డబ్బులుండాలని సీరియస్ నిర్ణయాలు తీసుకున్నామన్నారు. నీటి తీరువా ఇండియా అంతటా ఉంది కానీ రాష్ట్రంలో రద్దు చేసామన్నారు. 24 గంటలు నాణ్యమైన కరెంటు, రైతుబంధు ఇస్తున్నామని చెప్పారు. రైతు భీమా ఇచ్చి, కుటుంబానికి ఆసరా కల్పించామన్నారు. వెయ్యి రెండు వేల కోట్ల నష్టమొచ్చినా ధాన్యమంతా సర్కారు కొనేలా చూసామని చెప్పారు. ఎక్కడ చూసినా రోడ్లపై ధాన్యపు రాసులే కనిపిస్తున్నయంటే ఎట్లా సాధ్యమైందని ప్రశ్నించారు. మానకొండూరు నియోజకవర్గానికి నాలుగువైపులా నాలుగు ప్రాజెక్టులు తెచ్చామన్నారు. హుజురాబాద్ లాగా మానకొండూరులోనూ పైలట్ ప్రాజెక్టులాగా దళితబంధు ఒకే దఫాలో ఇస్తామన్నారు. రసమయిని భారీ మెజార్టీతో గెలిపిస్తే మీకందరికీ ఒకే విడతలో దళితబంధు ఇస్తామన్నారు. మానకొండూరు నియోజకవర్గ అభ్యర్థి రసమయి బాలకిషన్ అంటే వాక్యంతా తెలంగాణ ధూం ధాం పెట్టి పక్కల్లూగా రాష్ట్రమంతా తిరిగి ఉద్యమం చేసారన్నారు.

**కాంగ్రెస్ పాలన నక్కలుంటే టీడీపీ ఎందుకు పెడతారు: సీఎం**

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ:** తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వచ్చిన అనంతరమే అభివృద్ధి పథంలో ముందుందని సీఎం కేసీఆర్ అన్నారు. సోమవారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ సమీపంలోని ఘాగల్లులో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ 50ఏళ్ల కాంగ్రెస్ పాలన నక్కలుంటే తెలుగుదేశం పార్టీ ఎందుకు పెడతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ 24గంటల కరెంటు వద్దు మూడుగంటలు చాలు అని, 10హెచ్‌పీ మోటార్లు పెట్టాలి. రైతుబంధు వృధా అంటున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అధోగతి పాలుచేస్తుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక పెన్షన్ దశల వారిగా పెంచుతామని, ఇప్పటికే అమ్మఒడి ద్వారా ఎంతోమంది గర్భిణీలకు పరీక్షలు నిర్వహించినట్లు, ప్రసూతి అయిన మహిళలకు కేసీఆర్ కిట్లు అందజేశామని తెలిపారు. గ్రామాల్లో తాగునీటికి, సాగునీటికి ఇబ్బందులు లేవని, సర్పంచ్‌లు కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బందులు పడ్డారని, వాటిని అధిగమించి మిషన్ భగీరథ తీసుకొచ్చామన్నారు. రాష్ట్రంలో కరెంటు కష్టాలనుపారదోలామని, జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఇక్కడి వాడేకావడంతో ఆయనకూడా అభివృద్ధికోసం తనతో కొట్లాడాడని తెలిపారు. కడియం శ్రీహరి ఎంతో అభివృద్ధి చేసే వ్యక్తి అని, మంత్రిగా, ఎమ్మెల్యేగా ఆయన ఎంతో అభివృద్ధి చేశారన్నారు. కృష్ణ, గోదావరి నదిమధ్యలో ఉన్న స్టేషన్‌ఘన్‌పూర్‌కు కాంగ్రెస్ నాయకులు నీళ్లు తీసుకరాలేకపోయారని అన్నారు. అయినా మళ్లీ వచ్చినట్లు అడుగుతున్నారని, గ్రామాల్లో చర్చపెట్టి ఆలోచించి ఓటువేయాలని కోరారు. ఒకప్పుడు లింగాలఘనపురం మండలంలో ఒగ్గు కళాకారుడు మక్కసత్తయ్య నీళ్లకోసం పదులసంఖ్యలో బోర్లు వేసి తాను సంపాదించిందంతా వాటికోసమే ఖర్చుచేశారన్నారు. దేవాదుల నీళ్లు ఇవ్వకపోతే తానే పిండాలు పెట్టి వచ్చానని, అలాంటిది ఇప్పుడు స్టేషన్‌ఘన్‌పూర్‌లో లక్ష పదివేల ఎకరాలకుసాగునీరు అందిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తారని, తిరిగి పాతపద్దతి అమలులోకి వస్తుందని, రెవెన్యూ అధికారులు, వీఆర్వోల అవినీతి మళ్లీ పెరిగిపోతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచినచన వెంటనే ఆటోరిక్షా కార్మికులకు ఫిట్నెస్ రద్దు చేస్తారని హామీ ఇచ్చారు. కడియం శ్రీహరిని అధిక మెజార్టీతో గెలిపించాలని, రాజయ్యకు కూడా సముచిత స్థానం కల్పించడం జరుగుతుందన్నారు. సభలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నర్సాపూర్‌ను చార్మినార్ జోన్‌లో కలిపేందుకు కృషి చేస్తాం: రేవంత్

**నర్సాపూర్, నవంబర్ 20.ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్రంలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం చేపడితే నర్సాపూర్ ప్రాంతాన్ని చార్మినార్ జోన్‌లో కలిపేఅంశాన్ని పరిగణలోకి తీసుకుంటామని తెలంగాణా పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.సోమవారం నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో కాంగ్రెస్ విజయభేరియాత్ర సభను నిర్వహించారు.ఈసభకు నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అధ్యక్షత వహించగా తెలంగాణ పిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగాహాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ బిఆర్ఎస్ పాలనలో నర్సాపూర్ నియోజకవర్గం అభివృద్ధిలో చాలా వెనకబడిపోయిందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం, అమ్ముడుపోయి పార్టీ పిరాయింపులు చేసి బిఆర్ఎస్ పార్టీలో చేరారన్నారు.వారికి కనువిప్పుకలిగేల కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీఫిరాయించిన ఒక నమ్మక ద్రోహికి బిఆర్ఎస్ నర్సాపూర్ టికెట్టు ఇచ్చిందని అన్నారు. నర్సాపూర్ నియోజకవర్గం లంబాడి సోదరులకు అడ్డాలని పేర్కొంటు.ఈ తండాల అభివృద్ధి కి బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు.బంగారు తెలంగాణా చేస్తామన్నా కెసిఆర్ బొందలగడ్డ తెలంగాణగా మార్చారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీల పథకాలను ఖచ్చితంగా అమలు చేసి తీరుతుందని అన్నారు. నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉన్నానని తనను ఆశీర్వదించి కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు అత్యధికంగా ఓట్లు వేసి గెలిపించాలని ఆవులరాజిరెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు చిలుముల సుహాసిని రెడ్డి,పల్లె జయశ్రీ, నాయకులు శేషసాయిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సుదీర్‌రెడ్డి,అడ్డంకి దయాకర్, తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబుకు బెయిలు

>> నెల 30న ఏసీబీ కోర్డు ముందు చంద్రబాబు హాజరు కావాలని చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసిన న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు ఆదేశించారు.చికిత్సకు సంబంధించిన నివేదికను ఏసీబీ కోర్టులో అందించాలని ఆదేశాలు జారీ చేసారు.సాక్షలును ప్రభావితం చేస్తారన్న ప్రాసిక్యూషన్ వాదనకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు.నిధులు విడుదల చేసినంత మాత్రాన నేరంలో పాత్ర ఉందని చెప్పలేమన్నారు. చంద్రబాబు,తెలుగుదేశం ఖాతాకు నిధులు మళ్లింపుపై ఆధారాలపై స్పష్టమైన సమాచారం అవసరమై ఉంది. ప్రతి ఉపగుత్తేదారుల తప్పులకు సీఎంను బాధ్యుడా అన్న అంశంపైన అధ్యయనం జరగాలన్నారు, అంతవరకు ఆయన బాధ్యుడు అవుతాడని స్పష్టం చేయలేమన్నారు.ఉల్లంఘనలపై అధికారులకు సీఎం జగన్‌కు చెప్పినట్లు ప్రాథమిక ఆధారాలు లేవు.ఈ కేసు విచారణ మొదలయా ్యక 22 నెలలు చంద్రబాబు బయటే ఉన్నారు.కొద్ది రోజులకు ముందు కొన్ని కీలకాధారాలును సీఐడీ ఈ కేసులో సంపాదించినట్లు వెల్లడించింది.వీటి ఆధారంగా ఈ కేసులో చంద్రబాబును కీలక నిందితునిగా పేర్కొంటూ సీఐడీ చం ద్రబాబును అరెస్ట్ చేసింది.ఈ కేసులో విచారణ కాలంలో చంద్రబాబు కేసును ప్రభావితం చేసారనేందుకు ఒక్క ఆధారం లేదని ఆయన తరపు న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తి ఎదుట వాదించారు. విచారణ కాలంలో ఆయన కేసును ప్రభావితం చేసారనేందుకు ఒక్క ఆధారం లేదన్నారు.కేసు విచారణకు చంద్రబాబు విఘాతం కలిగించే అవకాశం లేదన్నారు.సీమెన్స్ డైరెక్టర్, డిజైన్‌టెక్ యాజమాని వాట్సప్ సందేశాలకు,చంద్రబాబుకు సంబంధం ఏమిటని చంద్రబాబు న్యాయవాదులు వాదించారు.ఈ కేసులో సీఐడీ తరపున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు విన్పించారు.లొంగిపోయేటప్పుడు రాజమండ్రి జైలు అధికారికి సీల్డ్‌కవర్‌లో వైద్య నివేదికలు అందజేయాలని న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను చంద్రబాబు ఉల్లంఘించారన్నారు.ఆ నివేదికలు నమ్మశక్యంగా లేవని,బెయిల్ మంజూరుకు వాటిని పరిగణనలోకి తీసుకోనక్కరలేదని, ప్రభుత్వ వైద్యులతో పరీక్షలు చేయించాలని,మధ్యంతర బెయిల్ పొందిన చంద్రబాబు హైదారాబాద్‌హ వెళ్ళి ర్యాలీ నిర వ్రహించి, కోర్టు షరతులను ఉల్లంమించారు.బేగంపేట పోలీసులు ఆయనపై కేసునమోదు చేసారని తెలిపారు.ఈ కేసులో ఇతర నిందితులకు బెయిల్ మంజూరయిందన్న కారణంతో పిటిషనర్‌కు బెయిల్ ఇవ్వాలని న్యాయవాదులు కోరడం సరికాదన్నారు.అందువల్ల ఆయనకు బెయిల్ ఇవ్వొద్దని కోర్టును అభ్యర్దించారు.దీనిపై వాదోపవాదాలను విన్న పిమ్మట గత వారం తీర్పును హైకోర్టు రిజర్వు చేసింది.ఈ రోజు తీర్పును వెల్లడిస్తూ కేసులో నిందితుని అనారోగ్య కారణాలు,సాంకేతికంశాలను పరిగణనలోకి తీసుకుని ఆయనకు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది.బెయిల్ మంజూరు చేసినంత మాత్రన నిందితునిపై నేరాభియోగాలకు సంబంధించి సాక్ష్యాధారాలు లేవనే దిశలో ఈ న్యాయస్థానం భావించడం లేదని న్యాయమూర్తి జస్టిస్ మల్లిఖార్జునరావు స్పష్టం చేసారు. ప్రాసిక్యూషన్ నిందితునిపై తదుపరి విచారణల్లో నేరాధారాలు చూపించాల్సివుంటుందన్నారు.



సోమవారం కోరుట్లలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

# ప్రజల పార్టీ బిజెపియే

>> దినోత్సవం నిర్వహిస్తామన్నారు. ఈసందర్భంగా వీరబైరాన్‌పల్లిలో రజాకార్ల దుశ్చర్య దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. బైరాన్‌పల్లి అమరులను స్మరించుకుంటూ స్మారక స్మృతి నిర్మించబోతున్నామన్నారు. ప్రస్తుత అధికార పార్టీ ఎమ్మెల్యే భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా చేస్తుంటే ఇప్పుడు వచ్చిన అభ్యర్థి కూడా అదేకోవకు చెందిన వ్యక్తి అని ఆరోపించారు. కేసీఆర్, ఎంఐఎం రెండు పార్టీలు ఒకే డీఎన్ఏకు చెందినవని, 2జీ కేసీఆర్, 3జి ఎంఐఎం, 4జి కాంగ్రెస్ అని మూడు కుటుంబ పార్టీలేనని, బీజేపీ ఒక్కటే ప్రజల పార్టీ అన్నారు. మోడీని ఈ ప్రపంచం విశ్వగురువుగా గుర్తించిందని, జి 20సదస్సులో ప్రపంచ నాయకుడిగా మోడీకి ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. 70ఏళ్ల స్వాతంత్రావనిలో బ్రిటీష్ భవనాల్లోనే పరిపాలన జరుపుకున్నామని మోడీ వచ్చిన తరువాత కొత్త పార్లమెంట్ నిర్మాణం చేసుకుని దేశ ఔన్నత్యాన్ని మరింత పెంచామన్నారు. మోడీ కృషివేల్ల చంద్రయాన్‌కు వెళ్లి మూడురంగుల జెండాను ఎగురవేయగలిగామని, 75ఏళ్ల స్వాతంత్ర్యంలో ఏ పార్టీ వ్యక్తి తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చేయలేదని, బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేసి గౌరవిస్తామన్నారు. అదేవిధంగా మాదిగర రిజర్వేషన్లకు బీజేపీ పార్టీ కట్టుబడి ఉందని, అది చేసి నిరూపిస్తాం అన్నారు. నంబర్ వన్ అవినీతిలో కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు పొందిందని, బీజేపీ అధికారంలోకి రాగానే కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబం జైలుకు వెళ్లక తప్పదన్నారు. మిషన్ భగీరథ, పాస్‌పోర్టు, మియాపూర్ భూములు, ఔటర్‌రింగ్‌రోడ్డు, మిషన్ కాకతీయ, మిషన్‌భగీరథ, ఓఆర్‌లతో వేల కోట్లు అవినీతి జరిగిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా ముస్లింలకు కల్పించిన నాలుగు శాతం రిజర్వేషన్లు బీజేపీ అధికారంలోకి రాగానే తొలగించి ఎస్సీ, బీసీలకు ఇస్తామన్నారు. నిజాంబాద్‌లో పసుపు రైతులకు అంతర్జాతీయంగా మార్కెట్ పెంచేందుకు బీజేపీ ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ధాన్యానికి మద్దతు ధర రూ.3100కు పెంచుతామని, అర్హులైన ప్రతీ మహిళకు ఏడాదిలో నాలుగు సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. పేదలకు కార్పోరేట్ వైద్యంకోసం పదిలక్షలు సాయం అందిస్తామని, వచ్చే ఏడాది అయోధ్య రామ మందిరంలో విగ్రహాల ప్రతిష్ఠకు ప్రధానమంత్రి నరేంద్రమోడీ ముఖ్య అతిథిగా రానున్నారని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అయోధ్య యాత్రకు ఉచితంగా అవకాశం కల్పిస్తామన్నారు. మూడవసారి నరేంద్రమోడీని ప్రధానమంత్రి చేసేందుకు మనమంతా కంకణబద్ధులై పనిచేయాలని, నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో మూడు నియోజకవర్గాలకు ఎమ్మెల్యే అభ్యర్థులు జనగామ ఆరుట్ల దశమంత్‌రెడ్డి, స్టేషన్‌ఘన్‌పూర్ గుండె విజయరామారావు, పాలకుర్తి లేగ రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా నాయకులు కేవీఎల్ఎన్.రెడ్డి, వారణాసి పవన్‌శర్మ, మహంకాళి హరిశ్చంద్రగుప్తా, కె.శ్రీనివాస్ తదితర నాయకులు పాల్గొన్నారు.

**బిజెపితో ప్రజా కుటుంబ పాలన వస్తుంది: అమిత్‌షా**

**మెట్‌పల్లి, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబ పాలన మాత్రమే నడుస్తుందని ప్రజలు బిఆర్ఎస్ పాలనకు చరమ గీతం పాడే సమయం ఆసన్నమైందని బిజెపి ప్రభుత్వం మాత్రమే ప్రజా కుటుంబ పాలనను నడిపిస్తుందని త్వరలోనే కుటుంబ పాలన నుండి తెలంగాణ రాష్ట్రానికి బిజెపి ప్రభుత్వం విముక్తి కలిగించి ప్రజా కుటుంబ పాలనను ఆరంభిస్తుందని కేం ద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. పట్టణంలోని అంబేద్కర్ మినీ స్టేడియంలో భారతీయ జనతా పార్టీ బహిరంగ సభ జరిగింది. ఇట్టి సభకు ముఖ్య అతిథిగా హాజరైన కేం ద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా మాట్లాడుతూ కెసిఆర్ కుటుంబ అవినీతి పాలనపై కమిటి వేసి విచారించి జైలుకు పంపుతానాన్నరు. తండ్రి కొడుకులతో బిఆర్ఎస్ 2జి, ఓవైసిలతో కాంగ్రెస్ 3జి, కాంగ్రెస్ కుటుంబ పాలనతో 4జి పార్టీలుగా ఉన్నాయని విమర్శించారు. కుటుంబ పార్టీలను అంతమొందించడానికి ప్రతి ఒక్కరు బిజెపికు అండగా నిలబడాలని కోరారు. తెలంగాణాలో కారు స్టీరింగ్ కవిత, కెటిఆర్ చేతుల్లో లేదని ఎంఐఎం పార్టీ ఓవైసీ చేతుల్లో ఉందని తెలిపారు. సిఎం కెసిఆర్ ఓవైసికి భయపడి విమోచన దినోత్సవాన్ని జరపడం లేదని విమర్శించారు.బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర దినోత్సవంగా జరుపుతామన్నారు. బిసిలను కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు మోసం చేశాయని బిజెపి మాత్రం బిసి ముఖ్యమంత్రి మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. పసుపు బోర్డు విషయంలో ఎంపి అర్వింద్ కేంద్రాన్ని ఒప్పించి సాధించడాని పసుపు ఆయుర్వేద గుణాలపై అధ్యయనం చేసేందుకు రూ.200కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక మూతపడిన చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించడంతో పాటు గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఎన్నారై మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నిజామాబాద్‌లో బీడీ కార్మికుల కోసం 500 పడకలతో అతి పెద్ద ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ కోసం మేమే బిజెపి చిత్తశుద్ధితో ఉందని మాదిగలకు తగిన న్యాయం చేస్తామని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గంలో బిజెపి బలపరిచిన అభ్యర్థి అర్వింద్ ధర్మపురిని గెలిపిస్తే పెద్ద స్థానంలో ఉంచుతామన్నారు. ప్రజలు అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తే పార్టీ అయిన బిజెపి పార్టీ వైపే ఉన్నారాని తెలంగాణలో వచ్చేది బిజెపి ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మపురి అర్వింద్, జగిత్యాల అభ్యర్థి బోగ శ్రావణి, బిజెపి నాయకులు బొడ్ల రమేష్, కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, ఆకుల లింగారెడ్డి, సురభి నవీన్‌కుమార్, చెట్లపల్లి సుఖేందర్‌గౌడ్,డా.జెఎన్.సునీతా వెంకట్, వడ్డెపల్లి శ్రీనివాస్, గుంటుక సదాశివ్, బిజెవైఎం నాయకులు దొనికెల నవీన్, యాదగిరి బాబు, జిల్లా, మండల, పట్టణ, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ ముక్కు నేలకు రాయాలి

>> నాయకుడు రేవూరి ప్రకాష్‌రెడ్డి అని కేసిఆర్ మతితప్పి మాట్లాడుతుండో.. మందేసి మాట్లాడుతుండో తెలియడం లేదన్నారు. ఇందిరమ్మ రాజ్యాన్ని తప్పుబడుతుండు, దొరల రాజ్యం కావాలా..? ఇందిరమ్మ రాజ్యం కావాలా పరకాల ప్రజలు తేల్చుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో అభివృద్ధి ఇందిరమ్మ రాజ్యంలోనే జరిగిందని ఇందిరమ్మ రాజ్యాన్ని తప్పుపట్టిన కేసిఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపన చెప్పాలని డిమాండ్ చేశారు. సోనియమ్మ మాటంటే శిలాశాసనం ఇచ్చన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చినట్లే అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసితీరుతామని రేవంత్‌రెడ్డి వాఖ్యనించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి నెల రేషన్ సన్నబియ్యం రైతులకు రూ.రెండులక్షలు రుణమాఫి జరగాలన్న ఉద్యోగాల భర్తీ జరగాలన్న కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరారు. మహిళలకు ప్రతి నెల రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలెండర్ అందిస్తామని చెప్పారు. బిల్లు చూడగానే కరెంట్ షాక్ కొట్టే పరిస్థితి. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు కౌలు రైతులకు ప్రతి యేటా ఎకరాకు రూ.150వేలు, రైతు కూలీలకు రూ.12వేలు అందిస్తామన్నారు. చేయూత పథకం ద్వారా నెలకు రూ.4వేల పెన్షన్ అందజేయనున్నట్లు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉచిత విద్యుత్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కానీ కేసిఆర్ ఆ క్రెడిట్ తన ఖాతాలో వెసుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఇనగాల వెంకట్‌రామ్‌రెడ్డి, సీనియర్ నాయకులు దొమ్మటి సాంబయ్య, గన్నోజు శ్రీనివాసచారి, ప్రజాప్రతినిధులు, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 21-11-2023, మంగళవారం
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం,
కార్తీకమాసం, దక్షిణాయనం,
శరదృతువు, శుక్లపక్షం
నవమి రా.1.10, శతభిష రా.8.01
వ.రా.2.04-3.33, దు.ఉ.8.30-9.15,
2) రా.10.37-11.27
శుభసమయం లేదు, అనురాధ కార్తె
రాహుకాలం మ.3.00-4.30 వరకు

## వార్తాఫలం

**మేషం :** లలితకళలపట్ల ఆసక్తిని కనబరుస్తారు. సాహసోపేతమైన నిర్ణయాలను తీసుకుంటారు.

**వృషభం :** ఉన్నతాధికారులతో చాకచక్యంగా వ్యవహరిస్తారు. బహుమతులను ఇచ్చిపుచ్చుకుంటారు.

**మిథునం :** వ్యక్తిగత ప్రతిష్టను పెంపొందించుకోవడానికి ప్రాముఖ్యతనిస్తారు.

**కర్కాటకం :** మీకు మేలు కలిగించే సంఘటనలు చోటు చేసుకుంటాయి. పనులలో వేగం కనబడుతుంది.

**సింహం :** ఆర్థిక వనరులను పెంపొందించుకోవడానికి గాను అనుకూలమైన మార్గాలు లభిస్తాయి.

**కన్య :** జీవిత భాగస్వామి సలహాలను పరిగణలోనికి తీసుకుంటారు. ధన లాభ సూచన.

**తుల :** ప్రకృతి వైద్యం పట్ల మక్కువను చూపుతారు. క్షణం తీరిక లేకుండా కాలాన్ని గడుపుతారు.

**వృశ్చికం :** సన్నిహిత వర్గం యొక్క అభివృద్ధి సంతోషం కలిగిస్తుంది. క్రమశిక్షణకు ప్రాధాన్యతనిస్తారు.

**ధనుస్సు :** మిత భాషిత్వాన్ని, సహనాన్ని, ఓర్పును కలిగి ఉంటారు. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారు.

**మకరం :** సహోద్యోగులు అసూయపడే విధంగా మీ పని తీరు ఉంటుంది. వత్తిడికి లోనవుతారు.

**కుంభం :** అకౌంట్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటారు. ఓర్పును కలిగి ఉండండి.

**మీనం :** రావలసిన ధనం సకాలంలో చేతికందివస్తుంది. దైవ దర్శనం చేసుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

| SINGAM KUIL YELLOW MONDAY DrawDate on:20/11/23 | | ROSA DEAR ROYAL MONDAY DrawDate on:20/11/23 | |
|---|---|---|---|
| DAY - SINGAM SERIES Dr No:214 | DAY - KUIL SERIES Dr No:214 | DAY - ROSA SERIES Dr No:214 | DAY - DEAR SERIES Dr No:214 |
| 1st Prize Rs.100000/- 248935 | 1st Prize Rs.100000/- 639837 | 1st Prize Rs.100000/- 396452 | 1st Prize Rs.100000/- 166699 |
| 2nd Prize Rs.7000/- 74557 | 2nd Prize Rs.7000/- 51914 | 2nd Prize Rs.7000/- 04827 | 2nd Prize Rs.7000/- 80289 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 13505 18619 35735 50872 54051 | 04125 15828 34008 38877 41576 | 03640 12735 31102 37620 50210 | 07697 08156 23705 41729 42554 |
| 55841 61858 74708 82864 83318 | 44550 48914 50636 56754 59115 | 64749 75213 75585 93714 99486 | 49762 55725 62013 75672 98345 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0494 1655 1839 2863 4814 5286 5334 | 0439 1083 2226 3320 4673 6518 6790 | 1047 1427 1756 3011 3407 5661 6068 | 0673 3792 3857 4590 5591 7375 8910 |
| 7003 7800 9369 | 7602 8125 9937 | 7638 8148 9093 | 9510 9856 9916 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0172 1340 1550 2352 3110 4327 6580 | 0037 1629 1785 3264 3461 3557 5043 | 0373 3279 3891 5458 5703 6429 6899 | 0594 2207 4322 5455 6890 7146 7198 |
| 7568 8227 9994 | 6460 8263 8815 | 7052 8690 9222 | 7261 7815 9731 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0096 1575 2949 4369 5992 7886 9042 | 0008 1128 2759 4651 6382 8127 9283 | 0001 1041 2218 3262 5421 7897 9343 | 0139 1242 2726 4565 5963 7589 9382 |
| 0223 1612 2998 4439 5996 7889 9137 | 0013 1220 3093 4723 6425 8142 9300 | 0038 1094 2226 3390 5601 8157 9403 | 0197 1350 2783 4637 5967 7622 9610 |
| 0419 1616 3031 4560 6010 7906 9176 | 0025 1295 3134 4786 6437 8163 9425 | 0126 1293 2233 3393 5701 8272 9546 | 0241 1352 3007 4735 6431 7642 9615 |
| 0437 2061 3308 4696 6196 8092 9385 | 0061 1499 3232 4796 6627 8250 9526 | 0222 1544 2298 3414 5750 8279 9563 | 0258 1544 3032 4824 6534 7715 9747 |
| 0464 2194 3693 4698 6253 8107 9441 | 0106 1739 3368 4824 6645 8272 9619 | 0234 1548 2319 3437 5904 8425 9566 | 0387 1612 3117 4872 6547 7724 9750 |
| 0607 2228 3731 4846 6523 8265 9476 | 0323 1844 3493 5050 6882 8320 9662 | 0449 1564 2557 3454 6067 8523 9587 | 0436 1776 3204 4973 6857 7750 9790 |
| 0623 2251 3932 4869 6562 8272 9521 | 0382 2033 3508 5127 6941 8379 9718 | 0483 1640 2612 3579 6121 8811 9638 | 0493 1873 3383 5014 7160 7802 9838 |
| 0742 2582 3951 5066 6570 8290 9671 | 0521 2116 3880 5356 6977 8388 9806 | 0538 1710 2660 3806 6321 8941 9800 | 0528 1895 3610 5064 7213 7881 9853 |
| 0912 2659 3979 5069 6617 8512 9804 | 0652 2152 4033 5472 7007 8467 9874 | 0594 1740 2737 3923 7080 8972 9823 | 0535 1949 3850 5177 7284 8575 9914 |
| 1049 2676 4057 5181 7201 8529 9914 | 0670 2170 4140 5576 7146 8511 9983 | 0654 1766 2816 4014 7144 9037 9957 | 0608 1973 3973 5228 7371 8612 9974 |
| 1204 2691 4065 5287 7209 8593 | 0747 2182 4170 5720 7398 8710 | 0866 1818 2957 4195 7310 9078 | 0784 2075 4029 5303 7442 8667 |
| 1214 2849 4089 5298 7323 8651 | 0750 2255 4220 5846 7418 8892 | 0912 1857 3004 4198 7329 9202 | 0859 2081 4330 5516 7517 8685 |
| 1244 2861 4102 5440 7410 8663 | 0798 2295 4233 5967 7803 9018 | 0930 2050 3010 4338 7581 9240 | 0874 2338 4444 5681 7526 8802 |
| 1328 2867 4183 5498 7440 8739 | 0905 2576 4274 5968 7968 9132 | 1023 2059 3023 4454 7666 9274 | 0922 2396 4498 5684 7562 8865 |
| 1408 2934 4315 5849 7861 8828 | 0960 2650 4276 6326 7989 9212 | 1038 2163 3149 4489 7887 9321 | 1038 2605 4530 5704 7575 8979 |

| THANGAM VAIRAM LUCK MONDAY DrawDate on:20/11/23 | | NALLANERAM MANI LUCK MONDAY DrawDate on:20/11/23 | |
|---|---|---|---|
| DAY - THANGAM SERIES Dr No:214 | DAY - VAIRAM SERIES Dr No:73 | DAY - NALLANERAM SERIES Dr No:214 | DAY - MANI SERIES Dr No:73 |
| 1st Prize Rs.100000/- 887598 | 1st Prize Rs.50000/- 564269 | 1st Prize Rs.50000/- 326842 | 1st Prize Rs.50000/- 697693 |
| 2nd Prize Rs.7000/- 91492 | 2nd Prize Rs.7000/- 79534 | 2nd Prize Rs.7000/- 16668 | 2nd Prize Rs.7000/- 83378 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 26886 37939 49530 52893 59264 | 05922 05962 24945 25733 28628 | 06297 10472 12064 35709 43173 | 05384 07762 12849 28658 34991 |
| 66624 71743 82348 91166 99939 | 36043 54279 58884 66177 82687 | 54806 72557 76850 77943 92461 | 42678 43300 51268 59394 75738 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0409 1682 2568 2778 3437 3957 7210 | 1098 1527 2497 2545 2923 4409 4959 | 1708 1924 3405 3879 4781 5069 5423 | 0664 0936 5075 5560 5639 7130 7781 |
| 7555 7583 7599 | 7161 8690 9755 | 6115 9234 9451 | 8246 9453 9589 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 1211 1512 3743 3762 4269 4724 5601 | 0493 0761 1180 1300 1716 2520 2551 | 1450 2577 2917 3087 4024 7000 7870 | 0135 0452 0563 0571 1000 2118 3242 |
| 7495 8254 8576 | 5635 7907 8715 | 7878 8605 9759 | 8449 8551 9345 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0102 1222 2134 4436 6246 7638 8903 | 0008 1877 3312 4906 6527 7492 8861 | 0062 1587 2556 4050 5250 6710 8698 | 0075 1899 3676 4893 6095 7162 8666 |
| 0143 1223 2141 4437 6432 7805 9005 | 0470 1890 3562 4978 6597 7559 8966 | 0113 1733 2590 4075 5334 7311 8788 | 0225 2437 3782 4902 6353 7287 8670 |
| 0227 1225 2482 4594 6826 7848 9020 | 0572 2037 3787 5080 6677 7821 9110 | 0157 1741 2642 4185 5381 7492 8833 | 0285 2507 4007 5064 6354 7394 8805 |
| 0372 1360 2627 4974 6850 7867 9100 | 0631 2287 3798 5103 6714 7872 9181 | 0239 1757 3053 4205 5504 7646 8858 | 0533 2532 4040 5089 6436 7597 8868 |
| 0398 1373 2848 4993 6885 7905 9389 | 0647 2555 3845 5310 6813 7909 9375 | 0343 1824 3083 4242 5538 7669 8979 | 0534 2620 4193 5124 6521 7883 9025 |
| 0401 1375 2989 4996 6962 7973 9395 | 0681 2643 3868 5421 6857 7953 9457 | 0359 1895 3127 4247 5578 7698 9549 | 0876 2651 4203 5228 6580 7902 9224 |
| 0471 1419 3031 5481 6974 8032 9445 | 0817 2741 3895 5441 6978 7976 9705 | 0391 1907 3248 4261 5641 7743 9623 | 0884 2745 4233 5407 6633 7923 9252 |
| 0572 1439 3132 5640 6975 8057 9450 | 0889 2813 3938 5608 6999 8379 9722 | 0492 1973 3251 4324 5704 7754 9808 | 1056 2776 4293 5440 6635 7941 9554 |
| 0589 1516 3172 5842 6987 8161 9622 | 1182 2978 4180 5642 7001 8435 9770 | 0542 2129 3269 4341 5761 7811 9820 | 1132 3075 4352 5517 6733 7972 9560 |
| 0734 1641 3376 5891 7143 8395 9699 | 1305 2980 4399 5671 7014 8518 9802 | 0601 2131 3540 4406 5825 7842 9991 | 1188 3343 4403 5783 6772 8126 9820 |
| 0756 1685 3421 5929 7173 8445 | 1315 3146 4469 5893 7175 8559 | 0734 2258 3549 4573 6045 7868 | 1395 3357 4730 5851 6773 8388 |
| 0792 1776 3546 5954 7274 8504 | 1335 3194 4528 5959 7217 8572 | 0765 2280 3730 4600 6223 8151 | 1401 3404 4731 5904 6784 8530 |
| 0925 1802 4068 6048 7505 8550 | 1441 3212 4705 6156 7269 8686 | 0917 2401 3736 4808 6417 8226 | 1626 3414 4739 5916 6888 8588 |
| 0931 2009 4189 6228 7579 8570 | 1591 3263 4890 6279 7278 8719 | 0934 2424 4013 5063 6465 8376 | 1650 3591 4802 5978 6915 8593 |
| 0973 2122 4374 6236 7624 8710 | 1813 3285 4898 6345 7280 8842 | 1350 2518 4025 5244 6619 8404 | 1748 3651 4808 6041 7094 8642 |

| KUMARAN VISHNU SUN MONDAY DrawDate on:20/11/23 | | SWARNALAXMI LION PEARL MONDAY DrawDate on:20/11/23 | |
|---|---|---|---|
| DAY - KUMARAN SERIES Dr No:214 | DAY - VISHNU SERIES Dr No:214 | DAY - SWARNALAXMI SERIES Dr No:214 | DAY - LION SERIES Dr No:73 |
| 1st Prize Rs.50000/- 128576 | 1st Prize Rs.50000/- 554541 | 1st Prize Rs.50000/- 276276 | 1st Prize Rs.50000/- 697892 |
| 2nd Prize Rs.7000/- 68536 | 2nd Prize Rs.7000/- 52749 | 2nd Prize Rs.7000/- 98237 | 2nd Prize Rs.7000/- 18997 |
| 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- | 3rd Prize Rs.3500/- |
| 02485 03782 19284 25882 40087 | 07655 22252 23533 38460 53111 | 13685 19898 24755 34867 41321 | 14342 15667 25781 38928 47567 |
| 47208 48357 56192 62194 91119 | 58586 59915 66123 66263 87392 | 56342 67851 74363 83406 83659 | 53608 62389 75963 87230 99456 |
| 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- | 4th Prize Rs.200/- |
| 0176 1512 3195 4726 5008 5371 6485 | 1047 1307 1486 1858 2233 2529 3541 | 0855 2507 3408 5647 5884 6528 6891 | 0231 0770 3521 3991 4036 4670 4773 |
| 7405 8263 9713 | 3627 9654 9744 | 7091 7306 8422 | 6214 7362 8330 |
| 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- | 5th Prize Rs.100/- |
| 0265 0419 0590 1827 2719 3556 4990 | 0418 0865 5297 5942 6003 8054 8345 | 0129 0369 1932 3182 4506 5319 6964 | 0283 2991 3120 4420 4724 4784 6206 |
| 5387 6702 8644 | 9205 9785 9983 | 7032 8902 9361 | 7080 8238 8411 |
| 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- | 6th Prize Rs.50/- |
| 0063 0914 1857 4286 5690 7240 8816 | 0129 1537 2549 3943 6142 7361 8600 | 0119 1325 2872 3918 5933 7416 9335 | 0131 2352 3605 5137 6187 7128 9004 |
| 0114 0926 1896 4428 5707 7311 8823 | 0212 1737 2794 4093 6183 7501 8652 | 0157 1388 3003 4182 6137 7434 9392 | 0150 2358 3904 5161 6241 7184 9018 |
| 0148 0943 1910 4587 5806 7454 8831 | 0256 1823 3023 4193 6544 7661 8792 | 0200 1801 3146 4368 6263 7635 9528 | 0151 2449 3924 5185 6395 7442 9093 |
| 0254 1004 2294 4635 6008 7757 9142 | 0291 1831 3068 4431 6627 7664 9079 | 0322 1861 3177 4414 6422 7690 9531 | 0193 2583 3945 5340 6500 7477 9183 |
| 0269 1078 2373 4702 6210 7805 9314 | 0373 1930 3287 4489 6632 7771 9081 | 0498 1883 3280 4458 6440 7715 9541 | 0247 2681 4008 5482 6563 7687 9243 |
| 0272 1087 2694 4770 6222 7948 9343 | 0414 1966 3409 4662 6656 7780 9240 | 0543 1918 3284 4517 6561 7970 9622 | 0504 2706 4034 5619 6601 7760 9255 |
| 0318 1291 2814 4936 6242 7959 9348 | 0490 2087 3451 5073 6749 7987 9249 | 0615 1975 3314 4749 6580 8214 9824 | 0544 2757 4086 5663 6619 7800 9319 |
| 0415 1343 3052 5012 6605 7995 9491 | 0721 2130 3480 5159 6816 8006 9301 | 0635 2062 3321 4902 6693 8229 9859 | 0694 2838 4304 5665 6654 7890 9553 |
| 0484 1405 3090 5116 6669 8064 9579 | 0729 2132 3547 5192 6984 8055 9911 | 0723 2162 3341 5490 6894 8392 9921 | 0964 3016 4495 5701 6663 7971 9576 |
| 0507 1441 3138 5301 6868 8067 9732 | 0756 2134 3655 5434 6998 8114 9986 | 0731 2179 3420 5505 7126 8396 9980 | 1327 3121 4571 5843 6778 8078 9663 |
| 0577 1451 3666 5435 6943 8103 | 0823 2180 3714 5441 7036 8145 | 0856 2199 3460 5603 7164 8463 | 1338 3306 4638 5877 6828 8181 |
| 0664 1480 3856 5457 6981 8132 | 0992 2222 3760 5552 7073 8216 | 1126 2257 3525 5614 7185 8915 | 1421 3331 4713 5889 6911 8264 |
| 0678 1666 3937 5549 7011 8305 | 1067 2335 3769 5644 7175 8250 | 1159 2312 3679 5687 7290 8939 | 2023 3468 4727 5916 6953 8359 |
| 0716 1763 3993 5572 7056 8596 | 1082 2445 3815 5836 7286 8410 | 1167 2536 3708 5822 7365 9012 | 2227 3479 4798 5956 6963 8432 |
| 0865 1797 4020 5577 7122 8656 | 1337 2446 3941 5911 7290 8557 | 1184 2707 3779 5850 7368 9107 | 2241 3571 4851 6081 6993 8616 |

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

21-11-2023 మంగళవారం సంపుటి : 29 సంచిక : 291 పేజీలు : 10+4 వెల : 6.50



కిసాన్ సమ్మాన్ రూ.12 వేలకు పెంచుతాం: ప్రధాని 5లో

స్టేడియం భవనం కూలి ఇద్దరు కూలీలు దుర్మరణం 6లో









కరీంనగర్‌లో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ప్రసంగిస్తున్న సిఎం కెసిఆర్. సభకు హాజరైన ప్రజలు

# అది 'భూమేత' పార్టీ

## కాంగ్రెస్ హయాంలో ప్రజల వలసలు

## ఆటోల ఫిట్‌నెస్ ఛార్జీలు రద్దు చేస్తాం

## ప్రజలు మంచి ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

### తిమ్మాపూర్ ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి కెసిఆర్

**కరీంనగర్ ప్రతినిధి, ప్రభాతవార్త:** ఓటు మీ తలరాతను మారుస్తుంది, అందుకే ఆలోచించి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయండి అని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. ఆలోచించకుండా అడ్డగోలుగా ఓటు వేస్తే తెలంగాణ ప్రజల బతుకులు ఆగం అవుతాయని స్పష్టం చేశారు. సోమవారం మానకొండూరు నియోజకవర్గంలోని తిమ్మాపూర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయం, వైద్యం వెంబడి పడి ఓ దారికి తెచ్చామని అన్నారు. వచ్చే దఫాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టి ఉద్యోగావకాశాలు పెంచుతామని ప్రకటించారు. ఇండ్లులేని వాళ్లకు ఈసారి యుద్ధప్రాతిపదికన కట్టి ఇస్తామన్నారు. తెలంగాణలో రైతుల వరి ధాన్యం పండించినట్లు, వచ్చే ఐదేళ్ల యుద్ధప్రాతిపదికన అర్హులైన

≫2

# ప్రజల పార్టీ బిజెపియే



జనగామలో సోమవారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న కేంద్రహోంమంత్రి అమిత్‌షా, సభకు హాజరైన ప్రజలు

## బిఆర్ఎస్, ఎంఐఎం రెండుపార్టీలు ఒక్కటే.. మాదిగ రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం

## ప్రధాని మోడీని ప్రపంచం విశ్వగురువుగా గుర్తించింది: జనగామలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**జనగామ టౌన్, నవంబరు 20 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికలు దేశ, రాష్ట్ర భవిష్యత్‌కు దిశా నిర్దేశం లాంటివని, అదేవిధంగా బీజేపీ ప్రధాని హామీ ఇచ్చిన విధంగా మాదిగ రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని అమలు చేసి చూపిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. జనగామ జిల్లాకేంద్రంలో సోమవారం బీజేపీపార్టీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి గెలుపుకోసం పట్టణంలోని ప్రెస్టన్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో కేంద్ర హోంశాఖమంత్రి అమిత్‌షా హాజరై మాట్లాడుతూ మొదట నియోజకవర్గంలోని కొమురెల్లి మల్లన్న, సిద్దుల గుట్ట సిద్దేశ్వరుని ఆశీస్సులు ఉండాలని, తెలంగాణలో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు దేశ, రాష్ట్ర భవిష్యత్‌కు దిశా నిర్దేశం లాంటివన్నారు. నిజాం రాచరిక పాలన, రజాకార్ల అఘాయిత్యాలకు నాటి ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితో తెలంగాణ రాష్ట్రం ప్రజలు విముక్తి పొందారన్నారు. ఎంఐఎం పార్టీకి భయపడ్డ కేసీఆర్ సెప్టెంబరు17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు వెనకడుగు వేస్తున్నారని, తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అధికారికంగా హైదరాబాద్ విమోచన

≫2




## 24 నుంచి ప్రియాంక విస్తృత ప్రచారం



**హైదరాబాద్, నవంబర్ 20,ప్రభాతవార్త:** ఏఐసిసి అగ్రనేత ప్రియాంక వధేరా తెలంగాణ పర్యటన ఖరారైంది. నవంబర్ 24 శుక్ర, నవంబర్ 25 శని, నవంబర్ 27 సోమవారం రోజున తెలంగాణలో ప్రియాంక ఎన్నికల ప్రచారంలో పాల్గొనబోతున్నారు. మూడు రోజుల్లో పది నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొనబోతున్నారు. నవంబర్ 24 మూడు నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొంటారు. శుక్రవారం రోజున 11గంటలకు పాలకుర్తిలో మధ్యాహ్నం హుస్నాబాద్‌లో సాయంత్రం 4గంటలకు ధర్మపురి వీధి కూడలి సమావేశాలు, బహిరంగసభలలో ఆమె పాల్గొంటారు. 25 నవంబర్ తేదిన పాలేరు, ఖమ్మం, వైరా, మధిర నియోజ కవర్గాలలో ప్రచారం చేస్తారు. 27న మునుగోడులో ఉదయం11 గంటలకు, దేవరకొండలో 2గంటలకు గద్వాలలో 4గంటలకు ఎన్నికల ప్రచారం ప్రియాంక నిర్వహిస్తారు.

## 25న తాండూర్‌లో పవన్ ప్రచారం

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ, జనసేనపొత్తుతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా జనసేన 8 సీట్లకు పోటీ చేస్తుండగా.. 111 సీట్లలో బీజేపీ పోటీ చేస్తుంది. ఈ నేపథ్యంలో జనసేన తరపున వికారాబాద్ జిల్లా తాండూర్‌లో శంకర్‌గౌడ్ పోటీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో శంకర్‌గౌడ్ తరపున ఎన్నికల ప్రచారం చేయడానికి ఈ నెల 25న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తాండూర్ రానున్నట్టు తెలుస్తోంది. తమ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. 25న తాండూరు పట్టణంలోని ఇందిరా చౌక్‌లో జనసేన-బీజేపీ నిర్వహించే బహిరంగ సభ కోసం జనసేన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# గ్రూప్-2 ఉద్యోగాలు పెంచుతాం



సోమవారం హైదరాబాద్‌లో యువతీయువకులతో మంత్రి కెటిఆర్

## మళ్లీ రాగానే జాబ్ కేలండర్ విడుదల

## ఉద్యోగాల భర్తీ ప్రక్రియ వేగిరం

## కేసుల పరిష్కారానికి తగిన చర్యలు

## ఎన్నికల ఫలితాలు వెలువడిన మర్నాడు అశోక్‌నగర్ యువతతో సమావేశమవుతా

## ఉద్యోగార్థులైన యువతీయువకులతో మంత్రి కెటిఆర్ చిట్‌చాట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్20:** ఎన్నికల ఫలితాలు తెల్లారి ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న యువకులతో హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో ప్రత్యేకంగా సమావేశం అవుతానని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్,మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తెలిపారు. అశోక్‌నగర్‌తో పాటు పలు యూనివర్సిటీలలో ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న కొంత మంది విద్యార్థులు సోమవారంనాడు కెటిఆర్‌ను కలిశారు. ఆ తర్వాత ప్రభుత్వ నియామకాలకు సంబంధించిన పలు అంశాలపై మంత్రి కెటిఆర్ విస్తృతంగా సంభాషించారు. ఈసందర్భంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో ఉన్న అన్ని సమస్యలపైన కూలంకషంగా చర్చించేందుకు ఎన్నికల ఫలితాలు వెలువడిన తెల్లారి 4వ తేదీన ఉదయం 10 గంటలకు అశోక్‌నగర్‌లో ప్రభుత్వ ఉద్యోగార్థులతో సమావేశం అవుతానని వారికి కెటిఆర్ భరోసా ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో తమ నిబద్ధతను ఎవరు ప్రశ్నించే అవకాశం లేదని.. ముఖ్యంగా సంవత్సరానికి 1000 ఉద్యోగాలు కూడా కల్పించని కాంగ్రెస్ పార్టీకి అసలే లేదన్నారు. తాము రాష్ట్ర యువకులకు లక్ష ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీకి రెట్టింపునకు పైగా 2లక్షల 30వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఇందులో ఇప్పటికే 1,62,000 పైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. దేశంలో తెలంగాణ కన్న ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలను గత పది సంవత్సరాలలో భర్తీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం ఏదీ లేదన్నారు. తమపై కేవలం రాజకీయ దురుద్దేశం ఉంచుకొని విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈవిషయంలో రాష్ట్రయువకులకు సమాధానం

≫7



# చంద్రబాబుకు బెయిలు

## స్కిల్ స్కాంలో మంజూరు చేసిన ఎపి హైకోర్టు

## 28 దాకా మధ్యంతర బెయిలు షరతులు అమలు

**విజయవాడ,నవంబరు20,ప్రభాతవార్తప్రతినిది:** స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో కీలక నిందితునిగా ఉన్న విపక్షనేత చంద్రబాబు నాయుడుకు ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఆయన ఈ నెల 28న రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్ళాల్సిన అవసరం లేదని తెలిపారు. మధ్యంతర బెయిల్ మంజూరు సమయంలో విధించిన షరతులు ఈ నెల28 వరకే వర్తిస్తాయని స్పష్టం చేసింది. 29వ తేది నుంచి రాజకీయ ర్యాలీలు, సభల్లో చంద్రబాబు పాల్గొనవచ్చని న్యాయమూర్తి తెలిపారు. అయితే ఈ

≫2

# కెసిఆర్ ముక్కు నేలకు రాయాలి

## ఇందిరమ్మను అవమానించడమా?

## సిఎంకు ఇవి అంతిమ ఘడియలే..

## పరకాల సభలో పిసిసి చీఫ్ రేవంత్

**పరకాల- ప్రభాతవార్త:** ఇందిరమ్మను అవమానించిన కేసీఆర్ ముక్కు నేలకు రాయాలని టిపిసిసి రాష్ట్ర అద్యక్షుడు రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆకలి చావులే అని నిందారోపణలు చేసిన కేసీఆర్‌కు అంతిమ గడియలు దగ్గర పడ్డాయని కేసిఆర్ అన్నారు. సోమవారం హన్మకొండ జిల్లా పరకాలలో జరిగిన సభకు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి అశేష జన వాహినిని ఉద్దేశించి ప్రసంగించారు. ఏ పార్టీకి రాణంత జనం సభకు రావడంతో ఉత్తేజంగా మాట్లాడారు. కేసిఆర్ అధికారంలోకి వచ్చి పదేళ్ల అయిందని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కేసిఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందని విమర్శించారు. రైతుల ఆత్మహత్యలు నిరుద్యోగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 25లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పంపిణి చేసినట్లు వెల్లడించారు. గత ఎన్నికల సమయంలో కేసిఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. బిఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చెప్పకుండా కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని అన్నారు. సీఎం కేసిఆర్ మరోసారి మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణలో కుటుంబ పాలనకు స్వస్తి పలుకాలని పిలుపునిచ్చారు. దేశంలో కేసిఆర్ లాంటి దోపిడి దారుడు లేడంటూ ఘాటు వాఖ్యలు చేశారు. ఎన్నో ఆకాంక్షలతో సాధించుకున్న తెలంగాణలో పదేళ్లుగా రాష్ట్ర ప్రజలను బిఆర్ఎస్ పార్టీ మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణలో అరాచకం రాజ్యమేలుతుందని రాచరిక పాలన సాగుతుందని పేర్కొన్నారు. కేసిఆర్ పాలనకు కలం చెల్లింది. ఆయనను ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చిందన్నారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీతో కాంగ్రెస్‌ను గెలిపించండి అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేసే బాధ్యత మాది అని చెప్పారు. నిజం నిరంకుశ పాలనపై ఎక్కుపెట్టిన ఫిరంగి పరకాల. తెలంగాణ సిద్ధాంత కర్త జయశంకర్‌సార్ పుట్టినగడ్డ ఇది. అలాంటి ఈ గడ్డను ప్రత్యేక నిధులతో అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటున్నట్లు తెలిపారు. మచ్చలేని అవినీతి, మరుకలేని

≫2



సోమవారం పరకాల సభలో రేవంత్‌రెడ్డి

# 5 ఎన్నికల రాష్ట్రాల్లో రూ.1760 కోట్లు పట్టివేత

## తెలంగాణలోనే అత్యధికంగా రూ.632 కోట్లు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్20:** ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ఉద్దేశించిన రూ.1760 కోట్లు విలువైన ఉచితాలు,డ్రగ్స్,నగదు,మద్యం,విలువైన లోహాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల సంఘం సోమవారం వెల్లడించింది. 2018లో ఈ రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన జప్తుల కంటే ఈసారి ఏడు రెట్లు(గత ఎన్నికల్లో రూ.239.15 కోట్లు) ఎక్కువ జప్తు చేసినట్లు పోల్ ప్యానెల్ తెలిపింది. ఈ వివరాలను అధికారికంగా కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. తెలంగాణలో అత్యధికంగా 236.35 కోట్లు నగదును సీజ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటికే మధ్యప్రదేశ్,చత్తీస్‌గఢ్, మిజోరంలలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగ్గా, రాజస్థాన్,తెలంగాణలో నవంబర్ 25,నవంబర్ 30 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఇప్పటి వరకు తెలంగాణలో మొత్తం 632 కోట్ల రూపాయల విలువ గల నగదు,మద్యం,డ్రగ్స్,గిఫ్ట్ పట్టుకున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. రాజస్థాన్‌లో రూ.93.17 కోట్లు,మధ్యప్రదేశ్‌లో రూ.33.72 కోట్లు పట్టుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం... మిజోరాంలో ఇప్పటి వరకు నగదు లేదా విలువైన లోహం(బంగారం, వెండి తదితర)స్వాధీనం చేసుకోలేదు. అయితే 29.82 కోట్ల విలువైన డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలు ముగిసే సమయానికి ఈ గణాంకాలు భారీగా పెరగనున్నాయి. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో చీఫ్ సెక్రటరీలు,డీజీపీలు,ఎక్సైజ్ కమిషనర్లు, ఇన్‌కమ్ టాక్స్ అధికారులతో కేంద్ర ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు సమీక్ష జరుపుతోంది. 228 మంది కేంద్ర ప్రభుత్వ ఉన్నత అధికారులను ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలకు అబ్జర్వర్లుగా నియమించింది. గతంలో నిర్వహించిన ఆరు రాష్ట్రాలు ఎన్నికల్లో వెయ్యి కోట్లు పట్టుపడగా... ఐదు రాష్ట్రాలకే ఇప్పుడు రూ.1760 కోట్ల విలువైన నగదు,మద్యం పట్టుబడినట్టు ఈసీ స్పష్టం చేసింది.

వార్త

ప్రపంచంలో అనేక అద్భుతాలున్నాయి. కాని మనిషికన్నా అద్భుతమైనది ఏమీ లేదు.

- సొఫొక్లిస్

# సూత్రధారులే మూలం!

చట్టాలకు సామాన్యులు లోకువ, సమర్థులకు చట్టాలు లోకువ అంటారు. ఏ సందర్భంలో ఎవరిని ఉద్దేశించి అన్నారోకానీ మారిన కాలమాన పరిస్థితుల్లో ఇది అక్షరాల నిజం అనిపిస్తున్నది. ఆర్థిక, అంగ, అధికార, రాజకీయ బలం ఉన్నవారు తప్పుచేస్తే చర్యల సంగతి అటుంచి వేలెత్తి చూపడానికి కూడా జంకే దురదృష్టపు పరిస్థితులు దాపురించాయి. మిగిలిన విషయాలు ఎలా ఉన్నా మానవ జాతిని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నియంత్రణలోఅటు పాలకులు కానీ, ఇటు అధికార యంత్రాంగం కానీ సమర్థవంతంగా వ్యవహరించలేకపోతున్నారేమోననిపిస్తున్నది. దేశవ్యాప్తంగా ఎంతో పోలీసు సిబ్బంది ఉంది. నిఘా వ్యవస్థలున్నాయి. ఏకంగా నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఉంది. ఎక్సైజ్,ఎన్‌ఫోర్స్‌మెంట్ తదితర నిఘా విభాగాలు ఎన్నో ఉన్నాయి. నిత్యం నిఘా పెడుతున్నారు. ఇటీవల కాలంలో చెన్నై, ముంబయి, బెంగళూరు తదితర నగరాల్లో విమానాశ్రయాల్లోనూ ఇతర ప్రాంతాల్లో పట్టుబడిన హెరాయిన్ విలువ రూ.500 కోట్లకుపైగానే ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఆ మధ్యఒకసారి కేరళ సమీపంలో అరేబియా సముద్రంలో నౌకాదళం స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ అంతర్జాతీయ మార్కెట్లో దాదాపు నాలుగువేల కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అధికార వర్గాల అంచనా. ఏదో వ్యూహం ప్రకారం వలపన్ని పట్టుకున్నవికాదు. అధికారులు చేస్తున్న తనిఖీల్లో పట్టుబడుతున్నాయి. ఇక విమానాల్లో రహస్యంగా తీసుకువస్తున్న మత్తుపదార్థాలు తక్కువేమీ కాదు. ఇద్దరు మహిళలు సూట్‌కేసుల్లో రహస్యంగా వైర్‌బండిళ్ల మాటున తరలించే ప్రయత్నం చేశారు. కస్టమ్స్ అధికారులకు పట్టుబడ్డారు. ఆహార సరఫరా ముసుగులో మత్తుపదార్థాలు పంపిణీ చేస్తున్న బాగోతం అస్సాంలో వెలుగుచూసింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో మత్తుపదార్థాల వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నట్లు అధికారవర్గాలు అంగీకరిస్తున్నారు. ముంబయి మహానగరంలో కొకైన్ కేంద్రంగా మారినట్లు మాదకద్రవ్యాల నియంత్రణ సంస్థ అంగీకరించక తప్పడం లేదు. ఇక గంజాయి సాగు దేశంలో అనేక రాష్ట్రాలతోపాటు తెలుగు రాష్ట్రాల్లో భారీగానే సాగుచేస్తున్నట్లు సమాచారం. అప్పుడప్పుడు ఎక్సైజ్ పోలీసు అధికారులు దాడులు చేసి గంజాయి పంటను ధ్వంసం చేస్తున్నా మళ్లీ రెండు, మూడు నెలల్లో యధావిధిగా సాగులోకి వస్తున్నాయి. అడవుల్లో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఈ సాగు చేసే స్మగ్లర్లు పట్టుబడగానే అదృశ్యమైపోతున్నారు. కేవలం ఆ ప్రాంతంలో ఉన్న అమాయక రైతులు, రైతు కూలీలు,ఈ కేసుల్లో ఇరుక్కుపోతున్నారు. అంతేకాదు అత్యంత విలువైన మాదకద్రవ్యాల రవాణా వ్యాపారంలో పట్టుబడుతున్నది పాత్రధారులే. వారి వెనుక ఉండే సూత్రధారులను పట్టుకోలేకపోతున్నారు. మాదకద్రవ్యాలు అఫ్ఘనిస్థాన్ నుండి ఆఫ్రికా మీదుగా భారత్ చేరుకొని వివిధ మార్గాల ద్వారా దేశంలోని అన్ని నగరాలకు సరఫరా అవుతున్నాయి. మరొకపక్క మయన్మార్‌లో రెండేళ్ల క్రితం జరిగిన సైనిక తిరుగుబాటు నుంచి మణిపూర్, మిజోరంలలోకి భారీగా మాదకద్రవ్యాలు ప్రవేశిస్తున్నాయి. కొన్ని మాదకద్రవ్యాల ముఠాలు ఈశాన్యభారతంలో వివిధ తీవ్రవాద బృందాలకు నిధులు అందిస్తున్నాయి. ఇది దేశభద్రతకు అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ యేడాది జనవరి, అక్టోబరు మధ్యకాలంలో మయన్మార్ వలసదారుల నుంచి పద్దెనిమిది ఆయుధాలు, డెబ్బైనాలుగు కోట్ల రూపాయల విలువైన అక్రమ రవాణా వస్తువులు దాదాపు రెండువందల కోట్లకుపైగా విలువైన మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. మొత్తం మీద ఈ సరఫరా ముఠాల కదలికలపై నిఘా వేసి నియంత్రించాల్సిన నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, పోలీసులు, తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కూడా మత్తు పదార్థాల విస్తరణకు కారణమవుతున్నది. తెలుగు రాష్ట్రాలతోపాటు దేశవ్యాప్తంగా ప్రస్తుతం అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్నది. ఈ మహమ్మారి దేశవ్యాప్తంగా ఆమాట కొస్తే ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. చాపకింద నీరులా ఈ స్మగ్లర్లు తమ సామ్రాజ్యాన్ని పెంచుకుంటూపోతున్నారు. మరొకపక్క ఎంతోమందిని అరెస్టు చేస్తున్నారు. కేసులు పెడుతున్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఈ వ్యాపారం ఆగడం లేదు. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు వేలాది టన్నులకుపైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నది. ఈ జాడ్యం విస్తరించడం అత్యంత ప్రమాదకరం. మాదకద్రవ్యాలను నిరోధించే విషయంలో మాటలకే పరిమితం కాకుండా ఆచరణలో చూపించాల్సిన తరుణమిది. అవసరమైతే చట్టానికి మరింత పదును పెట్టాలి. ముఖ్యంగా మాదకద్రవ్యాల సరఫరాలో పట్టుబడుతున్న పాత్రధారులు కాకుండా సూత్ర ధారులను కూడా బయటకు తీయాలి. వినియోగం, ఉత్పత్తి, నిల్వ వ్యాపారానికి పాల్పడడం అత్యంత తీవ్రమైన నేరాలుగా కొన్ని దేశాలు పరిగణిస్తున్నాయి. కాంబోడియా, వియత్నాం, సింగ్‌పూర్, థాయిలాండ్ లాంటి దేశాలు ఈ నేరాలకు ఏకంగా మరణశిక్ష విధిస్తున్నాయి. పాలకులు అలాంటి కఠిన శిక్షలవైపు దృష్టిసారించాలి. అన్నింటికంటే ముఖ్యంగా పాత్రధారులతోపాటు సూత్రధారులను పట్టుకుంటే తప్ప ఇది ఆగే పరిస్థితులు కన్పించడం లేదు. ఇందులో ఏమాత్రం జాప్యం చేసినా యువతపై తీవ్ర ప్రభావం చూపి నేర ప్రవృత్తి పెరిగి అరాచకం ప్రబలే ప్రమాదం ఉంది.

మానవుని నడక నవగ్రహాల మీద కాక, రాగద్వేషాలనే రెండు గ్రహాల మీద ఆధారపడి ఉంది.




మాతృశ్రీ అనసూయాదేవి

అధికారానికి ఎదిగిన ఒక సామాన్యునిలో కన్పించే అహంకారం ప్రపంచంలో మరెక్కడా కన్పించదు.



ఎసెన్‌బర్గ్

# ప్రజావాక్కు



## ఇంతకీ మీరేవిట్లు?

ఒకప్పుడు పల్లెల్లో, నగరాల్లో ఈ మాట ఎక్కువగా వినబడేది. మీరేకులం? అంటూ ఎంక్వయిరీ చేయడం అన్న మాట. మీరేవిట్లూ అని అడగడం. అది ఈ మధ్య వినబడడం తగ్గింది. అంటే తెలుసుకోవాలన్న కుతూహలం తగ్గిందని కాదు. వేరే మార్గాల్లో తెలుసుకుంటున్నారు. డైరెక్ట్‌గా కనుక్కోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అయితే ఈ పని ఇప్పుడు ప్రభుత్వం చేయబోతుంది అధికారికంగా. మీఇంటికి ప్రభుత్వ అధికారులు లేదా వలంటీర్లు వచ్చి అధునాతన యాప్‌లు, ట్యాబ్‌లు పట్టుకొని మిమ్మల్ని మీరేవిట్లు? అని అడిగి నోట్ చేసుకుంటారు. గమ్మత్తుగా ఉంది కదా! అయినా మంచికే లేండి. కులగణన అని కులాలవారీగా జనాభా లెక్కలు సేకరించి దేశంలో తొంభై ఏళ్లు దాటింది. చివరి సారిగా 1931లో అలా లెక్కించారు. అప్పుడున్న 30కోట్ల జనాభాకు 100కోట్లు అదనంగా చేరింది. ఒక్క షెడ్యూల్ కులాలు, తెగలు తప్పించి మిగతా అన్ని కులాల్ని జనరల్ కేటగిరిలో లెక్కవేస్తుంది. ఆంధ్ర ప్రదేశ్‌సహా కొన్నిరాష్ట్రాలు కులగణనకు పూనుకుంటున్నాయి.

-డా.డి.వి.జి.శంకరరావు, పార్వతీపురం

## ఎవరి మాటలు నమ్మవొద్దు

మేం అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తాం అన్నారుఒకరు. మేంవస్తే బిసిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెడతామని ఇప్పుడు మరొకరు అంటున్నారు. అప్పుడెప్పుడో అన్న మాట ఇప్పటివరకు అమలుకాలేదు. ఇప్పుడు అంటున్న మాటా అమలు కాబోదు. రాజకీయ నాయకుల మాటలు, వారి మేనిఫెస్టోలు ఎప్పటికి అమలుకావు. అలానే ప్రతి యేడాది దీపావళి రోజున రాత్రి పది గంటల తరువాత టపాసులు కాల్చకూడదని, బాంబులు పేల్చకూడదని పోలీసులు విధించే ఆంక్షలు కూడా ఎప్పుడూ నిజంకావు. అర్ధరాత్రి సమయంలోనూ చెవులు చిల్లులు పడేలా చప్పుళ్ల వినిపిస్తూనే ఉన్నాయి.

-మిథునం, హైదరాబాద్

## ఆశ నిరాశే

ఎన్నికలు వస్తూంటాయి, పోతుంటాయి. ఆగ్రామం, ఆ వీధిలో అందరూ ఒకరికోసం మరొకరు కలిసి ఉండాలి అనే సోయిపోయింది. జల, శబ్ద, వాతావరణ కాలుష్యాన్ని మించిన ప్రమాదస్థాయికి రాజకీయ కాలుష్యం చేరింది. ప్రజాధన వ్యయం పెరిగింది. ఎవరు ఏపార్టీలోగెలిచారో తెలియదు. ప్రతిప్రభుత్వంలో ఉంటారువారే. ఎన్నికైన పార్టీ నుంచి మారితే సభ్యత్వం రద్దయి ఆ ఖాళీ అలాగే ఉంచి తదుపరి ఎన్నికల వరకు రాష్ట్రపతి పాలనలోకి వచ్చేయాలి.

- వి.ఆర్.ఆర్.ఎ. రాజు, హైదరాబాద్

## అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్స్

గ్రేటర్ హైదరాబాద్‌పరిధిలోని పాతబోయిన్ పల్లి ప్రధాన కూరగాయల మార్కెట్, డైమండ్‌పాయింట్, తార్నాక ఉస్మానియా యూనివర్సిటీ రోడ్డులో సీతాఫల్ మండి టీ జంక్షన్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి యేడాది గడుస్తున్నా ఇంతవరకు ప్రారంభించకపోవడం వలన ట్రాఫిక్‌కు విపరీతమైన అంతరాయంకలుగుతుంది. తద్వారా పద్మవ్యూహంలో వాహనాలు చిక్కుకొని వాయుకాలుష్యంతోపాటు సమయం ఇంధనం వృధా అవ్వడం, తరచుగా ప్రమాదాలకు దారితీస్తూ ఉన్నది. ట్రాఫిక్ సిబ్బంది వాహనాలరాకపోకలను నియంత్రణ చేస్తున్న రాకపోకలకు విపరీతమైన జాప్యం జరుగుతున్నది. లక్షలు వెచ్చించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి అలంకారంగా ఉంచడం విచారించదగ్గ విషయం. డైమండ్ పాయింట్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ ఐదు రహదారులకు సరిగా ఉపయోగపడడం లేదని తెలుస్తున్నది. కావున సత్వరమే ఇక్కడ ఉన్న సిగ్నల్స్‌ను సరిచేసి నగరంలో అలంకారప్రాయంగా ఉన్న ఇతర ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకువచ్చి వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలి.

-దండంరాజు రాంచందర్‌రావు, పాతబోయిన పల్లి

## బి.సి. ముఖ్యమంత్రి!

ప్రతిపక్షంలో ఉండగా బిజెపి నాయకులు ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఏం చేసారు? ఎపికి ప్రత్యేకహోదా ఇవ్వడం కుదరదని ఖరాఖండిగా చెప్పేశారు. ఆందోళనలు, అలజడులు, గొడవలు ఎందరు ఎన్ని చేసినాససేమిరాఅన్నారు. అలాగే తెలంగాణలోఎన్నికల ముందు బిసిజపంచేస్తున్నారు. బిసిలపై ఎంతోప్రేమను కనబరుస్తున్నారు. బిజెపి పాలిత అతిపెద్ద రాష్ట్రంలో బిసి వర్గానికి చెందిన వారిని ముఖ్యమంత్రిగా నియమించలేని వారు తెలంగాణలో పార్టీకి అధ్యక్షుడిగా ఉన్న బిసిని పదవిలోంచి తీసి పడేసిన వారుఇప్పుడు పార్టీ తెలంగాణలో అధికారంలోకి వస్తే బిసిని ముఖ్యమంత్రి చేస్తామంటున్నారు. వీరి మాటలు నమ్మేటట్టుగా ఉన్నాయా?

-ఎమ్.ఎస్. శర్మ, హైదరాబాద్

## కల్తీపాలను అరికట్టాలి

కొందరు వ్యాపారస్తులు కల్తీపాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. ఈపాలల్లో ప్రమాదకర రసాయనాలు ఉపయోగిస్తున్నారు. ఇందువలన ప్రజలకు నష్టం. అలాగే కల్తీ నూనెలు సరుకులువిక్రయిస్తున్నారు. కొంతమంది వ్యాపారస్తులు స్వలాభాల కొరకు ప్రజలజీవితాలతో చెలగాటమాడుతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించాలి.

-సరికొండ రవిప్రకాశ్‌రాజు, సూర్యాపేట జిల్లా

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# సామాజిక మాధ్యమాలదే కీలక పాత్ర!

**వివిధ రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించి అధికారం చేపట్టడానికి అమలుకు నోచుకొని ఉచిత హామీలను సైతం వెల్లడించి ఓటర్లను ఒకింత తికమకపెట్టే ప్రయత్నం చేయడానికి పూనుకుంటారు. కావున ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సరైన నిర్ణయాన్ని తీసుకుని సమర్థుడైన నాయకుని ఎన్నుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది. అలాగే ఉచితంగానే ఏదిపడితే వాటిని అప్లోడ్ చేసి, అనుచితంగా వ్యవహరిస్తే ఇబ్బందులు పడకతప్పదు. అలాగే ఈ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నిఘాసైతం ఉంటుంది. కావున జాగ్రత్తవహిస్తూ మంచి సమాచారాన్ని చేరవేయడానికి సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలి.**



డా.పోలం సైదులు

ప్రస్తుత సమాజంలో చరవాణి (మొబైల్ ఫోన్) జీవితంలోఒకభాగం అయిపోయింది. అది లేకపోతే జీవితమే లేనట్లుగా తయారై, అందులో యువత సామాజిక మాధ్యమాలను వినియోగించడానికే అత్యధిక సమయాన్ని కేటాయిస్తున్నారనడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. ఒకప్పుడు సమాజంలో తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకోవాలంటే ఎంతో శ్రమనోడ్చి ఎదురుచూడాల్సివచ్చేది. కానీ సామాజిక మాధ్యమాల వినియోగం వాడుకలోకి వచ్చాక నైపుణ్యం ఉంటే రాత్రికి రాత్రే సెలబ్రిటీగా అవతారం ఎత్తుతుండడం చూస్తూనే ఉన్నాం. దీనికిగల ప్రధాన కారణం వీక్షకుల సంఖ్య ఎక్కువగా ఉండటం. అంటే ఏదైనా సమాచారాన్ని వ్యాప్తిచేయాలంటే సామాజిక మాధ్యమాలు ఎలా ఉపయోగపడుతున్నాయో అవగతం అవుతుంది. ఎవరైనా, ఎప్పుడైనా, ఏవైనా సంఘటనల నేపథ్యంలో తమ భావాలను స్వేచ్ఛగా ప్రకటించుకోవడానికి ఒక వేదికగా తయారైపోయింది. అంతెందుకు ఒకప్పుడు సమాజంలో ఏంజరుగుతుందో, జరగబోతుందో అనే విషయాన్ని వివిధ న్యూస్ పేపర్స్, న్యూస్ ఛానల్స్ చూస్తేనే తెలిసేది. కానీ ప్రస్తుతం అరచేతిలోనే అనుక్షణం ఎప్పటికప్పుడు జరిగే విషయాలను తెలుసుకోవడానికి దోహదపడుతుంది. అంటే కారణం సోషల్ మీడియా అని చెప్పకతప్పదు. ప్రస్తుతం ఎన్నికల నేపథ్యంలో సోషల్ నెట్‌వర్క్స్ ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో వేరే చెప్పక్కర్లేదు. ప్రత్యేకంగా ఎన్నికల విషయంలో రాజకీయ పార్టీలు ప్రచారంలో భాగంగా సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడానికి ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎప్పటికప్పుడు సాంకేతిక రంగంలో వస్తున్న పలు విప్లవాత్మకమైన మార్పులను వివిధ రాజకీయ పక్షాలు, ప్రభుత్వాలు తమ మనుగడకై ఉపయోగించుకుంటూ సామాన్య మానవునికి అందుబాటులోకి వెళ్లతున్నాయి. 2014 పార్లమెంట్ ఎన్నికలలో మొదటిసారిగా నరేంద్ర మోడీ ట్విటర్‌తో ప్రారంభించి ఫేస్‌బుక్, తమ పార్టీ సభ్యత్వాలకై ప్రత్యేక యాప్‌లను ఉపయోగించుకుంటూ అప్పటికే 8 సంవత్సరాలకుపైగా ప్రభుత్వాన్ని నడుపుతున్న యూపిఏ పార్టీ అధికారంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని, అవినీతికి పాల్పడ్డారని, కుటుంబ పాలనకు చరమగీతం పాడాలని, మరొకపక్క ఎన్డీయే అధికార పగ్గాలను చేపట్టడానికి సహకరిస్తే నల్లధనాన్ని వెలికితీస్తానని, అవినీతిరహిత పాలన అందిస్తానని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామని, తమ మేనిఫెస్టోను రూపొందించి సామాజిక మాధ్యమాల ప్రచారం కొనసాగించి అధికారం చేపట్టింది. నాటి నుండి నేటివరకు ఆ ప్రభుత్వం ఎలాంటి కార్యకలాపాలను మొదలు పెట్టినా సామాజిక మాధ్యమాల ద్వారా క్షేత్రస్థాయిలోకి సమాచారాన్ని చేర్చగలుగుతున్నారు. దానిని గ్రహించిన మిగతా పార్టీలు సైతం ప్రస్తుత కాలానికనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సామాజిక మాధ్యమాల వినియోగంలో పరిగెడుతున్నాయని చెప్పవచ్చు. నేడు ఒక్కొక్క ఇంట్లో రెండుకుపైగా స్మార్ట్ ఫోన్ల వాడకం కొనసాగుతున్నది. ధనిక,పేద, అక్షరాస్యుడు, నిరక్షరాస్యుడనే బేధాలు లేకుండా వ్యవసాయ కూలీలు, జంతువుల కాపలాదారులు సైతం స్మార్ట్‌ఫోన్లు కలిగిఉండి వివిధ సామాజికమాధ్యమాల్లో అకౌంట్స్‌తెరిచి ఉపయోగిస్తున్నారనడంలో ఎలాంటి అవాస్తవంలేదు. అలాగే నేడు ఉన్నతమైన విద్యనభ్యసించి వివిధ రకాల ఉద్యోగాలు చేస్తున్నవారు ఎక్కువగా పట్టణాలు, నగరాలలో నివసించేవారు యాంత్రికపరమైన జీవనాన్ని గడుపుతున్నారు. ప్రభుత్వాల పనితీరును, రాజకీయపక్షాల వాగ్దానాలను సైతం గమనించలేని పరిస్థితిలో ఉన్నారు. వీరందరూ తీరిక సమయాల్లోసామాజిక మాధ్యమాలను ఉపయోగించుకోవడం మూలంగా ప్రస్తుత రాజకీయ పరిస్థితులను అంచనా వేయడానికి అవకాశం ఉంటుంది.




కావున వీరందరి కోసం అతి సులభంగా వారి వారి సమాచారాన్ని చేరవేయడానికి యూట్యూబ్ ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి ఎన్నో రకాల యాప్‌లను ఉపయోగించుకొని తమ గెలుపుకోసం ప్రయత్నిస్తున్నారని చెప్పడంలో ఎలాంటి సందేహం అక్కరలేదు. తెలంగాణ రాష్ట్రంలో సైతం గతంలో ముఖ్యమంత్రి ట్విట్టర్ వేదికగా పలు సమస్యలకు స్పందిస్తూ వెంటనే పరిష్కారానికై చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే ప్రతి నియోజకవర్గం నుండి ప్రతి ఎమ్మెల్యే ప్రతిపక్షనాయకులు సైతం సామాజిక మాధ్యమాలలో ఖాతాలు తెరిచి ఒక ప్రత్యేకబృందాన్ని ఏర్పాటు చేసి అనుక్షణం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ తమ ప్రచార కార్యకలాపాలను గావిస్తున్నారు. గతంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను వివరించాలన్నా, తమ కార్యకలాపాలను కార్యకర్తలకు తెలియచేయాలనుకున్నా ప్రజల మన్ననలు పొందటానికి ఏ పని చేసినా కేవలం ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాపైననే ఆధారపడేవారు. కానీ నేడు ఆ పరిస్థితులు మారి ఏ విషయాన్ని అయినా క్షణాల్లో ప్రజలకు అందచేస్తున్నారంటే కారణం సామాజిక మాధ్యమాలే అని చెప్పకతప్పదు. ప్రతి విషయం, ప్రతి కార్యక్రమాన్ని అప్లోడ్ చేయడానికి, స్పందించడానికంటూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకునే స్థాయికి ఎదిగాయి. సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా యూట్యూబ్, ట్విట్టర్, వాట్సాప్, ఫేస్‌బుక్, మెసెంజర్, ఇన్‌స్టాగ్రామ్‌లను ఎక్కువగా వాడుతూ ప్రతి సంఘటనను ప్రతి విషయాన్ని కార్యకర్తలకు చేరువ చేస్తున్నారు. ఎంతగానంటే న్యూస్ ఛానల్స్, పేపర్లు సైతం వాటినిబట్టి వార్తలు రాసుకునే స్థాయికి ఎదిగాయన్నా ఆశ్చర్యం అక్కరలేదు. ఈ మధ్య ప్రజలు సైతం పలురకాల విషయాలను సంఘటనలను సమాచారాలను డ్రాఫ్ట్స్ ద్వారానో, ఫొటోల ద్వారానో వీడియో రూపంలో గానీ అప్లోడ్‌చేసి ప్రజల్లో రోజురోజుకు ఆదరణను పెంచుకుంటున్నారు. అందుకే ఈ దఫా జరిగే శాసనసభ ఎన్నికలలో వివిధ రాజకీయ పార్టీలు ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరికి టికెట్స్ ఇచ్చారు, వివిధ పార్టీ మేనిఫెస్టో ఏంటి? ఎవరు గెలిస్తే ఏం చేయబోతున్నారు? ఇతరులపై వారు చేసే కామెంట్స్‌ఏంటి? వివిధ రకాల సర్వేలు ఏంచెబుతున్నాయి? అనే పలు విషయాలను సులభంగా తెలుసుకోవడానికి ఈ మాధ్యమాలు ఉపకరిస్తున్నాయనడంలో నిజం లేకపోలేదు. ఏదిఏమైనప్పటికీ ప్రస్తుత రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికలు ఎంతో ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఏ మీడియా ద్వారానైనాసరే వాస్తవ పరిస్థితులను సమీక్షించి చైతన్యమవ్వడే కాకుండా సమాజాన్ని సైతం జాగృతం చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉన్నది. ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరు పోటీ చేస్తున్నారు? అందులో సమర్థుడైన వ్యక్తి ఎవరు? ఎవరు నిష్పక్షపాతంగా ప్రజాసేవ చేయగలరు? ఎవరు రాష్ట్రాభివృద్ధి ధ్యేయంగా పని చేయగలరు? వాస్తవిక సమాచారాన్ని, వివరాలను వివరిస్తూ ప్రజలకు తెలియచేస్తూ ఓటుహక్కు వినియోగం గురించి మరింత చైతన్యాన్ని కలిగించే విధంగా ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం పంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వివిధ రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకర్షించి అధికారం చేపట్టడానికి అమలుకు నోచుకొని ఉచిత హామీలను సైతం వెల్లడించి ఓటర్లను ఒకింత తికమకపెట్టే ప్రయత్నం చేయడానికి పూనుకుంటారు. కావున ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సరైన నిర్ణయాన్ని తీసుకుని సమర్థుడైన నాయకుని ఎన్నుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉన్నది. అలాగే ఉచితంగానే ఏదిపడితే వాటిని అప్లోడ్ చేసి, అనుచితంగా వ్యవహరిస్తే ఇబ్బందులు పడకతప్పదు. అలాగే ఈ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ నిఘాసైతం ఉంటుంది. కావున జాగ్రత్త వహిస్తూ మంచి సమాచారాన్ని చేరవేయడానికి సామాజిక మాధ్యమాలను వినియోగించుకోవాలి. ●

# నిరుద్యోగులను పట్టించుకోని పార్టీలెందుకు?

నామాల ఆజాద్

అరవై యేళ్ల ఆంధ్ర పాలకుల చేతిలో బందీ అయిన తెలంగాణ నేడు స్వరాష్ట్ర పాలకుల చేతిలో బంది అయింది. నీళ్లు, నిధులు, నియామకాలు లక్ష్యంతో సాగిన పోరాటం సొంత రాష్ట్రంలో ముఖ్యమంత్రి కుటుంబ ప్రయోజనాలు కాపాడటానికి మాత్రమే పరిమితం అయింది. విశ్వవిద్యాలయాల కేంద్రంగా, విద్యార్థుల అమరుల త్యాగాల పునాదుల మీద సాగిన తెలంగాణ ఉద్యమం గ్రామస్థాయిలో తెలంగాణ వాదానికి బాటలు వేసింది. నాటి పాలకులు, కుహనా ఉద్యమకారులు ఉద్యమ విచ్ఛినానికి పన్నిన కుట్రలను, కుయుక్తులను ఛేదించింది. పోలీసు నిర్బంధాలు, లాఠీ తూటాలు, అక్రమ అరెస్టులు, కేసులకు బెదరకుండా మొక్కవోనిదీక్షతో ఉద్యమం ముందుకు సాగింది. మిలియన్ మార్చ్, సాగరహారం, రైలురోకో, రాస్తారోకో, సకల జనుల సమ్మె లాంటి అనేకరకాల పోరాటాలు, ఉద్యమ జ్వాలలు రాజేయడానికి చేసిన ప్రాణత్యాగాలు స్వరాష్ట్ర సాధనలో అజరామరం. తెలంగాణ ఉద్యమకారుల త్యాగాల పునాదులపైన గద్దెనెక్కిన కెసిఆర్ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలుగా అమరవీరుల ఆశయాలపై, విద్యార్థుల ఆకాంక్షలపై నీళ్లు జల్లుతూనే ఉన్నది. ఈ తీరు నేడు తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలోపడ్డ చందంగా మారింది. గత ఎన్నికలలో బిఆర్ఎస్, బిజెపి పార్టీలు తెలంగాణ విద్యార్థి యువతకు అరచేతిలో వైకుంఠం చూపే హామీలను ఇచ్చారు. కేంద్ర,రాష్ట్ర పాలకులు అధికార పీఠాన్ని అడ్డంపెట్టుకొని ఇచ్చినహామీల్లో ఏఒక్కటి నెరవేర్చకుండా పూర్తిగా విస్మరించారు. విద్యారంగ మనుగడను విద్యార్థి, యువత భవిష్యత్తు జీవితాల్లో ప్రశ్నార్థకంగా మార్చివేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీల అమలు ఊసే లేదు. గత ఎన్నికల్లో అచ్చేదిన్ అంటూ అధికారంలోకి రాగానే యేడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ, ఇంటికొక ఉద్యోగం అన్న కెసిఆర్ ప్రభుత్వాలు తెలంగాణ విద్యార్థి, యువతను మోసపూరిత మాటలతో నయవంచనకు గురి చేశారు. విద్యార్థిలోకం అగ్రభాగాన నిలబడి కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ ప్రమాణాలు రోజురోజుకు దిగజారిపోతున్నాయి. గతనాలుగు సంవత్సరాలుగా స్కాలర్ షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థిలోకం అనేక అవస్థలు పడుతున్నారు. కెజి నుండి పీజివరకు ఉచిత ఇద్య అందిస్తామని కులాల వారిగా వర్గీకరణ చేసి ప్రారంభించిన గురుకులాలు అద్దె భవనాలలో, అరకొర వసతులతో, కాంట్రాక్టు అధ్యాపకులతో, సరిపడ నిధుల కేటాయింపులు లేక కునారిల్లుతున్నాయి. గురుకులాలు, సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో నాణ్యమైన భోజనం లభించక విద్యార్థులు అర్థాకలితో అలమటిస్తూ అద్దె భవనాలలో, ఇరుకు గదుల్లో అత్తేసరు వసతులతో చదువుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ప్రభుత్వ నిరాధారణకు గురై నిధులు లేక విద్యాప్రమాణాలు, పరిశోధనలు కుంటుబడి పూర్తిగా సంక్షోభంలోకి కూరుకుపోయాయి. కష్టపడి చదివి యూనివర్సిటీలో సీటు సంపాదించిన పేద విద్యార్థులకు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల బూచి చూపి కనీసం హాస్టల్ వసతి కూడా కల్పించలేని దౌర్భాగ్య పరిస్థితి తెలంగాణ యూనవర్సిటీల్లో నెలకొంది. విద్యను ప్రైవేట్, కార్పొరేట్ వర్గాలకు కట్టబెడుతూ ఎస్సీ,ఎస్టీ, బిసి, ముస్లిం మైనార్టీ పేదవర్గాలకు విద్యారంగాన్ని దూరంచేస్తున్నారు. ప్రభుత్వపాఠశాలలో సౌకర్యాలు కల్పించి, అభివృద్ధి చేయకుండా రేషనలైజేషన్ పేరుతో వందలాది ప్రభుత్వ పాఠశాలలు మూసివేసింది. హైస్కూల్ నుండి యూనివర్సిటీ స్థాయివరకు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీచేయకపోవడంతో విద్యారంగం అగమ్యగోచరంగా తయారైంది. కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం విద్యార్థుల మెదడులో కుల, మతాలనే విష బీజాలు నాటుతూ భావి భారత పౌరులను మతోన్మాదులుగా మార్చేందుకు విద్యారంగాన్ని కాషాయీకరణ చేసే కుతంత్రాలకు పాల్పడుతున్నది. నూతన జాతీయ విద్యావిధానం 2020 అమలుతో దేశ లౌకిక వ్యవస్థను విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలకు పూనుకున్నది. ఉన్నత చదువులు చదివినా సరైన కొలువులేక విద్యార్థి, యువత నిరుద్యోగ కుంపటిలో కూరుకుపోతున్నారు. దేశంలోని విశ్వవిద్యాలయాలన్నీ నేడు నిరుద్యోగ ఖర్ఖానాలుగా మారిపోయాయి. డిగ్రీ, పీజీ, పిహెచ్‌డి చదువులకు తగిన ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలుపూర్తిగా వైఫల్యం చెందుతున్నారు. ఉన్న ఉద్యోగాలు, ఊడగొడుతూ పేదల ఉద్యోగ రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్నారు. నియామకాలకోసం టిఎస్‌పిఎస్‌సి నిర్వహించిన పరీక్షలన్నీ లీకులై ఉద్యోగాల కోసం విద్యార్థి, యువత పెట్టుకున్న ఆశలన్నీ అడియాశలు అయిపోయాయి. డిగ్రీ, పీజీ, పిహెచ్‌డిలు చేసిన సరైన నోటిఫికేషన్లు లేక కొలువులు రాకబతకలేక భవిష్యత్తు అంధకారంగా మారుతున్నది. విద్యార్థి యువతకు విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించలేని పార్టీలకు రాష్ట్రాన్ని పాలించే అర్హతలేదు. విద్యారంగ అభివృద్ధిని, విద్యార్థి, యువత భవిష్యత్తును తెలంగాణ అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన పార్టీల నిజస్వరూపాన్ని ఈ ఎన్నికల్లో బట్టబయలు చేయాల్సిన అవశ్యకత నెలకొని ఉన్నది. గతంలో వారు చేసిన వాగ్దానాలు అమలు ఏ స్థాయిలో ఉన్నదో ఈ ఎన్నికల్లో అడగండి, కడగండి, ప్రశ్నించండి. ●

# వ్యవసాయాన్ని పరిశ్రమగా గుర్తిస్తేనే పేదరిక నిర్మూలన

దుంగ జయరాం

తరతరాలుగా మానవ జాతిని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య పేదరికం. పేదరిక శాపాన్ని రూపుమాపడం అంత సులభంకాదు. పేదరికం నుండి బయట పడడానికి ఒక రోజు చాలదేమోకానీ, పేదరికంలోనికి కూరుకుపోవడానికి ఒక సెకను చాలు. అవి ప్రకృతి ప్రకోపాలు అయినా కావచ్చు. మానవ నిర్మిత చర్యలైనా అవ్వొచ్చు. యుద్ధాలయినా కావచ్చు. లిబియాలో వరదలు, అఫ్ఘానిస్థాన్‌లో భూకంపాలు, ఇజ్రాయిల్ పాలస్తీనామధ్య యుద్ధం రెండు ప్రాంతాలలో పౌరులను పేదలుగా మార్చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ఆపడం మనచేతిలో లేదు. కానీ యుద్ధాలు, ఉగ్రవాదం, తీవ్రవాదం లాంటివి ఆపడం మన చేతిలో ఉన్నదే. పేదరికం కొలవడానికి ఒక ప్రమాణం చాలదు. ఇది ఎన్నో అంశాలపై ఆధారపడి ఉంటుంది. సరళంగా చెప్పాలంటే ఒక వ్యక్తి లేదా కుటుంబానికి కనీస జీవన ప్రమాణాలను భరించే ఆర్థిక వనరులు లేని పరిస్థితి పేదరికం అని చెప్పొచ్చు. పేదరికం అనేది కేవలం ఆర్థిక సమస్యకాదు. ఇది ఒక వ్యక్తి ఆదాయం, సమాజంలో గౌరవంగా జీవించేహక్కు రెండింటి కలబోత. వీరు వారి పేదరికానికి తోడుగా ప్రమాదకరమైన ప్రదేశాలలో పనిచేయడం, సరైన గృహ వసతి లేకపోవడం, పోషకాహారాన్ని తినలేకపోవడం, సమన్యాయం పొందలేకపోవడం, రాజకీయశక్తి లేకపోవడం, నాణ్యమైన వైద్యం లభించకపోవడం మొదలైన ఇతర పరిస్థితులను కూడా కలిగి ఉంటారు. అంతర్జాతీయ నివేదికలు ప్రధానంగా ఒక కుటుంబం ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలను కొలమానంగా తీసుకొని తయారు చేస్తారు. ఐక్యరాజ్యసమితి విభాగమైన ఆర్థిక, సామాజిక వ్యవహారాల శాఖ పేదరికం లేని ప్రపంచం కోసం చర్యలను వేగవంతం చేసేలా ఉండాలని, 2030 అజెండాకు అనుగుణంగా స్థిరమైన అభివృద్ధి అనికూడా పరిగణించింది. దాని తీర్మానం 72,233లో సాధారణ సభ 2018 నుండి 2027 మధ్య కాలాన్ని పేదరిక నిర్మూలన కోసం మూడవ ఐక్యరాజ్యసమితి దశాబ్దంగా ప్రకటించింది. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ 2023 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందుతున్న 110 దేశాలలో 92 శాతం అనగా 6.1 బిలియన్ల ప్రజల్లో 1.1 బిలియన్ల (18 శాతం) మంది తీవ్ర పేదరికంలో జీవిస్తున్నారు. సబ్-సహారా ఆఫ్రికా దేశాలలో 534 మిలియన్లు (47.8శాతం) మంది దక్షిణాసియా దేశాలలో 389 మిలియన్లు (34.9శాతం) మంది, తూర్పు ఆసియా, పసిఫిక్ ప్రాంత దేశాలలో 106 మిలియన్లు (9.5శాతం), అరబ్ దేశాలలో 53మిలియన్లు (4.7శాతం)లాటిన్ అమెరికా, కరేబియన్ దేశాలలో 33 మిలియన్లు (4.7శాతం), యూరప్, మధ్య ఆసియా



దేశాలలో రెండు మిలియన్లు (0.2శాతం) మంది పేద ప్రజలు ఉన్నారు. ప్రతి ఆరుగురిలో ఐదుగురు పేదలు సబ్‌సహారా ఆఫ్రికా, దక్షిణాసియా దేశాలకు చెందినవారు. ఈ పేదలలో 387 మిలియన్ల మంది అల్ప ఆదాయ దేశాలకు, 730 మిలియన్ల మంది మధ్య ఆదాయ దేశాలలో ఉన్నారు. వీరిలో 566 మిలియన్ల మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలే. 1.84 శాతం మంది పేదలు గ్రామీణ ప్రాంతానికి చెందిన వారుఉన్నారు. 824 నుండి 991 మిలియన్ల మంది పేదలు తగినంత పారిశుధ్యం, వంటచెరకు లేకుండా జీవిస్తున్నారు. పేదరికం రేటు పిల్లల్లో 27.7 శాతం, పెద్దలలో 13.4 శాతం ఉందని తెలిపింది. గ్లోబల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ ప్రకారం 2005-06, 2019-21 మధ్య 415 మిలియన్ల మంది భారతీయులు పేదరికం నుండి బయటపడ్డారు. బహుమితీయ పేదలు, పోషకాహారం లేని వ్యక్తుల శాతం 2005-06లో 44.3 శాతం నుండి 2019-2021లో 11.8 శాతానికి తగ్గింది. పిల్లల మరణాలు 4.5శాతం నుండి 1.5 శాతానికి తగ్గాయి. తాగునీటి సూచికలో బహుమితీయంగా పేదలు, వెనుకబడిన వారి శాతం ఈ కాలంలో 16.4శాతం నుండి 2.7కి విద్యుత్ (29శాతం నుండి 2.1 శాతానికి), గృహ నిర్మాణం 44.9 శాతం నుండి 13.6 శాతానికి పడిపోయింది. పేదరికం తగ్గుదల సమానంగా ఉంది. ప్రాంతాలు, సామాజిక, ఆర్థిక సమూ హాలను తగ్గించింది. వెనుకబడిన కుల సమూహాలలో పిల్లలు, ప్రజలతో సహా పేద రాష్ట్రాలు, సమూహాలు అత్యంత వేగంగా సంపూర్ణ పురోగతిని కలిగి ఉన్నాయి. ఈ విధంగా మనదేశంలో పేదరికం తగ్గడానికి ప్రస్తుత కేంద్ర, సామాజిక అభివృద్ధి పథకాలు అయిన ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్, జాతీయ పట్టణ జీవనోపాధి మిషన్, ప్రధానమంత్రి జన్-ధన్ యోజన, ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, సంసద్ ఆదర్శ్ గ్రామయోజన, బలహీనవర్గాల ఆర్థిక సాధికారత, ప్రధానమంత్రి గరిబీకళ్యాణ్ యోజన, జాతీయ పోషకాహార మిషన్ పోషణ్ మొదలైనవి. ప్రభుత్వాలు చేయవలసిన పని వ్యాపారాలు, పౌర సమాజ సంస్థల మధ్య బలమైన భాగస్వామ్యాలు నెలకొల్పాలి. పేదలందరికీ సమానమైన అభివృద్ధిని సాధించడానికి ఎవరూ మినహాయించబడకుండా లేదా వెనుకబడి ఉండకుండా చూసుకోవడానికి సంక్షేమ పథకాలు ఉండాలి. పరిశ్రమలు స్థాపనకు అనువైన వాతావరణంకల్పించి విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నంచేయాలి. గ్రామీణ పేదరికాన్ని రూపుమాపడానికి వ్యవసాయాన్ని ఒకపరిశ్రమగా గుర్తించాలి. దీనికొరకు బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వాలు గ్యారంటీరుగా వ్యవహరించాలి. వ్యవస్థలో అవినీతిని కట్టడి చేయాలి. అందరూ గౌరవంగా జీవించే పరిస్థితులను కల్పించడంద్వారా పేదరికాన్ని పూర్తిగానిర్మూలించడమే అంతిమలక్ష్యంగా పెట్టుకోవాలి. ●

# అల్‌షిఫా ఆస్పత్రిలో భారీ సొరంగం

## గుర్తించిన ఇజ్రాయెల్.. ఖండించిన గాజా ఆరోగ్యమంత్రి



**టెల్‌అవీవ్, నవంబరు 20:** ఇజ్రాయెల్-హమాస్ మధ్య యుద్ధం కొనసాగనున్నది. గాజాలోని హమాస్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరుపుతున్నది. గత నెల 7న ఇజ్రాయెల్‌పై హమాస్ ఒకేసారి ఐదువేల రాకెట్లతో దాడులకు దిగిన తర్వాత భీకర యుద్ధం మొదలైంది. గాజాలో అతిపెద్ద ఆస్పత్రి అల్‌షిఫా ఆస్పత్రి కేంద్రంగా హమాస్ జరుపుతున్న కార్యకలాపాలపై ఇజ్రాయెల్ ఖండించింది. పట్టుబడిన సైనికుడిని హమాస్ చంపడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది.
ఇటీవల డిఫెన్స్ ఫోర్సు అల్‌షిఫా ఆస్పత్రితో పాటు కిండర్‌గార్టెన్‌లలో పెద్ద ఎత్తున ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఇజ్రాయెల్ సైన్యం సోషల్ మీడియాలో విడుదల చేసింది. అయితే, అక్టోబరు 7 తర్వాత గాజాలో అనేకమంది ఇజ్రాయెల్ సైనికులు కిడ్నాప్‌నకు గురయ్యారని, దీనిపై సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు ఐడిఎఫ్ పేర్కొన్నది. అపహరణకు గురైన వారిలో నోహ్‌మార్సియానో అనే 19 యేళ్ల ఇజ్రాయెల్ సైనికుడు ఉన్నాడని పేర్కొంది. అయితే, నోహ్ మృతదేహాన్ని అల్‌షిఫా ఆస్పత్రిలో స్వాధీనంచేసుకున్నది. ఇదిలా ఉండగా.. నోహ్ ఇజ్రాయెల్ వైమానిక దాడిలో మరణించినట్లు హమాస్ ప్రకటించింది.
ఫోరెన్సిక్ దర్యాప్తులో అనేక దాడులకు గురైనట్లు తేలిందని సైన్యం వెల్లడించింది. నోహ్‌ను హమాస్ ఉగ్రవాదులు షిఫా ఆస్పత్రిలో హతమార్చినట్లు ఇజ్రాయెల్ ప్రధాన ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి తెలిపారు. అయితే, తాజాగా ఇజ్రాయెల్ అల్‌షిఫా ఆస్పత్రిలో 55 మీటర్ల సొరంగాన్ని గుర్తించినట్లు డిఫెన్స్ ఫోర్స్ పేర్కొంది. గాజాలో సొరంగాలు, బంకర్ల పెద్ద నెట్‌వర్క్ ఉందని ఇజ్రాయెల్ ఆరోపించింది. దీన్ని హమాస్ ఖండించింది. సొరంగంపై ఇజ్రాయెల్ సైన్యం చేసిన ప్రకటన పూర్తిగాఅబద్ధమని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరెక్టర్ మునీర్ ఎల్ బార్ష్ పేర్కొన్నారు. ఎనిమిది రోజులుగా ఆస్పత్రిలోనే ఉన్నానని, అలాంటిదేమీ కనిపించలేదన్నారు.



## రష్యా సైనికుడిని కాల్చివేసిన ఉక్రెయిన్ స్నైపర్

**ఉక్రెయిన్, నవంబరు 20:** 'సైనిక చర్య' పేరిట తమ భూభాగంలోకి అడుగుపెట్టిన రష్యా దళాలతో దాదాపు యేడాదిన్నరకుపైగా ఉక్రెయిన్ సైన్యం పోరు సాగిస్తోంది. యుద్ధంలో భాగంగా తాజాగా ఓ ఉక్రెయిన్ స్నైపర్ (షార్ప్ షూటర్).. చాలా దూరం నుంచి రష్యా సైనికుడిని కాల్చివేసినట్లు తెలుస్తోంది. ఏకంగా రెండున్నర మైళ్ల దూరం నుంచి ఈ షార్ప్ షూటర్ గురిచూసి కాల్చినట్లు ఉక్రెయిన్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉక్రెయిన్ సెక్యూరిటీ సర్వీసెస్ విభాగానికి చెందిన ఓ స్నైపర్.. 3.8 కిలోమీటర్ల దూరంలో ఉన్న రష్యా సైనికుడిని కాల్చి చంపినట్లు ఆ విభాగం అధికారికంగా ధ్రువీకరించింది. ఈ క్రమంలోనే షార్ప్ షూటింగ్‌లో అతడు ప్రపంచ రికార్డు నెలకొల్పినట్లు ఉక్రెయిన్ మీడియాకు తెలిపింది. గతంలో 2017లో కెనడియన్ స్పెషల్ ఫోర్సెస్‌కు చెందిన ఓ స్నైపర్. ఇరాక్‌లో 3.54 కి.మీ. దూరంలో ఉన్న శత్రువును కాల్చి చంపాడు. అంతకు ముందు, 2009లో ఓ బ్రిటిష్ స్నైపర్.. అఫ్గానిస్థాలోని తాలిబన్ ఫైటర్‌ను రెండున్నర కి.మీ. దూరం నుంచి చంపేశాడు. ఇప్పుడీ రికార్డులను ఉక్రెయిన్ స్నైపర్ అధిగమించినట్లు ఉక్రెయిన్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2022 ఫిబ్రవరిలో సైనికచర్య పేరుతో ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్రకు దిగిన విషయం విదితమే. అప్పటినుంచి రెండు దేశాల మధ్య పోరు కొనసాగుతూనే ఉంది. ఈయుద్ధంలో ఇప్పటివరకు ఇరువైపులా వేలాదిమంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. లక్షలమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.



## మూడేళ్లుగా ఏం చేస్తున్నారు?

### తమిళనాడు గవర్నర్‌ను ప్రశ్నించిన సుప్రీం

**న్యూఢిల్లీ,నవంబరు 20 :** శాసన సభ తీర్మానం పొందిన బిల్లులను ఆమోదించకుండా మూడు సంవత్సరాలుగా ఏంచేస్తున్నారని తమిళాడు గవర్నర్‌ను సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. రాష్ట్ర అసెంబ్లీ తీర్మానించిన బిల్లులకు ఆమోదం తెలపకుండా మూడేళ్లుగా ఏం చేస్తున్నారని తమిళాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవిని సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రశ్నించింది. శాసనసభ ఆమోదం తెలిపిన బిల్లులను ఉద్దేశపూర్వకంగానే గవర్నర్‌లు ఆమోదించకుండా జాప్యం చేస్తున్నారని తమిళనాడు, కేరళ, పంజాబ్ ప్రభుత్వాలు పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. బిల్లులకు ఆమోదంతెలుపకుండా తమిళనాడు గవర్నర్ మూడేళ్లుగా ఏంచేస్తున్నారని ప్రశ్నించింది. మరోవైపు కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్, ఆయన కార్యాలయంతో పాటు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. బిల్లుల ఆమోదానికి జరుగుతున్న జాప్యానికి కారణాలు వివరించాలని నోటీసుల్లో ఆదేశించింది. కేరళ ప్రభుత్వం తరఫున సీనియర్‌న్యాయవాది కేకే వేణుగోపాల్ వాదనలు వినిపించాయి. ఈ సందర్భంగా ఆయన రాజ్యాంగంలోని ఆర్టికల్ 168 ప్రకారం గవర్నర్ శాసనసభలో భాగమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని కోర్టుకు విన్నవించారు. అందుకు సంబంధించిన వివారాలు సుప్రీం ధర్మాసనానికి సమర్పించారు. గత 21 నెలలుగా ఎనిమిది బిల్లులను గవర్నర్ ఆమోదించలేదని తెలిపారు.

## నౌక హైజాక్‌లో మా పాత్ర లేదు: ఇరాన్



**టెహ్రాన్,నవంబరు 20 :** జపాన్ నిర్వహిస్తున్న ఓ కార్గోనౌకహైజాక్ ఉదంతంలో ఇరాన్ వివరణ ఇచ్చుకొంది. ఈ హైజాక్‌లో తమపాత్ర లేదని స్పష్టం చేసింది. మరో పక్క ఇజ్రాయెల్ మాత్రం ఈనౌక అపహరణ వెనుక ఇరాన్‌పాత్ర ఉందని బలంగా ఉందని వాదిస్తోంది. ఇక జపాన్ ప్రభుత్వ బృందాలు ఈ నౌకను విడిపించడానికి పనిచేస్తున్నాయి. తుర్కియో నుంచి భారత్‌కు వస్తున్న గెలాక్సీ లీడర్ నౌకను యెమెన్ వద్ద హౌతీ హైజాక్ చేయడంలో తమ పాత్ర ఏమాత్రం లేదని ఇరాన్ వివరణ ఇచ్చుకొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ ప్రతినిధి నాస్సెర్ కనానీ ఓ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ ప్రాంతంలోని సంస్థ స్వతంత్రంగా వారి ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తోందని గతంలో మేము ఎన్నోసార్లు చెప్పాము. ఇక ఇజ్రాయెలీలు వారి పరాజయంపై నుంచి దృష్టి మళ్లించడానికి ఇటువంటి ప్రకటనలు చేస్తున్నారు అని పేర్కొన్నారు.
మరోవైపు ఈ నౌక జపాన్‌కు చెందిన ఓ సంస్థ నిర్వహిస్తోందని గుర్తించారు. తాజాగా జపాన్ ఈ హైజాక్‌పై స్పందించింది. జపాన్ ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తోందని ఆ దేశ ప్రభుత్వ ప్రతినిధి పేర్కొన్నారు. పరిష్కారానికి కేబినెట్ సెక్రటరీ పని చేస్తున్నారని వెల్లడించారు. జపాన్‌కు చెందిన నిప్పన్ యూసేన్ అనే సంస్థ ఈ నౌకను నిర్వహిస్తోంది. ఈ ఘటనపై ఆ సంస్థ దీనిపై స్పందిస్తూ.. ప్రస్తుతం రవాణా శాఖ విదేశాంగ శాఖలు సమచారాన్ని సేకరిస్తున్నాయి. నౌక విడిపించడానికి సంబంధించి ఆయా దేశాలతో చర్చిస్తున్నాయి అని జపాన్ కేబినెట్ సెక్రటరీ హిరోకాజు మట్సునో పేర్కొన్నారు. మరోవైపు హౌతీ రెబల్స్ ప్రతినిధి యాహ్యా అల్ సరయా మాట్లాడుతూ ఆ నౌక ప్రస్తుతం యెమెన్ దేశ తీరంలోనే ఉందని వెల్లడించారు. ఈ నౌక ఇజ్రాయెల్‌కు చెందిందని అతడు పేర్కొన్నాడు. ఈ నౌకలో బల్గేరియా, ఫిలిప్పీన్స్ మెక్సికో, ఉక్రేయిన్‌కు చెందిన సిబ్బంది ఉన్నారు. అందులో తమ దేశస్థులు ఎవరూ లేరని ఇజ్రాయెల్ వెల్లడించింది. భారతీయులూ లేరని ధ్రువీకరించింది. ఇరానియన్ ఉగ్రవాద చర్యగా అభివర్ణించింది.
ఈ నౌక బ్రిటన్ కంపెనీ యాజమాన్యంలోనిదని, జపాన్ నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రే కార్ క్యారియల్స్ అనే సంస్థ ఈ నౌక యమంలోనిదని, జపాన్ నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. రే కార్ క్యారియర్స్ అనే సంస్థ ఈ నౌక యజమానిగా పబ్లిక్ డొమైన్‌లో ఉంది. ఆ సంస్థ అబ్రహాం రామి ఉండర్ అనే వ్యాపారిది. ఆయన ఇజ్రాయెల్‌లో అత్యంత సంపన్నుడు.

## సైన్యానికి కొసరికొసరి వడ్డించిన బైడెన్!




**వాషింగ్టన్, నవంబరు 20:** అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ సైన్యానికి విందు ఇచ్చారు. ఇజ్రాయెల్-హమాస్ యుద్ధం వేళ మోహరించిన నౌకలోని సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు దీనిలో పాల్గొన్నారు. అమెరికాలో థ్యాంక్స్ గివింగ్ డిన్నర్స్ జోరందుకున్నాయి. ఈ సందర్భంగా అమెరికాలోని నోర్‌ఫోక్స్ నేవీ స్థావరంలో మిలిటరీ సిబ్బంది కుటుంబాలకు అధ్యక్షుడు జోబైడెన్ 'ఫ్రెండ్స్‌గివింగ్' విందు ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యక్షుడే స్వయంగా వడ్డించారు. ఆయన తన సతీమణి జిల్‌తో కలిసి ఆహార కౌంటర్‌లోకి వచ్చారు. ఈ విందులో బైడెన్ మాష్‌డ్ పొటాటోను వడ్డించగా.. జిల్ స్వీట్ పొటాటో కాసెరోల్స్ అతిథులకు తినిపించారు. ఈ విందుకు ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు అయిన ఐసర్ హోవర్, గెరాల్డ్ ఆర్ ఫోర్డ్ సిబ్బంది, వారి కుటుంబాలు హాజరయ్యారు. ప్రస్తుతం ఈ రెండు నౌకలను ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణల నేపథ్యంలో మధ్యధరా సముద్రంలో మోహరించారు. ఈ సందర్భంగా బైడెన్ మాట్లాడుతూ.. 'ఈ ఆపరేషన్‌కు మీరు వెన్నెముక. మీ కుటుంబ సభ్యులు దీనికి గుండె వంటి వారు' అని అన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది, వారి కుటుంబసభ్యుల కోసం వోంకా అనే చిత్రాన్ని ముందస్తుగా ప్రదర్శించారు. శ్వేతసౌధం చేపట్టిన జాయినింగ్ ఫోర్స్ కార్యక్రమానికి అనుబంధంగా నోర్‌ఫోక్స్‌లో విందు ఇచ్చారు.
యేటా సంప్రదాయంగా జరిగే థ్యాంక్స్ గివింగ్ టర్కీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నారు. నేడు బైడెన్ 81వ జన్మదినం. తర్వాత ఆయన అట్లాంటిక్‌లోని నాంటక్ట్‌కు వెళ్లనున్నారు. అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడిగా జోబైడెన్ రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే.



### అర్జెంటీనా కొత్త అధ్యక్షుడిగా

## జేవియర్ మిల్లా

**బ్యూనోస్, నవంబరు 20 :** అర్జెంటీనా కొత్త అధ్యక్షుడిగా జేవియర్‌మిల్లా బాధ్యతలు స్వీకరించనున్నారు. అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో మిల్లాకు 55.8శాతం ఓట్లు రాగా సెర్గియో మాసాకు 44.2శాతం ఓట్లు పోలయ్యాయి. లా బిర్టా అవాంజా నేతయిన జేవియర్ మిల్లా ఎన్నికల ప్రచారంలో అర్జెంటీనాలో పెద్ద ఎత్తున మార్పులు తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. అర్జెంటీనా ఎన్నికల సమయంలో ఆర్థికవ్యవస్థ ద్రవోల్బణం పెద్ద సమస్యలు పెను సవాలుగా మారాయి. ద్రవోల్బణం 140 శాతానికి పెరిగింది. సెర్గియా మాస్సా పార్టీ పేరోనిస్ట్ మూవ్‌మెంట్ గత 20 ఏళ్లలో 16 సంవత్సరాలపాటు పరిపాలించింది. ఎన్నికల ఫలితాలపై ఆయన స్పందిస్తూ ప్రజలు ఈ సారి భిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నారన్న ఆయన మిల్లాకు అభినందనలు తెలిపారు.
త్వరలోనే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోనున్నట్లు పేర్కొన్నారు. అయితే మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో పోలుస్తుంటా. ట్రంప్‌లాగే మిల్లాకు వాతావరణ మార్పులపై నమ్మకం లేదు. ఎన్నికల్లో విజయం తర్వాత స్పందిస్తూ అర్జెంటీనా పునర్నిర్మాణం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 10న ఆయన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్నారు.
జేవియర్ రాజకీయాల్లోకి రాకముందు ప్రొఫెసర్‌గా పని చేశారు. పలువిశ్వవిద్యాలయాల్లో ఆర్థిక శాస్త్రం బోధించారు. అలాగే ఆర్థికశాస్త్రం, రాజకీయాలపై అనేక పుస్తకాలను రాశారు.

## మరోసారి భగ్గుమన్న చైనా, ఆస్ట్రేలియా విభేదాలు



**కాన్‌బెర్రా, నవంబరు 20 :** ఆస్ట్రేలియా -చైనా మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. తమ దేశ యుద్ధ నౌకలోని డ్రైవర్లతో చైనా అనుచితంగా ప్రవర్తించడాన్ని ఆస్ట్రేలియా ప్రధాని తప్పుపట్టారు. ఆస్ట్రేలియా-చైనా మధ్య మరోసారి విభేదాలు భగ్గుమన్నాయి. చైనా నౌకదళచర్యలు అత్యంత ప్రమాదకరమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని అల్బనీస్ తప్పుపట్టారు. ఇటీవల జపాన్ సముద్ర జలాలల్లో జరిగిన ఓ సంఘటనను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యలు చేశారు. నవంబర్ 14వ తేదీన ఆస్ట్రేలియాకు చెందిన ఫ్రిగెట్ ప్రొపెల్లర్‌లో చేపల వల ఇరుక్కొంది. దీనిని తొలగించేందుకు ఆస్ట్రేలియా డ్రైవర్లు సముద్రంలోకి దూకారు. అదే సమయంలో చైనాకు చెందిన ఒక డెస్ట్రాయర్ నౌక అక్కడకు చేరుకొని.. అక్కడ సోనార్‌ను వాడటం మొదలు పెట్టింది. ఈ ఘటనలో ఆస్ట్రేలియా డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డారు. తాజాగా ఈ ఘటనపై ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ స్పందిస్తూ చూనా నౌకదళ చర్యలు అత్యంత ప్రమాదకరమని ఆందోళ వ్యక్తం చేశారు. వారి చర్యల కారణంగా ఒకరు గాయపడ్డారని పేర్కొన్నారు. ఇటీవల అమెరికాలో జరిగిన అపెక్ సమ్మిట్‌లో ఈ అంశాన్ని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వద్ద ప్రస్తావించారా లేదా అనే అంశాన్ని మాత్రం అల్బనీస్ వెల్లడించలేదు.
దీనిపై స్పందిస్తూ.. నేను మీకు ఒక విషయం చెప్పదల్చుకొన్నాను. ఈ అంశాన్ని సరైన చోట సరైన విధంగా లేవనెత్తుతాము' అని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై చైనా ప్రభుత్వం ఎటువంటి బహిరంగ ప్రకటన చేయలేదు. ఈ ఘటన చోటుచేసుకోవడానికి వారం ముందే ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ బీజింగ్‌లో పర్యటించి వచ్చారు. ఇరు దేశాల మధ్య నెలకొన్న తీవ్రవ ఉద్రిక్తతలను తగ్గించే దిశగా ఈ పర్యటన చేపట్టారు. ఇక తాజ ఘటనతో మరోసారి విభేదాలు పెరుగుతాయా అన్నప్రశ్నకు అల్బనీస్ స్పందిస్తూ.. ఇరు దేశాలు ఎక్కడ సహకరించుకోగలవో అక్కడ కలిసి పని చేస్తాము అదే ఎక్కడ విభేదించగవో అక్క విభేదిస్తామని తెలిపారు.

## కిసాన్ సమ్మాన్ రూ.12వేలు ఇస్తాం: ప్రధాని మోడీ

**జైపూర్, నవంబరు 20:** రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో గెలుపే లక్ష్యంగా బిజెపి అంది వచ్చిన ఏ అవకాశాన్ని వదలుండంలేదు. ఇప్పటికే మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎల్పీజీ సబ్సిడీ ఆఫర్‌ను ప్రకటించిన బిజెపి మరింత దూకుడు పెంచింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ రాజస్థాన్‌లోని హనుమాన్‌గఢ్‌లో సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారర్యాలీలో మరో బిగ్ అనౌన్స్‌మెంట్ చేశారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తే పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ప్రభుత్వం ఏటా రూ.12,000 ఇస్తుందని ఆయన ప్రకటించారు. రాజస్థాన్ బిజెపి రైతులనుంచి కనీస మద్దతుధరకు పంటలను కొనుగోలు చేస్తుందని, ఇందుకు అదనంగా బోనస్ ఇస్తుందని భరోసా ఇచ్చారు. రాజస్థాన్‌లో అధికంగాఉన్న పెట్రోల్ ధరలపై బిజెపి అధికారంలోకివస్తే సమీక్ష జరుపుతుందని కూడా హామీ ఇచ్చారు. పేదలను మోసం చేసేవాళ్లను కటకటాల వెనక్కి పంపుతామన్నారు. 200 మంది సభ్యులున్న రాజస్థాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఒకే విడతలో పోలింగ్ జరుగనుంది. డిసెంబర్ 3న ఫలితాలు వెలువడతాయి.

## జైషే మొహమ్మద్ ఉగ్రవాది తాజ్ మహ్మద్ కాల్చివేత!

**న్యూఢిల్లీ, నవంబరు 20:** మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది, జైషే మహ్మద్ సభ్యుడు తాజ్ మహ్మద్ హతమయ్యాడు. పాకిస్థాన్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అతడిని కాల్చి చంపినట్లు తెలుస్తోంది. అనేక హింసాత్మక ఉగ్రవాద ఘటనలతో సంబంధమున్న మోస్ట్ వాంటెడ్ జైష్ ఇ మహ్మద్ ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అస్గర్‌కు తాజ్ మహ్మద్ రైట్ హ్యాండ్, సమీపబంధువు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, జైషే ముఠాలో అత్యంత కీలకమైన ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అస్గర్. ముఖ్యంగా ఇండియాలో పఠాన్‌కోట్, నగ్రోటా, యూరీ, పుల్వామా వంటి ఉగ్రదాడుల్లో అతనిదే కీలకపాత్ర. 1999లో అఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్‌లో భారత విమానాన్ని హైజాక్ చేసిన ఘటనలో రవూఫ్ ప్రధాన సూత్రధారి.
అంతేగాక, 2001లో భారత పార్లమెంట్‌పై ఉగ్రదాడి, 2016లో పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో భారత వాయుసేన స్థావరంపై దాడి, అలాగే 2014,2019 మధ్య భద్రతా సిబ్బందిపై జరిగిన అనేక దాడుల్లో సూత్రధారిగా ఆరోపణలున్నాయి. 2019లో పుల్వామా ఉగ్రదాడిలో 42 మంది సిఆర్పీఎఫ్ జవాన్ల మరణించిన ఘటనలో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఛార్జిషీట్‌లో రౌఫ్ అస్గర్, మసూద్ అజర్ పేర్లు ఉన్నాయి.

## రెండేళ్ల బాలిక అవయవదానం..ఇద్దరికి పునర్జన్మ




**న్యూఢిల్లీ,నవంబరు 20 :** ఓ చిన్నారి తల్లిదండ్రులు పెద్ద మనసు చాటుకున్నారు. జీవన్మృతురాలైన (బ్రెయిన్ డెడ్) తమ రెండేళ్ల కుమార్తె శరీరంలోని అవవయావలను దానం చేసి ఇద్దరు పిల్లలకు పునర్జన్మ నిచ్చారు. ఢిల్లీలో ఓ చిన్నారి తల్లిదండ్రులు పెద్ద మనసు చాటుకున్నారు. ప్రమాదంలో బ్రెయిన్ డెడ్ అయిన తమ రెండేళ్ల కుమార్తె శరీరంలోని అవయవాలను దానంచేసి ఇద్దరు పిల్లలకు పునర్జన్మ నిచ్చారు. రెండేళ్ల దివ్యాన్షి మూడు అంతస్తుల భవనంపై ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కింద పడింది. చికిత్సకోసం ఎయిమ్స్‌కు తరలించగా ఆమె బ్రెయిన్‌డెడ్‌కు గురైందని వైద్యులు తెలిపారు. బాలిక శరీరంలోని అవయవాలు సక్రమంగా పని చేస్తున్నాయని.. వాటిని అవసరాలో ఉన్న వారికి దానం చేయాల్సిందిగా కోరారు. దీనికి వారు ఒప్పుకోవడంతో బాలిక గుండెను చైన్నైలోనిఎంజీఎం ఆస్పత్రిలో 8నెలల పాపకు అమర్చారు. రెండు కిడ్నీలను ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న మరో 17 బాలికకు అమర్చారు. కళ్లను ఐ బ్యాంకులో భద్ర పరిచారు.
ఢిల్లీలో అతిచిన్న వయసులో అవయవదానం చేసిన బాలికగా దివ్యాన్షి రికార్డులకెక్కింది. ఢిల్లీ ఎయిమ్స్ అస్పత్రిలో మరో అవయవదానం జరిగింది. ఈ నెం 16న నోయిడాల జరిగిన ఓరోడ్డు ప్రమాదంలో శశి అనే 48ఏళ్ల మహిళకు తీవ్రంగా గాయమైంది. దీంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ నవంబరు 17న ఆమె బ్రెయిన్‌డెడ్ అయ్యింది. ఆమె తన కిడ్నీలను ఎయిమ్స్‌లోని రోగికి, మరోకటి ఆర్మీ ఆస్పత్రిలో చికిత్స పొందుత్ను మరో పేషెంట్‌కు డాక్టర్లు అమర్చారు.

## మురుగ మఠాధిపతికి అరెస్టు వారంటు

**బెంగళూరు, నవంబరు 20:** పిల్లలపై లైంగిక వేధింపుల నిరోధకచట్టం కింద ఆరోపణలు ఎదుర్కొంటున్న మురుగ మఠాధిపతి మురుగ శరణకు సెకెండ్ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ కోర్టు సోమవారంనాడు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. రెండు పోస్కో కేసులను మురుగ శరణ ఎదుర్కొంటున్నారు. రెండవ పోస్కోకేసులో మురుగశరణను రిమాండ్‌కు ఇవ్వాలని కోర్టు ముందు హాజరైన చిత్రదుర్గ రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ముద్దురాజు కోరారు. కోర్టు తాజా ఆదేశాలతో దేవనగరెలోని విరక్త మఠాధిపతిని పోలీసు టీమ్ తమ అదుపులోకి తీసుకోనుంది. కాగా, పోస్కో మొదటి కేసులో నవంబర్ 16న మురుగ పీఠాధిపతి బెయిలపై విడుదలయ్యారు. బెయిలు వచ్చిన రోజే ఆయన కారులో తన ఆశ్రమానికి వెళ్లిపోయారు.
ఈ నేపథ్యంలో పోస్కో రెండో కేసులో తిరిగి ఆయనపై అరెస్టు వారెంట్లు జారీ అయ్యాయి. కాగా, తాజా అరెస్టు వారెంట్లను మురుగ శరణ తరఫు న్యాయవాదులు కర్ణాటక హైకోర్టులో సవాలు చేసే అవకాశాలున్నాయి.

### పాక్‌కు గూఢచర్యం కేసులో

## మరో నేరగాడి అరెస్టు

**హైదరాబాద్, నవంబర్ 20, ప్రభాతవార్త:** వైజాగ్ కేంద్రంగా సాగిన పాకిస్తాన్ నిర్వహించిన గూఢాచర్యం కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) మరో నిందితుడిని అరెస్టు చేసింది. రక్షణ బలగాలకు చెందిన సమాచారంతో పాటు శ్రీహరి కోటలో తయారయ్యే రాకెట్‌కు సంబంధించిన సమాచారాన్ని పాకిస్తాన్‌కు చెందిన నిఘా వర్గాలకు ఐఎస్ఐ ఏజెంట్ల ద్వారా చేరవేసిన గూఢచర్యం కేసులో ఇప్పటికే ఇద్దరు అరెస్టవడం తెలిసిందే. ముంబాయికి చెందిన అమన్ సలీం షేక్‌ను సోమవారం ఉదయం ఎన్ఐఎ అధికారులు అరెస్టు చేశారు. ఇదే సమయంలో మహారాష్ట్రలోని రెండు ప్రాంతాలతో పాటు అస్సాంలోని మరోచోట ఎన్ఐఎ దాడులు నిర్వహించింది. తాజాఅరెస్టుతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన వారి సంఖ్య మూడుకుచేరింది. ఇంతకుముందు ఇదేకేసులో ఇద్దరు అరెస్టవడం తెలిసిందే. ఈకేసులో ఎన్ఐఎ మొదటి ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. 2021లో పాకిస్తాన్ నిఘా వర్గాల అధికారులు వాడిన సెల్‌ఫోన్‌లోని సిం కార్డులను యాక్టివ్ చేసింది తాజాగా అరెస్టయిన అమన్ సలీం షేక్‌గా తేలింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

ఇ-టెండరు ఆహ్వానిస్తూ ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)
PUB/1266

భారత రాష్ట్రపతి తరఫున డిప్యూటీ CEE/GS/SC సికింద్రాబాద్ వారు క్రింది పనులకు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ యొక్క పద్ధతిలో ఇ-టెండర్ కోరుతున్నారు.
క్ర.సం.01.నిట్ నం: CE29GSUTRD11 2023-24 పని యొక్క పేరు : టెండర్ నం. CE 29 GSUTRD 112023-24 తేదీ: 17.11.2023 "1 SC డివిజన్‌పై PDPL- KYOP స్టేషన్‌ల మధ్య 292/24-26 కి.మీ వద్ద LC నెం. 39కు బదులుగా ROB నిర్మాణ ప్రతిపాదన దృష్ట్యా TRD భాగం యొక్క పని. టెండర్ ధర (రూ) : 3470079.44/-, పనిపూర్తి చేయు కాలం : 120 రోజులు. ముగింపు తేదీ : 11.12.2023 మ.15.00గం. వద్ద.
1) బిడ్ డాక్యుమెంట్ మరియు ఇతర వివరాలకు దయచేసి వెబ్‌సైట్ http://ireps.gov.in కు లాగిన్ అవ్వండి
2) టెండరుదారులు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను. మాన్యువల్ ఆఫర్‌లు ఏమాత్రం పరిగణించబడవు.
3) కాగోరు టెండరుదారులు అందరూ బయానా ధరను ఆన్‌లైన్ చెల్లింపు ద్వారా మాత్రమే చెల్లించవలసినదిగా కోరుతున్నాము.
4) కాగోరు టెండరుదారులు అందరూ GSTIN గుర్తింపు నెం.లు పొంది, వారి ఆఫర్‌లతో సహా దాఖలు చేయవలసినదిగా సూచిస్తున్నాము.
5) టెండర్‌దాఖలు కాలం ప్రారంభం యొక్క తేదీ వరకు టెండరుదారుడు ఏ సవరణకైనా తప్పక పరిశీలించవలెను. (ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడతాయి).
డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ గతిశక్తి/సికింద్రాబాద్.

T-నోటీస్ నెం. NED/E.29/TrD/ టెండర్ /16/2023-24 తేదీ:17.11.23
PUB/1267
దిగువ సంతకందారునిచే క్రింద పేర్కొన్న పనులకు సీల్డు టెండర్లు ఆహ్వానించబడుతున్నవి. క్ర.సం.01. టెండర్ నెం.: N/E.29/TrD/టెండర్/16/2023-24. పనుల వివరణ : నాందేడ్ డివిజన్ పై అమృత్ భారత్ స్టేషన్ పథకం (ABSS) క్రింద FOBల యొక్క ఏర్పాటుతో సంబంధితంగా OHE కు మార్పులు మరియు అదనపు ఏర్పాట్లు. సుమారు విలువ (రూ) : 2,09,49,517/-. పూర్తి చేయు కాలం : 15 నెలలు. బిడ్ సెక్యూరిటీ : (రూ): 2,54,700/-. ముగింపు యొక్క తేదీ : 15.12.2023 సా.16.00గం. వద్ద.
A1744
సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్/TR, నాందేడ్

తదుపరి టెండరు నిబంధనలు / వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

## బిజెపి జెండా సకల జనులకు అండ

### పార్టీ జాతీయ నేత కైలాష్ రాంచందర్‌గుప్త

**శివ్వంపేట, నవంబరు 20, ప్రభాతవార్త:** దేశంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ జెండాను ప్రజలు ఆశీర్వదిస్తే సకల జనులకు మోడీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ అధికారంలోకి రావడం తథ్యమని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు కైలాష్ రాంచదర్‌గుప్త జిల్లా పర్యటనలో భాగంగా శివ్వంపేటలో సోమవారం మీడియాతో మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబ పాలనకు చరమగీతం పాడటం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ప్రధాని మోడీ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమయంగా మారిందని, కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో పూర్తిగా కమర్షియల్ ప్రభుత్వంగా మారిందని రాంచందర్‌గుప్త ఆరోపించారు. సకల జనుల సౌభాగ్య తెలంగాణే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వ హయాంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మెనిఫెస్టో విడుదల చేసిందని, దీన్ని ప్రజలు గమనించి బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 20 గ్యారంటీలతో బీజేపీ మెనిఫెస్టో ఉందని, బీజేపీ అధికారంలోకి రాగానే తప్ప కుండా అమలు చేస్తుందన్నారు. కేంద్రంలో మోడీ నాయకత్వంలోనే మరో 20 సంవత్సరాలు అధికారంలోనే ఉంటుం దని కైలాష్ రాంచందర్‌గుప్త గుర్తు చేశారు. ఎక్కడ చూసినా బీజేపీ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, తప్పకుండా బీజేపీ పార్టీని ఆశీర్వదించి కమలం గుర్తుకు ఓటు వేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బిజెపి అధికారంలోకి వస్తే బిసిలే సిఎం

- ప్రజలు బిఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితిలో లేరు
- పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బీజేపీ పార్టీ అధికారంలోకి వస్తే బడుగు, బలహీన వర్గాలకు చెందిన వ్యక్తి సీఎం అవుతారని పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు, బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలపై ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మాట ఇచ్చి ముఖ్యమంత్రి పీఠమెక్కిన కేసీఆర్ మాట మరిచి మోసం చేశారని ఆయన దుయ్యబట్టారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలంలో సోమవారం బీజేపీ సకలజనుల విజయ సంకల్ప ఎన్నికల బహిరంగ సభలో కల్వకుర్తి బీజేపీ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి తల్లోజు ఆచారికి మద్దతుగా ఈటెల రాజేందర్ పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ ప్రభుత్వం పూర్తి స్థాయిలో అన్ని రంగాల్లో విఫలమైందని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ రాజ్యాంలో సంఘాలు, యూనియన్లు, సమ్మెలు వద్దని ఇందిర్‌పార్క్ వద్ద ఉన్న ధర్నా చౌక్‌ను ఎత్తివేసి హక్కులను కాలారాశరాన్నరు. దళితుడిని మొదటి ముఖ్యమంత్రి, డబుల్ బెడ్‌రూం ఇండ్లు, ఇంటికో ఉద్యోగమని ఎన్నో మోసపూరిత హామీలు ప్రకటించారన్నారు. అనగారిన వర్గాలకు రాజ్యాధికారం కావాలనేది బీజేపీ లక్ష్యమని, సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు పల్లె వెలుగు బస్సులను నిలిపివేశారని, కేసీఆర్ వేధింపులు, రాజకీయాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, డబ్బులు, మద్యాన్ని నమ్ముకొని కుట్రలు, కుతంత్రాల పాలన చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. రైతులకు సబ్సిడీ తొలగించి కేవలం రైతు బంధు ఇస్తూ రైతులను మభ్య పెడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణకు చెందిన సంపదను ముఖ్యమంత్రి కేసీఆర్ హర్యానా, గుజరాత్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన రైతులకు పంచుతున్నాడని, తెలంగాణ రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వారిని పరామర్శించిన పాపన పోలేదన్నారు. ఆప్‌కి సర్కార్ కిసాన్‌కి సర్కార్ అని నినాదాలు ఇస్తున్న కేసీఆర్ మాట ఇస్తే మోసం చేయడం కేసీఆర్‌కు వెన్నతో పెట్టిన విద్య ఆయన దుయ్యబట్టారు. మాదిగల వర్గీకరణ కోసం బీజేపీ పార్టీ అన్ని విధాల ప్రయత్నిస్తోందన్నారు. కల్వకుర్తి ప్రజల కష్టాల గురి ంచి ఏనాడు గత అసెంబ్లీలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడిన దాఖలాలు లేవని, కల్వకుర్తి ప్రజలను నమ్ముకొని 5సార్లు ఓటమిని చూసిన ఏనాడు నిరుత్సాహ పడకుండా ప్రజా ఉద్యమాలు చేసిన ఏకైక నాయకుడు తల్లోజు ఆచారి అన్నారు. ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తల్లోజు ఆచారికి మద్దతుగా నిలిచి కాశయం జెండాను ఎగురవేయాలని, 5సార్లు ఓడిపోయిన మొక్కవొని దీక్షతో 6వ సారీ మీ ముందుకు వచ్చారని, కష్టపడి పనిచేసే నైజాం ఆచారిదని, ఆచారిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని ఓటర్లను కోరారు.

### ఎత్తిన జెండా దించలే..

18 సంవత్సరాల ప్రాయంలో తాను కాశయం జెండా పట్టుకొని నేటికి ఎత్తిన జెండా దించలే, పార్టీలు మారలేదని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి తల్లోజు ఆచారి అన్నారు. కల్వకుర్తి ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని, కల్వకుర్తి ప్రాంతానికి రైల్వే ప్రాజెక్టును తీసుకొస్తానని, ఇప్పటికే రూ.14కోట్లతో సర్వే కోసం నిధులు తీసుకొచ్చానని, కరోన క్లిష్ట సమయంలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, కవితలు ఎక్కడికి పోయారని, ఫాంహౌస్‌లో నిద్రపోతే ఈటెల రాజేందర్ రాత్రింబవళ్లు తిరిగి ప్రజలను కాపాడున్నారని గుర్తు చేశారు. 6వ సారి అసెంబ్లీకి పంపించి కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే కృష్ణనాయక్, పార్టీ ఇన్‌చార్జి వై.శేఖర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కండె హరిప్రసాద్, నాయకులు చిందం కృష్ణయ్య, వై.విజయేందర్‌రెడ్డి, నక్కరకంటి శ్రీనివాసులు, మోహన్‌రెడ్డి, జంగయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

## మాలమాదిగల పంచాయితీ పరిష్కరించలేని సిఎం కెసిఆర్: మాజీమంత్రి పుష్పలీల

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు మాల మాదిగల చిన్న పంచాయతీ కూడా పరిష్కరించలేని అసమర్థ అశక్త ముఖ్యమంత్రి అని మాజీ మంత్రి పుష్పలీల విమర్శించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో సోమవారం మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచేందుకు దళిత ఓట్లు దండుకొనేందుకు దళిత ముఖ్యమంత్రి అని కెసిఆర్ మోసం చేశారని ఆమె గుర్తుచేశారు.
దళితులను కెసిఆర్ అవమాన పరిచారు. మూడెకరాల భూమి అన్నారు ఇవ్వలేదు. దళితబంధు 38,323 మందికి ఇచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలకంగా దళితులు వ్యవహరించినా వారికి ఉద్యమఫలాలు అందలేదు. దళితులపై దాడులు పెరిగాయి. దళితుల అబివృద్ధి ఆమడ దూరంలో నిలిచి పోయింది. కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీసబ్‌ప్లాన్ నిధులు తిన్నోళ్ళను వదలం అని హెచ్చరించారు. దళితులకు కెసిఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి. 3వతారీఖు దిమ్మతిరిగే ఫలితాలు వస్తాయి. దళితులపై దాడులు లాకప్‌డెత్ ఆత్మహత్యలు పెరిగాయి. కెసిఆర్ మాజీ ముఖ్యమంత్రి అవడం ఖాయం అని ఆయన అన్నారు.

## కాంగ్రెస్ పార్టీలోనే అనేక సంక్షేమ పథకాలు

**నారాయణఖేడ్, నవంబరు 20 ప్రభాతవార్త:** నారాయణఖేడ్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని కర్ణాటక మంత్రులు బాల్కి ఎమ్మెల్యే ఈశ్వర్ కాంద్రే, బీదర్ ఎమ్మెల్యే రహీం ఖాన్‌లు అన్నారు సోమవారం నారా యణఖేడ్‌లో మాజీ ఎంపీ సురేష్‌శెట్కార్ నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందని వారు అన్నారు.
అధి కారం లో రాగానే ఇచ్చిన ఐదు గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలు పొందు పరిచిన హామీలను అమలు చేస్తుందన్నారు. నిరుద్యోగులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఉద్యోగాలు లేక ఎందరో ఆత్మ హత్యలు చేసుకున్నారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి రాగానే ప్రత్యేకంగా డీఎస్సీ, ఎన్నో నోటిఫికేషన్లు వేస్తా మని అన్నారు. రాష్ట్రంలో ఈనెల 30న జరిగే పోలింగ్‌లో చేతి గుర్తుకు ఓటేసి నారా యణఖేడ్ పారీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.సంజీవరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్య క్రమంలో శ్రీనివాస్, రాకేష్ శెట్కార్, సాగర్ శెట్కార్, వినోద్‌పాటిల్, దారం శంకర్, తాహేర్ అలీ తదితరులు పాల్గొన్నారు.



బిఎస్‌పి ప్రజా ఆశీర్వాద సభ కోసం వేసిన టెంట్లు కూలిపోయిన దృశ్యం

## బిఎస్‌పి ప్రజా ఆశీర్వాదసభలో అపశ్రుతి

### టెంట్ కూలి 15 మందికి గాయాలు

### బాధితులను పరామర్శించిన పార్టీ ఛీఫ్ ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్

**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడలో ఏర్పాటు చేసిన బిఎస్‌పి ప్రజా ఆశీర్వాద సభలో అపశ్రుతి చోటుచేసుకుంది. గాలి దుమారానికి సభకు వేసిన టెంట్లు కూలాయి. టెంట్‌ల పైపులు ప్రజల మీద పడటంతో పలువు రికి గాయాలు అయ్యాయి. గాయాలైన వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ఘటనలో ఎక్కడ ప్రాణాపాయం చోటు చేసుకోలేదు. అయితే టెంట్ కూలిన సమయంలో స్టేజీపైనే బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, సిరిసిల్ల వేములవాడ అభ్యర్థి ఉండగా, ఎవరికి ఏమీ గాయాలు కాలేదు. అయితే రెండు నియోజక వర్గాలకు సంబంధించిన ప్రజలు ఈ సభకు భారీగా తరలి వచ్చారు. సభ జరుగుతున్న సమయంలో ఒకసారిగా షామియానాలు కూలిపోవడంతో ప్రజలు చెల్లాచెదురయ్యారు. గాయపడిన వారిని బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ పరామర్శించారు. టెంట్లు సరిగా వేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. జరిగిన సంఘటనపై బిఎస్‌పి అభ్యర్థులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. గాయపడిన వాళ్లందరినీ బిఎస్‌పి పార్టీ తరుపున చికిత్స అందించి ఆదుకుంటామని అన్నారు.

# కుప్పకూలిన స్టేడియం భవనం

### ఇద్దరు కూలీలు దుర్మరణం

### మొయినాబాద్‌లో నిర్మాణం జరుగుతుండగా ఘటన



కుప్పకూలిన నిర్మాణంలో ఉన్న ఆడిటోరియం భవనం

**మొయినాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** నాణ్యత లోపం, ఇంజినీరింగ్, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నిర్మాణంలో ఉన్న ఇండోర్ స్టేడియం భవనం కుప్పకూలి ఇద్దరు కూలీలు దుర్మరణం చెందగా, మరో 9 మందికి గాయా లయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సురంగల్ గ్రామ రెవెన్యూలో ఫైర్ ఫాక్స్ క్లబ్‌లో సోమవారం సాయంత్రం జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. క్లబ్ యజమాని ఒక భవన నిర్మాణ సంస్థకు ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు అప్పగించగా సుమారు 40 అడుగుల ఎత్తులో 200 అడుగుల వెడల్పుతో షెడ్డు మాదిరిగా నిర్మాణం చేపట్టారు. ఇనుప స్థంభాల మీద ఇనుప షీట్లు పైకప్పుగా వేశారు. ఆ షీట్ల మీద ఆర్‌సిసి స్లాబ్ వేశారు. పని జరుగుతున్న సమయంలో దాదాపు 14 మంది కార్మికులు పని చేస్తుండగా పెద్దశబ్దంతో నిర్మాణం పైకప్పు విరిగి పడిపోయింది. ఆ సమయంలో ఇద్దరు కూలీలు శిధిలాల కిందపడి చనిపోగా సుమారు 9 మందికి తీవ్ర గాయాలు కాగా వారిని ఆసుపత్రికి తరలించారు. రెస్క్యూ టీం శిధిలాలను తొలగించి చూడగా చనిపోయిన ఇద్దరిలో ఒకరు బీహార్‌కు చెందిన సునీల్ (26) కాగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబుల్ (35)గా పోలీసులు గుర్తించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.
మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడంతో పాటు క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించే బాధ్యత తీసుకుంటామని భవన నిర్మాణ యజమాని తెలిపారు.

### నాణ్యత లేని నిర్మాణాలే ప్రాణాలు తీస్తున్నాయి..

బతుకు దెరువు కోసం రాష్ట్రాలు దాటి వచ్చి భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్న వారికి నాణ్యత లేని నిర్మాణాలే యమపాశాలు అవుతున్నాయి. ఇటువంటి అక్రమ నిర్మాణాలను అడ్డుకునే వారు కనిపించడం లేదు.
సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేసే పోలీసులు, రెవెన్యూ అధికారులు నిర్మాణ సమయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు ఆ వార్తలను కవర్ చేసే విలేకరులు, మీడియా సిబ్బందిని మాత్రం పోలీసులు అడ్డుకోవడం, నియంత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ సంఘటనలో కూడా పోలీసులు విలేకర్ల విధి నిర్వహణను అడ్డుకునేందుకు సిఐ రంగా ప్రయత్నించారు. ఏసిపి చెప్తే గానీ మీడియాను అనుమతించమని అడ్డుకున్నారు.

## స్నేహితుల చేతిలో హతమైన యువకుడు

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన క్లూస్‌టీం

### సిసిపుటేజీని పరిశీలిస్తున్న పోలీసులు

**హైదరాబాద్ (నార్సింగి), నవంబరు 20, ప్రభాతవార్త :** స్నేహితుల చేతిలో ఓ యువకుడు హత్యకు గురయ్యాడు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా కొత్తరెడ్డి పాలెం మండలం, భువనం వారి పాలెం గ్రామానికి చెందిన కోటేశ్వర్‌రావ్ కుమారుడు జగదీష్(24), 2021.లో హైదరాబాద్‌కు వచ్చి కల్పతరు ఇంటర్‌నేషనల్ లిమిటెడ్ కన్స్‌ట్రక్షన్ కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ జాగీర్‌లోని కాళీమందిర్‌లో ఉంటున్న కంపనీ గెస్ట్‌హౌస్‌లో నివాసం ఉంటున్నాడు.
జగదీష్ మేనమామ నాగాంజనేయులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో కంగారు పడి కాళీమందిర్‌కు వచ్చి గెస్ట్‌హౌస్ వద్ద ఆరా తీశాడు. జగదీష్ హైదర్షాకోట్‌లోని స్మార్ట్ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ రెండో అంతస్థు 204.గదిలో ఉంటున్న స్నేహితుడు మనోజ్ వద్దకు వెళ్లినట్లు తెలిసింది. అక్కడికి వెళ్లి చూడగా గది తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. ఎంత పిలిచినా లోపలి నుంచి స్పందన రాకపోవడంతో తలుపులు తెరుచుకొని లోపలికెళ్లి చూడగా జగదీష్ నిర్జీవంగా పడి ఉన్నాడు. వెంటనే నాగాంజనేయులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ మృతుడు జగదీష్ ఒంటిపై ఉన్న గాయాలనుపరిశీలించి, క్లూస్‌టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. 18,19.వ,తేదీలలో ఎవరెవరు అపార్టుమెంట్‌లోకి వచ్చారు? వెళ్లారు? అని అపార్టుమెంట్‌తో పాటు పక్క ఇళ్లల్లో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.
పూర్తి ఆధారాలు సేకరించిన తరువాత హంతకులు ఎవరు? ఎంతమంది? ఎందుకు ఈ దారుణానికి ఒడిగట్టారో వంటి వివరాలు తెలుపుతామని పోలీసులు పేర్కొన్నారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి కేసును దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు.

# రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం

### ప్రధానిని తీసుకొచ్చి ప్రత్యేక నిధులు తీసుకొస్తా

### భారీ రోడ్‌షోలో బండి సంజయ్‌కుమార్



ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న బండి సంజయ్‌కుమార్

**వేములవాడ, ప్రభాతవార్త:** ఆదిలాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వేములవాడ చేరుకున్న బండి సంజయ్‌కు ప్రజలు ఘనస్వాగతం పలికారు. హెలిప్యాడ్ నుంచి బిజెపి అభ్యర్థి చెన్నమనేని వికాస్‌తో కలిసి సాయిరక్ష చౌరస్తా, జగిత్యాల బస్టాండ్, సుభాష్‌నగర్ మీదుగా కొనసాగుతున్న వేలాది బైక్‌లతో రోడ్ షో నిర్వహించారు. రాజన్న ఆలయం సమీపంలో బండి సంజయ్ ప్రసంగించారు. వేములవాడను అభివృద్ధి చేయాలనే ఏకైక లక్ష్యంతో డాక్టర్ చెన్నమనేని వికాస్ బిజెపి తరుపున పోటీ చేస్తున్నారే తప్ప కాంగ్రెస్, బిఆర్ఎస్ మాదిరిగా దోచుకోవాలనే ఆలోచన లేదని అన్నారు. ఎంపీగా ఉంటూ ఈ నియోజక వర్గ అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున నిధులు తెచ్చానని తెలిపారు. ఈ నియోజక వర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఎవరెక్కువ నిధులు ఖర్చు చేశారో చర్చకు సిద్ధమా అని ప్రశ్నిస్తూ కెసిఆర్ నా సవాల్ స్వీకరించాలన్నారు. నేను అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే కెసిఆర్ మాత్రం బాబ్రీ మసీదు కూల్చివేత గురించి మాట్లాడుతున్నారన్నారు. హిందూ సమాజమంతా ఆలోచించాలని కోరారు. తెలంగాణలో బిజెపి గాలి వీస్తోందని, ఉప ఎన్నికల ఫలితాలే నిదర్శనమని అన్నారు. రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో వేములవాడను అభివృద్ధి చేస్తానని అన్నారు. 12శాతం మైనారిటీ ఓట్ల కోసం 80శాతం హిందూ ఓట్లను కాంగ్రెస్, బిఆర్ఎస్ మోసం చేశాయని అన్నారు. హిందూ సమాజం ఆ పార్టీలకు బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ ప్రభుత్వానికి ఒకటవ తేదీ నాడు జీతాలిచ్చే పరిస్థితి లేదని అన్నారు.
అప్పుల పాలైన రాష్ట్రాన్ని కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు ఎట్లా గట్టేక్కిస్తాయో చెప్పాలని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఉన్నందున డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణలో అభివృద్ధి సాధ్యమని అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర ఆలయం కాశీ మాదిరిగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. వికాస్ రావును గెలిపిస్తే వారణాసి మాదిరిగా వేములవాడను సమగ్రాభివృద్ధి చేసి ప్రపంచమే ఆశ్చర్యపోయేలా చేస్తామని అన్నారు. వేములవాడ దేవస్థాన అభివృద్ధికి 400 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిన చరిత్ర కెసిఆర్‌దని, ఆలయయ అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేసిన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను సాగనంపాలని కోరారు. వికాస్ రావును గెలిపించి డిసెంబర్ 3న స్వామివారి సన్నిధానం వద్ద సంబురాలు చేసుకునేందుకు సిద్ధం కావాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో బిజెపి అభ్యర్థి వికాస్, ఆయన సతీమణి దీప, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు సంతోష్ బాబు, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీ వేస్తామన్న కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్‌కు ధన్యవాదాలు

### రాష్ట్ర బిఎడ్, డిఎడ్ అభ్యర్థుల సంఘం

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త :** రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు తాము ప్రజలకు ఏమీ చేయాలను కుంటున్నారో వాటి గురించి మేనిఫెస్టోను విడుదల చేశారు. అందులో భాగంగా ప్రతిపక్ష కాంగ్రెస్ తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని నిర్వహిస్తామని ప్రకటించింది. అలాగే మొదటి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం కోసం మెగా డీఎస్సీకి ఆమోదం తెలుపుతామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ అంశం మేనిఫెస్టోలో చేర్చినందుకు మరియు తొలి కేబినెట్ సమావేశంలోనే మెగా డీఎస్సీకి ఆమోదం ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర బీఎడ్, డీఎడ్ అభ్యర్థుల సంఘం సోమవారం టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని కలిసి ధన్యవాదాలు తెలిపారు. సోమవారం సంఘం సభ్యులు రేవంత్‌రెడ్డి నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రేవంత్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రాంమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీస్, నాయకులు గోపి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీను, కోటేష్, స్వప్న. మౌనిక, కవిత తదితరులు ఉన్నారు. గత 5 సంవత్సరాలుగా 4 లక్షల మంది అభ్యర్థులు మెగా డీఎస్సీ కోసం ఎదురు చూస్తే ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా కేవలం 5089 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్‌ను జారీ చేసిందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రాంమోహన్‌రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయుల నియామకం కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో చాలా జిల్లాల్లో అరకొర పోస్టులతో అన్యాయం చేశారని అభ్యర్థులు ఆందోళనలు చేసినా ప్రభుత్వం పోస్టులను పెంచలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార బీఆర్ఎస్ మాత్రం వారి మేనిఫెస్టోలో టీచర్ పోస్టుల భర్తీ చెప్పలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చి మెగా డీఎస్సీ అంశాన్ని చేర్చినందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులకు స్పష్టమైన హామీ ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీకి, రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

# రాష్ట్రంలో బిజెపి 30 సీట్లు గెలిచి తీరుతుంది

### చేవెళ్లలో నాలుగు అసెంబ్లీ సీట్లు గెలుస్తున్నాం

### మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్ (నార్సింగి), నవంబరు 20, ప్రభాతవార్త:** ఈ అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి 30 స్థానాలలో గెలిచి తీరుతుందని చేవెళ్ల మాజీ పార్లమెంట్ సభ్యుడు, బిజెపి సీనియర్ నేత కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొ న్నారు. సోమవారం రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్‌లో రేసు మల్లారెడ్డి నాయకత్వంలో బిజెపిలో పెద్ద ఎత్తున వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు చేరారు. పార్టీలో చేరిన వారందరికి రాజేంద్రనగర్ అభ్యర్థి తోకల శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాషాయం కండు వాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 30.మంది బిజెపి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఉంటే కేసీఆర్ జుట్టు మన చేతిలో ఉంటుందని, బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు కట్టు బానిసలుగా ఉంటారని, మనం ఏది డిమాండ్ చేస్తే ఆ పని పూర్తి చేయించుకోవచ్చన్నారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్ ఓటుకు రూ.6.వేలు, క్వార్టర్ సీసాను నమ్ముకున్నాడని, మనం మాత్రం సమర్థవంతమైన, అవినీతి లేని పాలనను అందించడంను నమ్ముకున్నామన్నారు. 18-35.ఏళ్ల మధ్య వయసున్న యువత, ఐటీ ఉద్యోగులు, మాదిగలు, తెలంగాణలో ఉంటున్న ఉత్తర భారతానికి చెందిన ప్రజలంతా బిజెపి గెలుపులో ముఖ్య భూమిక పోషించబోతున్నారన్నారు.
దేశ ప్రధాని ఉదయం 4.గంటలకే లేస్తారని, ఆరు గంటల వరకు కేంద్ర మంత్రులం దరితో మాట్లాడుతారని తెలిపారు. కానీ మన సీఎం కేసీఆర్ ఎప్పుడు లేస్తాడో, ఎవరితో మాట్లాడుతాడో ఆయనకే ఎరుకన్నారు. యాది పెట్టుకొండి... లిక్కర్ కేసులో కవిత అరెస్టు కావడం ఖాయమని, మన చట్టాలలోని లొసుగులను చూపించుకొని ఆమె తాత్కాలికంగా బయట తిరుగుతున్నారన్నారు. కవిత, కాలేశ్వరం, ధరణిలపై తప్పకుండా విచారణ జరుగుతుందని, బాధ్యులంతా జైలుకెళ్లడం ఖాయమని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 3.మార్లు సర్వే చేయించానని బిజెపి గ్రాఫ్ అంతకంతకూ పెరుగుతూనే ఉందన్నారు. చేవెళ్ల శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. బిజెపి శ్రేణులు సైనికుల్లా ఈ 15.రోజులు ఇంటింటికి వెళ్ల ప్రచారం చేయాలని, మన అభ్యర్థి గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డాలని



అత్తాపూర్‌లో జరిగిన బిజెపి సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పార్లమెంట్ సెగ్మెంట్లలో నాలుగు అసెంబ్లీ స్థానాల్లో బిజెపి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్‌లో కమలం గుర్తుపై ఓట్లు వేసి, యువకుడు, సేవగుణం కలిగిన తోకల పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తోకల శ్రీరాంరెడ్డి, రేసు మల్లారెడ్డి, పోచిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సోమేశ్‌కుమార్ తీర్పు మాకు వర్తించదు

## విడివిడిగా వాదనలు వినండి

## హైకోర్టుకు సివిల్ సర్వీసెస్ అధికారుల, న్యాయవాదుల అభ్యర్థన

## అంగీకరించిన ధర్మాసనం

## విచారణ డిసెంబరు 4కు వాయిదా

**హైదరాబాద్, నవంబరు 20 , ప్రభాతవార్త :** ఎపి, తెలంగాణ రాష్ట్రాలకు ఐఎఎస్, ఐపిఎస్ అధికారుల కేటాయింపుకు సంబంధించి పిటిషనర్ల తరపు న్యాయవాదుల అభ్యర్థనపై పిటిషన్లను విడి విడిగా వింటామని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 4 కి వాయిదా వేసింది. రాష్ట్ర విభజన సందర్భంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 376 మంది ఐఎఎస్ , 258 మంది ఐపిఎస్ ,149 మంతి ఐఎఫ్‌ఎస్ అధికారులను తెలంగాణ ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కేంద్రం నియమించిన ప్రత్యూష్ సిన్హా కమిటీ కేటాయించింది.

వారిలో 13 మంది అఃల భారత సివిల్ సర్వీసెస్ (ఎఐఎస్ ) అధికారులు తెలంగాణలోనే ఉండాలని నిర్ణయించుకుని సెంట్రల్ అడ్మినిస్ట్రేషన్ ట్రిబ్యు నల్ (క్యాట్) ను ఆశ్రయిం చారు. వారి అభ్యర్థనను క్యాట్ అంగీకరించింది. క్యాట్ ఉత్తర్వుల మేరకు వారు తెలంగాణలో కొనసాగు తున్నారు. క్యాట్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ 2017 లో కేంద్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేసింది. క్యాట్ ఉత్తర్వులను కొట్టివేయాలని అభ్యర్థించింది. ఈ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభినందకుమార్ షావిలి, జస్టిస్ జే. అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారించింది. ఈ సందర్భంగా సీజే కీలక వ్యాఖ్యలు చేశారు. కేడర్ కేటాయింపులు జరిపి ఇప్పటికే 10 సంవత్సరాలు కావస్తోందని, ఈ వ్యవహారంపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రెయినింగ్ (డీఓపీటి ) ముందు తమ అభ్యర్థనను వినిపించవచ్చు కదా అని సరదాగా సూచించారు.

13 మంది అధికారుల్లో చాలా మంది పదవీ విరమణకు దగ్గరగా ఉన్నారని, కేడర్ కేటాయింపులపై డిఓపిటీ వద్దకు వెళితే బాగుంటుందని వ్యాఖ్యానించారు. అంతకు ముందు పిటిషనర్ల తరపు న్యాయవాదుల వాదనలను ధర్మాసనం విచారించింది. సీనియర్ ఐఎఎస్ అధికారి సోమేష్ కుమార్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పు తమకు వర్తించదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోర్టుకు నివేదించారు. సోమేష్‌కుమార్‌కు జారీ చేసిన ఉత్తర్వులు వేరని, తమ అభ్యర్థనలు వేరని తెలిపారు.

విడివిడిగా తమ వాదనలు వినిపిస్తామని కోర్టుకు విన్నవించారు. ఈ సందర్భంగా డిఓపిటి తరపున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ నరసింహాశర్మ అభ్యంతరం చెప్పారు. 13 మంది అధికారుల్లో 7 మంది అభ్యర్థనలు మాత్రమే వేరని కోర్టు దృష్టికి తెచ్చారు. మిగిలిన 6 మంది డిజీపీ అంజనికుమార్‌తో పాటు ఐఎఎస్‌లు జి అనంతరాము, ఎస్ఎస్ రావత్, ఆమ్రపాలి కాటా, రోనాల్డ్ రోస్ మరో అధికారికి సోమేష్ కుమార్‌కు జారి చేసిన ఉత్తర్వులు వర్తిస్తాయని నివేదించారు. అధికారుల తరపు న్యాయవాదుల వాదనలు విన్న ధర్మాసనం విడివిడిగా వాదనలు వినేందుకు అంగీకరించింది.

డిసెంబర్ 4 నుంచి ఒక్కొక్కరి వాదనలు వేర్వేరుగా వింటామని ధర్మాసనం తెలిపింది. ఏపీకి కేటాయించిన ఐఎఎస్‌లు హరికిరణ్, అనంతరాము, వాకాటి కరుణ, మల్లెల ప్రశాంతి, శివశంకర్ లోహితి, ఎస్ఎస్ రావత్, వాణీప్రసాద్, రోనాల్డ్ రోస్, గుమ్మల సృజనతో పాటు కేంద్రంలో డిప్యుటేషన్‌పై ఉన్న ఆమ్రపాలి, అభిలాష్ బిస్త్, డిజిపి అంజనీకుమార్ ఉన్నారు. మరో అధికారి అభిషేక్ మహంతి హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణకు వచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రస్తుతం కరీంనగర్ సిపిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎపి నుంచి తెలంగాణకు కేటాయించిన ఐఎఎస్‌లు ఎస్ఎస్ రావత్, అనంతరాము ఉన్నారు. అంతకు ముందు హైకోర్టు ఆదేశాల మేరకు సోమేష్ కుమార్ ఎపిలో జాయిన్ అయ్యారు. ఆ తర్వాత రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

# ఇంగ్లీష్‌లో మాట్లాడితేనే ప్రాక్టికల్ మార్కులు

## ఒక నిమిషం మాట్లాడాల్సి ఉంటుంది

## ప్రశ్నాపత్రం కూర్పును సిద్ధం చేసిన ఇంటర్ బోర్డు

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది 2023-24 విద్యా సంవత్సరం నుంచే ఇంటర్మీడియట్‌లో ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్స్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో దీనిని అమలు చేయనున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి మార్కుల విధానాన్ని ఇంటర్ బోర్డు సిద్ధం చేసినట్టు తెలుస్తోంది. ఇంటర్‌లో ఇంగ్లీష్‌లో ప్రాక్టికల్‌కు 20 మార్కులను కేటాయించారు. అందులో భాగంగా విద్యార్థి తనకు నచ్చిన టీచర్ గురించి.. అలాగే తనకు నచ్చిన ఆట గురించి నిమిషం(60సెకన్లు) పాటు ఇంగ్లీష్‌లో మాట్లాడాల్సి ఉంటుంది. దీనిని జస్ట్ ఏ మినిట్(జేఏఎం) .. జామ్ పేరుతో అమలు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే రోల్‌ప్లేలో భాగంగా ఇద్దరు విద్యార్థులు ఒకటి లేదా రెండు నిమిషాల పాటు పరస్పరం సంభాషించాల్సి ఉంటుంది. అలా సంభాషిస్తున్న సమయంలో వారి మాటలను రికార్డు చేస్తారు. అలా చేసిన వాటి ద్వారా విద్యార్థుల కమ్యూనికేటీవ్ స్కిల్స్‌ను పరిశీలించనున్నారు. థియరీకి 80 మార్కులు.. ప్రాక్టికల్స్‌కి 20 మార్కులు కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో పాస్ మార్కులు 35కి గానూ 80 మార్కుల్లో 27 మార్కులు.. ప్రాక్టికల్స్‌లోని 20 మార్కులకు గానూ కనీసం 7 మార్కులు వచ్చినా పాస్ అయినట్టుగా భావిస్తారు. మొదటి సంవత్సరంలో సెక్షన్ ఏలో 24 మార్కులు, సెక్షన్ బీలో 8 మార్కులు, సెక్షన్ సీలో 48 మార్కులు, ప్రాక్టికల్ మార్కులు 20గా నిర్ణయించడంతో మొత్తంగా 100 మార్కులకు ప్రశ్నాపత్రాన్ని రూపొందిస్తున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సుమారు 5 లక్షల మంది వరకు విద్యార్థులు ఉంటారు.

# మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ కృషి

## జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త :** తెలంగాణలో మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ కృషిచేస్తుందని మహిళా రిజర్వేషన్ సందర్భంగా సామాజికంగా వెనుకబడిన మహిళల అభ్యున్నతి కోసం చట్టసభల్లో బిసి కులాల వారికి రిజర్వేషన్ కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ డిమాండ్ చేసిన అంశంను జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నెట్టా డిసౌజా అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో ఆమె సమక్షంలో బిఆర్ఎస్ చెందిన పలువురు మహిళా కార్యకర్తలు చేరినారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మరాజ్యం తెలంగాణలో పునఃస్థాపితం చేయాలని ప్రజలను కోరారు. సంక్షేమం అభివృద్ధి సమపాళ్ళలో జరిగేది కేవలం కాంగ్రెస్ పాలితరాష్ట్రాలలోనే అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం నిలబడాలంటే బిఆర్ఎస్‌ను ఓడించాలని ఆమె పిలుపు నిచ్చారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో సంక్షేమ పథకాలు ప్రజల జీవన ప్రమాణాలో మార్పు తెస్తాయని ఆమె ధీమా వ్యక్తంచేశారు. ఫాతిమా మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి దీపా అనిల్ పాల్గొన్నారు.

# నల్లగొండ నా దత్తతలోనే ఉంది

## ధరణి తొలగిస్తే మళ్లీ పైరవీ, దళారీల రాజ్యమే

## కైలాసం ఆటలో పెద్దపాము

## మింగుతది జాగ్రత్త: సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త నల్లగొండ:** ప్రజాస్వామ్యంలో ఐదు సంవత్సరాల కొకసారి మీరు వేసే ఓటు సద్వినియోగం చేసుకుంటే మంచి జరుగుతది, దుర్వినియోగం అయితే మీరే నష్టపోతారని సీఎం కెసిఆర్ అన్నారు. నల్లగొండలో ప్రజా ఆశీర్వాద సభ బిఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కంచర్ల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన పట్టణ కేంద్రంలోని చర్లపల్లి బైపాస్‌లో జరిగిన సభలో ముఖ్యమంత్రి కెసిఆర్ మాట్లాడుతూ నల్లగొండ నియోజకవర్గం నా దత్తతలోనే ఉంది. ఇంకా అభివృద్ధి చేయాల్సింది చాలా ఉంది. రాయిని, రత్నాన్ని గుర్తుంచుకోండి అని అన్నారు. అభ్యర్థుల గురించి వారి ఆలోచన వారి మంచి, చెడు ఆలోచించి వారి వెనకాల ఉన్న పార్టీల గురించి ఆలోచన చేయాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ మీకండ్ల ముందే పుట్టింది. ప్రజల హక్కుల కోసం పోరాడింది. 15 సంవత్సరాల పోరాటం, 10 సంవత్సరాల పరిపాలన కొనసాగించిందని పేర్కొన్నారు. 50 సంవత్సరాల కాంగ్రెస్ చరిత్రలో ఏది చక్కగా పరిపాలన జరగలేదని, భూదాన్ పోచంపల్లిలో చేనేతల ఆకలి, చావులు నల్లగొండ బిడ్డలు హైదరాబాద్‌లో కార్మికులుగా ఉండేవారు అని గుర్తుచేశారు. కష్టపడితే తెలంగాణ వచ్చింది. నల్లగొండ పట్టణాన్ని రూ.1400కోట్లతో అభివృద్ధి చేశాం. అంతా మీకండ్ల ముందే కనపడుతుందని పేర్కొన్నారన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హయాంలో నల్లగొండ ఎట్లు ఉండే ఎవరు పనిచేశారన్నది గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక పెన్షన్‌లు రూ.200ల నుండి రూ.2వేలకు పెంచాము. మళ్లీ అధికారం ఇస్తే రూ.5016లు పెంచుతామన్నారు. పాత నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీ ఒక్కటైనా ఉండేదా అని, తెలంగాణ ఏర్పడిన తరువాత జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశామన్నారు. రైతుబంధు ఉండాలంటే నల్లగొండలో కంచర్ల భూపాల్‌రెడ్డిని ఆశీర్వదిస్తే రైతుబంధు ఎకరాలకు రూ.16వేలు పెరుగుతుందన్నారు. ఓటు తలరాతను మారుస్తుంది, పనికిమాలిన వారికి ఓటు వేస్తే బతుకే ప్రశ్నార్థకం అవుతుందని తెలిపారు.



చర్లపల్లి బైపాస్‌లో జరిగిన సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి కెసిఆర్

రైతుబంధు దండగా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అంటున్నారు, మూడు గంటలకు కరెంట్ అని రేవంత్‌రెడ్డి అంటున్నారు, మూడు గంటల కరెంట్ రైతులకు సరిపోతుందా అని సభలో రైతులను ప్రశ్నించారు. 10హెచ్‌పి మోటార్లు పెట్టుకోవాలని రేవంత్‌రెడ్డి చెప్పుతున్నాడు. నల్లగొండను ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ తకెళ్లపల్లి రవీందర్‌రావు, ఎంసి కోటిరెడ్డి, ఎలిమినేటి ఉమామాదవ్‌రెడ్డి, పాల్వాయి స్రవంతి రెడ్డి, చకిలం అనిల్‌కుమార్, చాడ కిషన్‌రెడ్డి, మందడి సైదిరెడ్డి, పంకజ్‌యాదవ్, నిరంజన్‌వలీ, ఎలిమినేటి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించండి

## బిజెపి, బిఆర్ఎస్‌లను ఓడించండి

## బిఎల్‌ఎఫ్ రాష్ట్ర ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్

**హైదరాబాద్, నవంబరు 20 , ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని బీఎల్‌ఎఫ్ ఛైర్మన్ నల్లా సూర్యప్రకాష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఎల్‌ఎఫ్ తరపున పోటీ చేస్తున్న 36 మంది అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపించాలని కోరారు. బీఎల్‌ఎఫ్ బలపరుస్తున్న ఎంసీపీయూ, బహుజన లెఫ్ట్‌పార్టీ, బహుజన కమ్యూనిస్టు పార్టీ, వర్కర్స్ పార్టీ, ప్రజా పోరాట సమితి అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సూర్యప్రకాష్‌తోపాటు రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, యంసీపీఐయు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్‌ఎఫ్ నాయకులు మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీఎల్‌ఎఫ్ అభ్యర్థులు పోటీలో లేని చోట వామపక్ష, బహుజన శక్తులకు ఓట్లేయాలని కొల్లాపూర్‌లో బర్రెల అక్కకు ఓటేసి గెలిపించాలని వారు ప్రజలను కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో మనువాద బీజేపీ, నియంతృత్వ బీఆర్ఎస్, దాని బీ టీమైనా ఎంఐఎంను ఓడించాలన్నారు.

సంస్కరణలు తెచ్చి ఆర్థిక వ్యవస్థను కుదేలు చేసిన కాంగ్రెస్ పార్టీని కూడా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు డబ్బులు పంచకుండా, మద్యం పంపిణీ చేయకుండా గెలవగలవా? అని ప్రశ్నించారు. కామరెడ్డి, గజ్వేల్‌లో పోటీ చేస్తున్న బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు గెలుపు కోసం రూ. 10వేల వరకు ఇస్తామని ప్రజలను మభ్యపెడుతున్నారని వారు మండిపడ్డారు. ఓట్లను వ్యాపారం చేయడం ఏ రకమైన ప్రజాస్వామ్యమని వారు ప్రశ్నించారు. ఎన్నికల సంఘం సరైన స్పందన చూపడం లేదన్నారు.

# గ్రూప్-2 ఉద్యోగాలు పెంచుతాం

≫ చెప్పాలన్నారు. తాము అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో అయినా పది సంవత్సరాలలో తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలను ఇస్తే ఆ విషయాన్ని తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు యువకులకు గణాంకాలతో సహా వివరించాలని ఆయన కాంగ్రెస్,బిజెపిలకు సవాల్ చేశారు. రాష్ట్ర యువకులు,విద్యార్థులు కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ రాజకీయాల కోసం ఈ అంశంపైన చేస్తున్న అసత్య పూరిత ప్రాపంగాండాను తిప్పికొట్టి నిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాల తాలూకు వివరాల జాబితాను, ప్రస్తుతం భర్తీ చేస్తున్న ఉద్యోగాల ప్రక్రియ తాలూకు వివరాలను గణాంకాలతో సహా అందించారు. మంత్రి కెటిఆర్ తమతో ఈ అంశంపైన విస్తృతంగా సంభాషించడం తమకు సంతోషాన్ని కలిగించిందని మంత్రితో సమావేశమైన ప్రభుత్వ ఉద్యోగార్థులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగాలను పెద్ద ఎత్తున ఇచ్చినప్పటికీ నియామక ప్రక్రియకు సంబంధించిన కొన్ని సమస్యల వలన యువతలో కొంత ఆందోళన నెలకొందని వారు తెలిపారు. ఈ అంశాలపైన మంత్రి కెటిఆర్‌తో తమ అభిప్రాయాలను సూచనలను పంచుకున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత పోస్టుల సంఖ్యను మరింతగా పెంచాలని విజ్ఞప్తి చేశారు. పోస్టుల భర్తీ ప్రక్రియ,రోస్టర్ పాయింట్ల కేటాయింపు, విద్య అర్హతల విషయంలో ఉన్న కొన్ని సమస్యలను సులభంగా పరిష్కరించే అవకాశం ఉందని ఇందుకు సంబంధించిన కొన్ని సలహాలు,సూచనలను అందించారు. యువకుడిగా దశాబ్దకాలంపాటు ప్రైవేట్ రంగంలో ఒక ఉద్యోగిగా పనిచేసిన అనుభవం తనకు ఉందని,అది ప్రభుత్వ ఉద్యోగమైన, ప్రైవేటు ఉద్యోగమైన దాన్ని సాధించేందుకు తర్వాత దాని నిర్వర్తించేందుకు ఎదురయ్యే సమస్యలను అర్థం చేసుకోగలుగుతానని కెటిఆర్ అన్నారు.

# బిజెపికి అన్ని వర్గాల నుంచి మద్దతు వస్తుంది: కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు ప్రజలతో పాటు దళితులు సైతం బిజెపికి మద్దతుగా తరలి వస్తున్నాయని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి ఎన్నికల మేనిఫెస్టో ప్రటించిన తరువాత ప్రచార కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తున్నామన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎన్నికల ప్రణాళికను తెలంగాణ ప్రజలు ముందుంచారని, అంచనాలకు మించి క్షేత్రస్తాయిలో అన్ని వర్గాల ప్రజల నుంచి బిజెపికి విశేష ఆదరణ, మద్దతు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో నిశ్శబ్ధ విప్లవంలా చాలా నియోజకవర్గాల్లో బిజెపికి అనుకూలంగా స్పందిస్తున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రచార రథాలను గ్రామాల్లోకి రాకుండా అడ్డుకుంటున్నారని అన్నారు.

# 30న హైకోర్టుకు సెలవు

## ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 20:** ఈనెల 30న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో హైకోర్టుకు సాధారణ సెలవును ప్రకటించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టుతో పాటు జిల్లా జ్యూడీషియరీకి సెలవు దినంగా ప్రకటించారు. ఇందుకు బదులుగా డిసెంబర్ 16న శనివారంనాడు న్యాయస్థానాలు పనిచేస్తాయని రిజిస్ట్రార్ జనరల్ వెల్లడించారు.

# బదలీ అయిన న్యాయమూర్తులకు ఘనంగా వీడ్కోలు

**హైదరాబాద్, నవంబరు 20 , ప్రభాతవార్త :** రాష్ట్ర హైకోర్టులో పనిచేస్తూ బదలీ అయిన న్యాయమూర్తులు జస్టిస్ చిల్లకూరు సుమలత, జస్టిస్ ఎం సుధీర్‌కుమార్‌కు హైకోర్టు ఫుల్‌కోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తులు జస్టిస్ పి శ్యాంకోషీ, జస్టిస్ అభినందకుమార్ షావిలీ, జస్టిస్ టి వినోద్‌కుమార్‌తో పాటు న్యాయమూర్తులు, టిఎస్ బార్‌కౌన్సిల్ ఛైర్మన్ ఎ నర్సింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లె నాగేశ్వరరావు ఇతర సభ్యులు, న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ సుమలత, జస్టిస్ సుధీర్‌కుమార్ న్యాయమూర్తులుగా చేసిన సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇద్దరు న్యాయమూర్తులను ఘనంగా సత్కరించారు. జస్టిస్ సుమలత కర్నాటక హైకోర్టుకు, జస్టిస్ సుధీర్‌కుమార్ మద్రాస్ హైకోర్టుకు బదలీ అయిన విషయం తెలిసిందే.

# ఆర్టీసిలో ఆరు నెలలపాటు సమ్మె నిషేధం

## ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నవంబరు 20 , ప్రభాతవార్త :** అత్యవసర సర్వీస్ అయిన తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్‌టిసి) లో సమ్మె చేయడాన్ని ప్రభుత్వం నిషేదించింది. ఈ మేరకు రాష్ట్ర రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి ఎ వాణిమోహన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్ 1 నుంచి ఆరు నెలల పాటు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని ప్రభుత్వం పేర్కొన్నది. సంస్థ వైస్ ఛైర్మన్, ఎండి ప్రభుత్వానికి రాసిన లేఖ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులో ఉటంకించారు. అత్యవసర సర్వీస్ అయిన రోడ్డు రవాణా సంస్థలో సమ్మెను నిషేదించాల్సిన అవసరాన్ని గుర్తించి తెలంగాణ అత్యవసర సేవల నిర్వహణ చట్టం, 1971 లోబడి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

# భగ్గుమన్న ఫిషింగ్ హార్బర్



- 50 బోట్లు పూర్తిగా దగ్ధం
- మరో 40 బోట్ల ధ్వంసం
- దాదాపు 40 కోట్ల ఆస్తి నష్టం
- రోడ్డునపడ్డ వేలాది కుటుంబాలు
- ఘటనా స్థలానికి చేరుకుని విచారించిన సిపి రవిశంకర్, డిసిపి ఆనంద రెడ్డి
- ప్రమాదంపై సిఎం జగన్ దిగ్భ్రాంతి.. దర్యాప్తునకు ఆదేశం
- ఓ యూట్యూబర్ పనిగా అనుమానాలు
- పోలీసుల అదుపులో యూట్యూబర్?
- 80 శాతం నష్టపరిహారం ప్రకటించిన ఎపి సిఎం జగన్

**విశాఖ క్రైం - ప్రభాతవార్త:** విశాఖ హార్బర్ చరిత్రలో ఎప్పుడూ రగలేని విధంగా ఘోరఅగ్నిప్రమాదం జరిగింది. మత్స్యకారులందరూ గాఢ నిద్రలో ఉండగా జరిగిన అగ్ని ప్రమాదం గంగపుత్రులకు కాళ రాత్రిగా మారింది. లక్షలు విలువ చేసే మత్స్య సంపదతో కూడిన 40 బోట్లు అగ్నికి ఆహుత య్యాయి. ఈ ప్రమాదంలో సుమారుగా 35 నుంచి 40 కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాదానికి గురైన ఒక్కో బోటులో 5 నుంచి 6లక్షల విలువైన చేపలుండడం అగ్ని ప్రమాదంలో అవి పూర్తిగా దగ్ధంకావడంతో వందలాది కుటుంబాలు రోడ్డునపడ్డాయి.. ఆకతాయిల పనివలన మత్స్యకారులు జీవనాధా రాన్ని కోల్పోయారు.

**అగ్నికి ఆహుతై బూడిదైన 50 బోట్లు...**

విశాఖ హార్బర్‌లో ఆదివారం రాత్రి సుమారు 11గం. సమ యంలో ఓ బోటు నుంచి ఒక్కసారిగా అగ్నికీలలు ఎగిసిప డ్డాయి.. ఆ తర్వాత ఆ అగ్ని కీలలు హార్బర్లో నిలిచి ఉన్న మరో కొన్నిబోట్లకు వ్యాపించడంతో అవన్నీ అగ్నికి ఆహుత య్యాయి. సుమారు 40 కోట్ల మేర ఆస్తీ నష్టం జరిగింది. ఇదిలా ఉండగా విషయం తెలుసుకున్న అగ్ని మాపక, పోలీస్ బృందాలు ఘటనా స్థలాన్ని చేరుకు న్నాయి. ఎగిసి పడుతున్న అగ్ని కీలలను ఫైర్ బృందాలు కృషి చేసి అదుపు చేశారు. అగ్ని కీలలు మిగిలిన బోట్లకు వ్యాపించకుండా జాగ్రత్తలు చేపట్టారు..

**రోడ్డున పడ్డ మత్స్యకారులు**

విశాఖ హార్బర్లో ఆదివారం రాత్రి జరిగిన ఘోర అగ్ని ప్రమాదం కారణంగా వందలాది మంది మత్స్యకార కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు కావాలనే చేశారని తద్వారానే ఎప్పుడిదో లేని విధంగా అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు, ఫిషింగ్ హార్బర్ ప్రధాన ద్వారం వద్ద మత్స్యకార కుటుంబాలు ఆందోళనకు దిగాయి. దగ్ధమైన బోటులకు, దానిపై ఆధారపడిన మత్స్యకారులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలానికి సీఎం వైఎస్ జగన్ రావాలని డిమాండ్ చేస్తూ హార్బర్ గేటు వద్ద మత్స్యకార కుటుంబాలు బైఠాయించారు.

**ఘటానా స్థలానికి చేరుకుని విచారించిన సిపి రవిశంకర్, డిసిపి ఆనందరెడ్డి...**

విశాఖ హార్బర్లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరుపుతున్నామని విశాఖ సిపి రవిశంకర్ తెలిపారు. ప్రమాదం తర్వాత యువకులు పరారయ్యారని... వారి కోసం గాలిస్తున్నామని తెలిపారు. సుమారు రాత్రి 11 గం. సమయంలో మంటలు చెలరేగాయని, గాలుల తీవ్రతతో పక్క బోట్లకు వ్యాపించాయని డీసీపీ ఆనందరెడ్డి తెలిపారు.

**అగ్ని ప్రమాదానికి కారకులెవరు?**

హార్బర్‌లో జరిగిన అగ్ని ప్రమాదానికి కారకులెవరనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అగ్ని ప్రమాదం జరగడానికి ఓ మందు పార్టీ, ఆ తర్వాత జరిగిన ఘర్షణే కారణంగా తెలుస్తోంది. ఓ యూ ట్యూబర్‌కి బాలాజీ అనే వ్యక్తికి ఆదివారం రాత్రి ఒకటో నెంబర్ జెట్టీలో గొడవ జరిగినట్లు అనుమానిస్తున్నారు. యూ ట్యూబర్ బోటుని అమ్మకానికి పెట్టడంతో బాలాజీ అనే వ్యక్తి కొనుగోలు చేసుకుని అడ్వాన్స్‌గా కొంత సొమ్ము ఇచ్చినట్లు, కొద్ది రోజులకి అడ్వాన్సు తిరిగి ఇవ్వాలని బాలాజీ అడిగినట్టు అందరూ అనుకుంటున్నారు.

**సిఎం జగన్ దిగ్భ్రాంతి.... 80 శాతం నష్టపరిహారం ప్రకటన...**

విశాఖ హార్బర్ ప్రమాదంపై సిఎం జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మత్స్యకారుల బోట్ల దగ్ధంపై దర్యాప్తునకు ఆదేశించారు. ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించాలని మంత్రి సీదిరికి సిఎం సూచించారు. బోట్లు కోల్పోయిన మత్స్యకారులకు అండగా ఉండాలని... ప్రమాదం వెనుక ఎవరున్నా వదిలిపెట్టవద్దంటూ జగన్ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం 80 శాతం నష్టపరిహారాన్ని సిఎం జగన్ ప్రకటించారు.

# దరిద్రానికి నేస్తం హస్తం

## వరి ధాన్యం ఎక్కువగా పండించేది ఉమ్మడి నల్గొండ జిల్లానే .. గుట్టపైకి ఆటోలను అనుమతిస్తాం : మంత్రి కెటిఆర్



రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి కెటిఆర్

**యాదగిరిగుట్ట, ప్రభాతవార్త :** కులాల పేర్లు, మతాల పేర్లతో రాజకీయ డ్రామాలడే వారికి ప్రజలు ఓటుతో సరైన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. సోమవారం యాదగిరిగుట్టలో జరిగిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ .. కుల, మతాల పేర్లు వాడుకుని ఇక్కడ గెలిచినా వారి జుట్టు మాత్రం ఢిల్లీలోనే ఉంటుందని, ఏ పని కావాలన్న ఢిల్లీ నుండి అనుమతులు రానిదే ఇక్కడ ఏమీ చేయలేరని అన్నారు. కావున మాయమాటలకు మోసపోయి మన జుట్టు ఢిల్లీ వాళ్ళ చేతిలో పెట్టవద్దని కోరారు. బీఆర్ఎస్ పార్టీ గెలవగానే బీసీ, ఎస్సీల అసైన్డ్ భూములకు సంపూర్ణ యాజమాన్య హక్కు కల్పిస్తామని, దీంతో వారి భూములను అమ్ముకోవచ్చు, కొనుకోవచ్చు, బ్యాంకుల ద్వారా ఋణం తీసుకోవచ్చునని అన్నారు. అదేవిధంగా మహిళా శక్తిని ప్రోత్సహిస్తూ ప్రతి ఊర్లో రాణిరుద్రమ్మ, సమ్మక్క సారలమ్మల పేర్లతో మహిళా సమైఖ్య భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. వరిధాన్యం అత్యధికంగా పండించే జిల్లాలో ఉమ్మడి నల్గొండ జిల్లానే ప్రథమ స్థానంలో ఉందన్నారు. దేశానికి అన్నం పెట్టే రీతిలో తెలంగాణ ప్రభుత్వం ఎదిగిన తరుణంలో తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి సన్నబియ్యం ఇస్తామని, అదేవిధంగా రైతులకు, కౌలు రైతులకు, రైతు కూలీకు కేసీఆర్ భీమా ప్రతి ఇంటికి ధీమా పథకం కింద రూ.5లక్షల భీమా కల్పిస్తామని అన్నారు. రూ.2వేల ఉన్న పెన్షన్‌ను రూ.5వేలకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. గతంలో రూ.400ల ఉన్న గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం రూ.1,250 చేసిందని, అంటే అదనంగా రూ.850 పెంచిందని, ఈ పెంచిన రూ.850ను మళ్ళీ ప్రభుత్వం రాగానే ప్రభుత్వమే భరించి మీకు రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇస్తుందని అన్నారు. అదేవిధంగా మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద 18 యేళ్లు నిండిన ప్రతి ఆడబిడ్డకు రూ.3వేలు ఇస్తామని అన్నారు. ఆసరా పెన్షన్‌లు సైతం పెంచుతామన్నారు.

**కాంగ్రెస్‌కు ఓటేస్తే..మళ్లీ చీకటి రోజులే: మంత్రి కెటిఆర్**

**మిర్యాలగూడ:** కాంగ్రెస్ ఓటేస్తే..మళ్లీ కర్ఫ్యూలు, మతకల్లోలాలు, కరెంట్ లేని చీకటి రోజులు వస్తాయని బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు అన్నారు. సోమవారం మిర్యాలగూడ పట్టణంలోని నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. పట్టణంలోని హనుమాన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి సాగర్ రోడ్డు మీదుగా రాజీవ్‌చౌక్ వరకు సాగిన రోడ్‌షోలో వేలాదిగా భారాస శ్రేణులు తరలివచ్చి స్వాగతం పలికారు. రాజీవ్‌చౌక్ వద్ద కార్నర్ సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రతి పక్షాలపై విరుచుపడ్డారు. 11సార్లు 55 ఏళ్ల కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అవకాశం ఇస్తే..ఏమి చేయలేని సన్నాసులు మరొక్క చాన్స్ ఇవ్వాలంటూ ప్రజలను మాయ మాటలతో మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారని, ప్రజలు వారి మాయలో పడవద్దని, అభివృద్ధి కొనసాగాలంటూ మళ్లీ కెసిఅర్ ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు.



సోమవారం మీడియా సెంటర్‌లో మాట్లాడుతున్న బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

# బిజెపిది ప్రజల మేనిఫెస్టో

## బిజెపి ఎంపి డా.లక్ష్మణ్

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** బిజెపి సబ్ కా సాత్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్ అనేది సుపరిపాలన కోసం అని బిజెపి డా.లక్ష్మణ్ అన్నారు. సోమవారం మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా డా.లక్ష్మణ్ మాట్లాడుతూ బిజెపి మేనిఫెస్టో ప్రజల మేనిఫెస్టో అన్నారు. మిగిలిన పార్టీలవి రాష్ట్ర ఆర్థిక సంక్షోభం సృష్టించేవి అన్నారు. అప్పు చేసి పప్పుకూడు తినడం కాదన్నారు. ఉచితం పేరుతో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బతుకును మార్చే మేనిఫెస్టో ఇవ్వడంలో మిగిలిన పార్టీలు విఫలం అయ్యాయన్నారు. కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో ఇచ్చిన గ్యారెంటీల వారంటీ పోయి ప్రజలు తిరగబడ్డారన్నారు. సంక్షేమం ప్రజలకు అందేలా ప్రణాళిక వేశామన్నారు. ఇతర పార్టీలు ప్రజలు పూర్తిగా ప్రభుత్వం మీద ఆధారపడేలా తాయిలాలు ఇస్తున్నారన్నారు. ఉపాధి, ఉద్యోగ కల్పన బిజెపి విధానం అన్నారు. ప్రభుత్వ ఆస్తులమ్మి ఉచితాలు ఇచ్చి చేతులు దుల్పుకునే విధానం అన్నారు. ఇదంతా ఓట్ల కోసం ఇతర పార్టీలు చేస్తున్న పాట్లు అన్నారు. కాంగ్రెస్, టిఆర్ఎస్ ఉచితాలు పోటీ పడి వేలం పాట లాగా ప్రకటిస్తున్నారన్నారు. ప్రజలు టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులని తిప్పి కొడుతున్నారు. గ్రామాల నుంచి టిఆర్ఎస్ నాయకుల్ని తప్పిపంపిస్తున్నారు. 30 లక్షల కోట్ల ఎక్కడకి పోయాయన్నారు. ఎవరు, ఏ కుటుంబాలు బాగుపడ్డాయోన ప్రజలు గమనిస్తున్నారన్నారు. కెసిఆర్ తన అవినీతి కపిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నాన్నారు. ధరణి పుట్టక ముందు రైతులకు పట్టాలు లేనట్లు కెసిఆర్ విడ్డూరంగా మాట్లాడుతున్నారు. బిసిలు పార్టీలకు అతీతంగా ప్రజలు బిజెపికి మద్దతు ఇస్తున్నారన్నారు. బిజెపికి ప్రజలు బ్రహ్మ రథం పడుతున్నాన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, టిఆర్ఎస్ తప్పుడు సర్వేలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ప్రధాని మోడి, అమిత్ షా, యోగి లాంటి నాయకులు అందరూ ప్రచారం ముగిశాక, బిజెపి సొంతంగా అధికారంలోకి రావడం ఖాయం అన్నారు. కెసిఆర్‌ను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసే కెటిఆర్ తన స్థాయిని తెలుసుకోవాలన్నారు. తెలంగాణాను అడ్డం పెట్టుకుని కెసిఆర్ రాజకీయాలు చేస్తున్నారన్నారు.

# సిటీకొత్వాల్ సందీప్ శాండిల్యకు అస్వస్థత

### అపోలో ఆసుపత్రిలో చికిత్స

### స్వల్ప అనారోగ్యమే..

### నేడు విధుల్లో చేరుతా: కమిషనర్

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్యా సోమవారం అస్వస్థతకు లోనయ్యారు. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో గల తన కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటల సమయంలో విధుల్లో చేరిన ఆయన మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఎలో బిపికి లోనయ్యారు. దీని కారణంగా కొంత ఇబ్బంది పడ్డ కమిషనర్ వెంటనే తన సిబ్బంది సహకారంతో వైద్య పరీక్షల కోసం జూబ్లీహిల్స్ అపోలో ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ సీనియర్ వై ద్యులు సందీప్ శాండిల్యాను పరీక్షించి వైద్య సేవలందించి ఎలో బిపి కారణంగా ఆయన కొంత ఇబ్బంది పడ్డారని, ఇది చిన్నపాటి అనారోగ్య సమస్యగా తేల్చారు. అనం తరం ఆయనకు ఆసుపత్రిలో రెగ్యులర్ చెకప్‌లు నిర్వహించి అంతా సవ్యంగా వుందని నిర్ధారించారు. కాగా సందీప్ శాండిల్యా అస్వస్థతలకు గురై, అపోలో ఆసుపత్రిలో చేరిన విషయం మీడియాలో రావడంతో సీనియర్ పోలీసు అధికారులు దీనిపై వాకబు చేశారు. ఇదే సమయంలో అపోలో ఆసుపత్రి వైద్యులను కమిషనర్ ఆరోగ్యం గురి ంచి అడిగి తెలుసుకున్నారు. కాగా తన అనారోగ్యంపై సందీప్ శాండిల్యా సాయంత్రం స్పందించారు. లో బిపి కారణంగా తాను స్వల్పంగా అనారోగ్యం పాలయ్యానని, అపోలో ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నాక అంతా సర్దుకుందని, ఇప్పుడు అంతా బాగుందని, తాను మంగళవారం యధావిధిగా విధుల్లో చేరతానని ఆయన తెలిపారు.

# పోస్టల్ బ్యాలట్ వినియోగించుకున్న సురవరం సుధాకర్‌రెడ్డి

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా వయో వృద్దులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించిన విషయం తెలిసిందే. అందులో సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్‌లో భాగంగా సోమవారం ఎన్నికల సిబ్బంది తన ఇంటికి రాగా.. సురవరం సుధాకర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగం చుకున్నారు. వయో వృద్దులుగా ఉన్న వారు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వచ్చి వినియోగించుకోవడానికి ఇబ్బంది పడతారనే ఉద్దేశంతో వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో సురవరం తన పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు.

# బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఆవర్తనం

### తెలంగాణలో తేలికపాటి వర్షాలకు అవకాశం

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** తమిళనాడు తీరానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సగటు సముద్ర మట్టం నుండి 3.1 కిలోమీటర్ల ఎత్తున ఈ ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. తూర్పు గాలులలో సగటు సమద్ర మట్టం వద్ద నుండి ఏర్పడిన ద్రోణి శ్రీలంక నుండి నైరుతి అనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకూ కేంద్రీకృతమై ఉంది. దీని ప్రభావంతో తెలంగాణలో రెండు రోజుల పాటు ఒకటి లేదా రెండు చోట్ల తేలిక పాటి నుండి వర్షాలు కురుస్తాయని పేర్కొంది. లేదా ఉరుములతో కూడిన జల్లులు అక్కడక్కడా పడే వీలుందని తెలియచేసింది.

# తొమ్మిదేళ్లలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

### 25న పెరేడ్ మైదానంలో ప్రజా ఆశీర్వాదసభ

### అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి తలసాని



పెరేడ్ మైదానంలో ప్రజా ఆశీర్వాదసభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి తలసాని

**హైదరాబాద్ (బేగంపేట) నవంబరు 20, ప్రభాతవార్త :** సికిందరాబాద్ పెరేడ్ మైదానంలో ఈ నెల 25న జరగనున్న ప్రజాఆశీర్వాద సభను జయప్రదం చేయాలని సనత్‌నగర్ నియోజకవర్గం బిఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం పెరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాట్లను మంత్రి తలసాని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ సభకు నగరంలోని అన్ని నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివస్తారని అన్నారు. తొమ్మిదిన్నర సంవత్సరాల్లో అనేక అభివృద్ధి. సంక్షేమ కార్యక్రమాలు చేసామన్నారు. ఈ ప్రభుత్వం చాలా బాగా పనిచేసిందని నమ్మే వారు కూడా ఈ సభకు భారీ సంఖ్యలో హాజరు అవుతారని ఆయన పేర్కొ న్నారు. నాలా, పార్కులు, వైకుంఠధామాలు, ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు ఇలా చాలా అద్భుతాలు చేసామన్నారు. 70 వేల డబుల్‌బెడ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేసామన్నారు. రాష్ట్రంలో ఎవరూ చేయని అభివృద్ధి తాముచేసి చూపించామన్నారు. 24 ప్రాంతాలను గుర్తించామని ఆయా ప్రాంతాల నుంచి వచ్చేవారికి పార్కింగ్ సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే గ్యారంటీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. 10సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణాకు ఏం చేసిందో బీజేపీ నేతలు చెప్పగలరా అని తలసాని ప్రశ్నించారు. పేదింటి ఆడపడుచు పెళ్లికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణా ప్రభుత్వం అన్నారు. హైదరాబాద్ నగరాన్ని తాము ఎంతో అభివృద్ధి చేసి దేశంలోనే ఆదర్శంగా నిలిచామన్నారు. హైదరాబాద్ నగరాన్ని దేశంలోని ప్రధాన నగరాలలో ఒకటిగా తీర్చిదిద్దామని చెప్పారు. జీఓ 58,59ల కింద నగరంలో వేలాదిమందికి ఇంటి స్థలాలను రెగ్యులరైజేషన్ చేసామని తెలిపారు. హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖరరావు బాధ్య తలు చేపడతారని స్పష్టం చేసారు. ఎన్నికల సమయం కాబట్టి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు ఢిల్లీ నుంచి గద్దల్లా వాలారని వారి మాటలు నమ్మవద్దన్నారు. మంత్రి వెంట ఎమ్మెల్సీలు ప్రభాకర్, బొగ్గారపు దయా నంద్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ గజ్జెల నాగేష్, కంటోన్మెంట్, నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థులు లాస్యనందిత, ఆనంద్‌గౌడ్, కంటోన్మెంట్ మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వరరెడ్డి, నాయకులు ఎంఎన్ శ్రీనివాస్, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# బిజెపి గెలుపు కోసం ప్రచారం చేస్తాం

### పార్టీకి ఎంఆర్‌పిఎస్ మద్దతు : మంద కృష్ణమాదిగ

**హైదరాబాద్ (సైఫాబాద్), నవంబరు 20, ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చిన నేపథ్యంలో బిజెపికి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పిఎస్) సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నదని, గెలుపు కోసం శాయశక్తులు కృషి చేస్తామని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తామని సమితి అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో మాదిగ బిడ్డల భవిష్యత్తు కోసం తెలంగాణలోని మాదిగ సమాజం బిజెపికి ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం సోమాజీగూడలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ మాదిగలకు అన్ని రంగాలలో అన్యా యం చేసిందని, దళితుడ్ని సిఎం చేస్తామని, మూడు ఎకరాల భూమిని పంపిణి చేస్తామని, మంత్రి పదవులు, ఇతర నామినేటేడ్ పదవులలో, చివరికి ఎమ్మెల్యే సీట్లు కేటాయింపులో కూడా తీరని అన్యాయం చేసిందని, కెసిఆర్ దళితులకు భూములు పంపిణి చేయకపోగా ఎస్సైన్డ్ భూములను గుంజుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కెసిఆర్ నిరాహారదీక్ష విరమణలో ఎంఆర్‌పిఎస్ కీలక పాత్రను పోషించిందన్నారు. వర్గీకరణకు కెసిఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసారే తప్పా ఏనాడు పార్లమెంట్‌లో ప్రస్తావించలేదని, కేవలం సర్వే సత్యనారాయణ మాత్రమే ప్రస్తావించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా వర్గీకరణ కోసం కమీషన్‌నే వేసిందే కాని పార్లమెంట్‌లో బిల్లు పెట్టలేదని, ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాష్ట్ర సిఎల్‌పి నేత మల్లు భట్టివిక్రమార్క మాల సామాజిక వర్గానికి చెందినవారని, వీరు వర్గీకరణకు న్యాయం చేయలేరని, టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వర్గీకరణ విషయంపై గాంధీభవన్‌లో రెండు నిమషాలు కూడా మాట్లాకుండా అవమానించారని ఆరోపించారు. ఏలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయరాదని, మాదిగ జాతికి అన్యాయం చేసిందన్నారు.

వర్గీకరణ విషయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మొదటి నుంచి సానుకూలంగా వ్యవహరిస్తున్నారని, ప్రధాన మంత్రిని తమ సభకు తీసుకురావడంలో ఎంతో కృషి చేశారని చెప్పారు. బిసిలను ముఖ్యమంత్రిగా చేస్తామని బిజెపి ప్రకటించిందని, ఈ నేపథ్యంలో బిసిలంతా గౌరవించాలని, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య బిజెపికి మద్దతు ఇచ్చి ప్రచారం చేయాలని కృష్ణమాదిగ విజ్ఞప్తి చేశారు.

### ఢిల్లీ లిక్కర్ స్కాం..

# అభిషేక్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో నిందితుడుగా వున్న బోయినపల్లి అభిషేక్ దాఖలు చేసిన బెయి ల్ పిటిషన్‌పై సుప్రీం కోర్టు ధర్మాసనం విచారణను డిసెంబర్ నాలుగవ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ సంజయ్‌కన్నా, జస్టిస్ భట్టీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం దీనిపై సోమవారం విచారణ చేబట్టి సెక్షన్ 19పై లోతుగా విచారిస్తామని పేర్కొంది. ఈలోపు ఇరుపక్షాలు తమ ప్లీడింగ్స్ పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. తనను లిక్కర్ స్కాంలో ఇడి అకారణంగా అరెస్టు చేసిందని, తనకు వెంటనే బెయిల్ మంజూరు చేయాలని అభిషేక్ సుప్రీంకోర్టును కోరడం తెలిసిందే. మరోవైపు లిక్కర్ స్కాంలో ఇండో స్పిరిట్ నుంచి అభిషేక్‌కు రూ. 3.85 కోట్ల ముడుపులందాయని, పూర్తి సాక్ష్యాధారాలు తమవద్ద వున్నాయని, ఇడి తరపు న్యాయవాది సుప్రీం కోర్టుకు వెల్లడించారు.

# పెండింగ్ డిఎలు ఇప్పుడు ఎలా ఇస్తారు?

### తెలంగాణ ప్రభుత్వానికి షాక్ ఇచ్చిన ఇసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు 20:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉంది. దీంతో రాష్ట్రంలో అమలు కావాల్సి న సంక్షేమ పథకాలు అమలు నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. అయితే...లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

కానీ... దానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అనుమతించలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతుబంధు, ప్రభుత్వ ఉద్యోగుల డిఎల విడుదల, రైతు రుణ మాఫీల కోసం నిధులు విడుదల చేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం అధికారులకు వినతిపత్రం అందించారు. కానీ.... దీనికి ఇసి అనుమతిని నిరాకరించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులను ఎన్నికల కమిషన్ తిరస్కరించింది.

పెండింగ్ డిఏలు ఇప్పుడు ఎలా ఇస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసీ ప్రశ్నించింది. అయితే... తెలం గాణలో అసెంబ్లీ ఎన్నికలకు ఈనెల 30 పోలింగ్ జరగనుంది. అలాగే డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు కార్యక్రమం నిర్వహిం చనున్నారు. ఈ సమయంలో ఎలాంటి పథకాలు అమలు గానీ, డబ్బులు జమ చేసే కార్యక్రమాలు గానీ చేయకూడదు. ఈ క్రమంలోనే ఎన్నికల సంఘం ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది.

# ధర్మాన్ని గెలిపించండి.. రామరాజ్యంలో సంతోషంగా జీవించండి

### దేశం కోసమే బిజెపి.. అండగా ఉండాల్సింది మీరే: బండి సంజయ్



సోమవారం ఆదిలాబాద్ నియోజకవర్గంలో రోడ్‌షోలో మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

**ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త:** బీసీని ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చిన ఏకైక పార్టీ బిజెపి పార్టీ అని బీసీలంతా బిజేపికి ఓటు వేసి గెలిపించాలని బండి సంజయ్ అన్నారు. ఆదిలాబాద్ నియోజవర్గంలో బిపిపి ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ ఎన్నికల ప్రచారానికి సోమవారం రోజు బిజేపి రాష్ట్ర నాయకులు బండి సంజయ్ రోడ్ షోకు హాజరై నియోజకవర్గ బిజేపి నేతల్లో కార్యకర్తల్లో కొత్త జోషిని నింపారు. జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ టిఆర్ఎస్ కాంగ్రెస్ ప్రభుత్వాలను ప్రజలు నమ్మొద్దని టిఆర్ఎస్ పార్టీ వస్తే కేవలం కుటుంబం మాత్రమే బాగుపడుతుందని, ప్రజలు ఎప్పటికి కటిక పేదరికం అను భవించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఓ టీవి ప్రకటనలో కేసీఆర్ టిఆర్ఎస్ పార్టీ గెలిచాక ముఖ్యమంత్రి ఎవరంటే కేటీఆర్ అని చెప్పగానే పార్టీలో అలజడులు రేపాయని, అదే కుటుం బానికి చెందిన హారీశ్‌రావు, కవిత, సంతోష్‌లు గుబులు, చెందుతున్నరని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి నేనంటే నేను అని అనుకోవడమే తప్ప వాళ్లు కనీసం 10 ఎమ్మెల్యేలైన గెలుస్తారో లేదో, 6 గ్యారెంటీలతో ప్రజల్లోకి వెళ్తున్నామ న్నారు. ఆ గ్యారెంటీలను పక్కన పెడితే ఎమ్మెల్యేగా గెలిచాక కాంగ్రెస్ పార్టీఓనే ఉంటారో లేదో గ్యారెంటీ ఇవ్వలేని పరిస్థితిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు ఉన్నారని అన్నారు. బీసీలను ఏకతాటికి తేవడమే మోడీ లక్ష్యం అని తెలంగాణ రాష్ట్రానికి బీజేపి ప్రభుత్వం వస్తే బిసిని ముఖ్యమంత్రి చేస్తానని దేశ ప్రధానమంత్రి హామీ ఇచ్చారని బీసీలంతా బీజేపికి ఓటు వేసి పాయలన శంకర్‌ను గెలిపించాలని కోరారు. మున్నూరు కాపు సంఘానికి బిజేపి గెలిస్తే మూడు ఎకరాల స్థలాన్ని బిజేపి ప్రభుత్వం కేటాయింస్తుందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా పోటీ చేయటం ఓడించడం, ఓడిపోయామని బాధ ఉన్నప్పటికి నిరుపేద ప్రజలు కష్టపడుతున్నారని ఆరోగ్యంలో విద్యలో ఇతర సమస్యలతో బాధపడుతున్న వారిని పాయల్ శంకర్ ఓదారుస్తూ స్వయంగా ఆయన ఓ అంబులెన్స్‌ని ఏర్పాటు చేశారు. నీళ్ల ట్యాంకర్ పట్టణంలో చాలా కాలనీలకు పంపించి ప్రజల దాహార్తిని తార్చడం వారి సమస్యల కోసం పోరాడుతున్నారని ఇలాంటి వ్యక్తిని ఆదిలాబాద్ ప్రజలు వదులుకోవద్దని అన్నారు. మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పటించుకోవడం లేదని స్వయంగా మోడీ మాదిగల అందరికి న్యాయం చేసే విధంగా త్వరలోనే మన ప్రభుత్వం వస్తే ఎస్సీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చారని దానితో మాదిగలతో బిజేపి వైపు వచ్చారని మిగతా ప్రజలందరూ కూడా ఏకతాటిపైకి వచ్చి బిజేపికి ఓటు వేసి గెలిపిస్తే ఆదిలాబాద్‌ను సుందరమైన జిల్లాగా మార్చి అభివృద్ధిలో రాష్ట్రంలోనే ముందు ఉంచడానికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఇప్పుడు మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్న ముస్లిం వ్యక్తి మరోసారి రామన్నను గెలిపిస్తే ఆయనకే మున్సిపల్ చైర్మన్ కట్టబెట్టి ఎంఐఎం పార్టీ అభ్యర్థిని వైస్ చైర్మన్ చేస్తారని ఎద్దేవా చేశారు. దేశం కోసం, ధర్మం కోసం హిందువుల న్యాయం కోసం పోరాడుతున్న పార్టీని వదులుకోవద్దని ఈ పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసిని రెడ్డి, అధికార ప్రతినిధి లోక ప్రవీణ్ రెడ్డి, అల్లూరి జ్యోతి రెడ్డి, నాయకులు రఘుపతి పాయల్ శరత్ రాష్ట్ర పాలన కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌పై బెట్టింగ్

### టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన రెండు ముఠాలు




టాస్క్‌ఫోర్స్‌కు చిక్కిన బెట్టింగ్ ముఠా సభ్యులు

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** అహ్మదాబాద్‌లో ఆదివారం రాత్రి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్ ఫైనల్ మ్యాచ్‌పై పందెం కాసిన రెండు ముఠాలను నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఒక ముఠా వద్ద నుంచి 40 వేల రూపాయల నగదు జప్తు చేయగా, బ్యాంకులోని మూడు లక్షల 42,318 నగదును ఫ్రీజ్ చేసి, ఆరు లక్షల 89 వేల 75 రూపాయల విలువ చేసే పాయింట్లను, ఇంకో ముఠా నుంచి 79 వేల రూపాయల నగదును జప్తు చేశారు. మొదటి ముఠాలో బోయిన్‌పల్లికి చెందిన మహేష్ రమేష్ మనియాల్ (53)తో పాటు తేజేష్ ఠాకూర్ (45) వున్నారు.

వీరిద్దరు కొంత కాలంగా క్రికెట్ బె ట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం నాడు భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌ను బెట్టింగ్ కాశారు. వీరికి ఢిల్లీకి చెందిన రాకీ అనే ప్రధాన బుకీ లీడర్‌గా వున్నాడు. హైదరాబాద్‌లో వీరికి లోకల్ ఫంటర్లతో పాటు నమ్మకమైన కస్టమర్లు వున్నారు. కాగా వీరి గురించి సమాచారం అందుకున్న ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేసి ఇద్దరిని బోయిన్‌పల్లిలో పట్టుకున్నారు. పట్టుబడ్డ సమయంలో వీరి వద్ద 40 వేల రూపాయల నగదు లభించగా బ్యాంకులో వున్న మూడు లక్షల 42,318 నగదును ఫ్రీజ్ చేసి, ఆరు లక్షల 89 వేల 75 రూపాయల విలువ చేసే పాయింట్లను, మూడు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. మొత్తం సొత్తు విలువ 10.71 లక్షల రూపాయలుగా తేలింది. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం బోయిన్‌పల్లి పోలీసులకు అప్పగించారు. కాగా దక్షిణ మండల పరిధిలో మరో క్రికెట్ బెట్టింగ్ ముఠా పట్టుబడింది. చంపాపేట్‌కు చెందిన యశ్వంత్ (34), ప్రవీణ్ కుమార్ (38)లు ఒక ముఠాగా ఏర్పడి కొంతకాలంగా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు.

ఆదివారం రాత్రి అహ్మదాబాద్‌లో ఆదివారం రాత్రి భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన వరల్డ్ కప్ మ్యాచ్ ఫైనల్ మ్యాచ్‌పై పందెం కాస్తుండగా సమాచారం అందుకున్న దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు.

ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 79 వేల రూపాయల నగదుతో పాటు రెండు సెల్‌ఫోన్లను జప్తు చేశారు. పట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం ఐఎస్ సదన్ పోలీసులకు అప్పగించారు.

# ప్రధాని మోడీ దళిత వర్గీకరణపై ఆర్డినెన్స్ తేవాలి

### కర్ణాటకపై కెసిఆర్ దుష్ప్రచారం తగదు: కర్ణాటక మంత్రి మునియప్ప



సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కర్ణాటక మంత్రి మునియప్ప

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రధానమంత్రి మోడీకి దళిత వర్గానికి ప్రయోజనం చేయాలని ఉంటే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ ఆర్డినెన్స్ తీసుకొని రావాలని కర్ణాటక మంత్రి మునియప్ప డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆర్డి నెన్స్‌ను పార్లమెంటులో బిల్లు పెడితే కాంగ్రెస్ మద్దతు తెలుపు తుందని మునియప్ప హామి ఇచ్చారు. కేవలం ఎన్నికల కోసమే ఎస్సీలను వంచించడానికి మాత్రమే కమిటీల పేరుతో కాలయాపన చేయాలని మోడి చూస్తున్నారని మాదిగ ఉపకులాల ప్రజలు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కెసిఆర్ కర్నాటకలో ఐదుగ్యారెంటీలను అమలు చేయడంలేదని దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన నిందించారు. కెసిఆర్ అన్ని అబద్ధాలు తెలంగాణ ప్రజలకు చెబుతున్నారని దేశంలో గృహలక్ష్మీ పథకం మొదటిసారి మేం కర్నాటకలో అమలు చేస్తున్నాం., కెసిఆర్ పది సంవత్సరాలు అధికారంలో వుండి ఏం చేయలేదు. కాంగ్రెస్ పార్టీ చేసేది చెప్పుతుంది, చెప్పింది అమలు చేస్తుంది. కర్నాటకలో వందరోజుల్లో గ్యారెంటీలు అమలు చేశాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పుడు అబివృద్ధి ఎట్లా జరిగిందో మీకు తెలుసుకదా మీరు కాంగ్రెస్‌ను ఆదరించాలి. కెసిఆర్ పాలన అంతా అవినీతి మయం. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ కుంగుబాటు ప్రబల నిదర్శనం అని ఆయన అన్నారు.

#### డబుల్ ఇంజిన్ సర్కార్‌ను కర్ణాటకలో ఓడించారు: బికె హరిప్రసాద్

డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో వచ్చిన బిజెపిని కర్ణాటక ప్రజలు తిరస్కరించి ఓడించారని కర్నాటక ఎమ్మెల్సీ బికె హరిప్రసాద్ అన్నారు. తెలంగాణలో ట్రిబుల్‌ఇంజన్‌తో బిజెపి, బిఆర్ఎస్, ఎంఐఎం కలిసి పనిచేస్తున్నాయని ఆయన భాష్యం చెప్పారు. బిసిల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎన్నుకోవాలని తెలంగాణలో ప్రజాప్రభుత్వం ఏర్పడాలని ఆయన పిలుపు నిచ్చారు. కర్నాటక రైతుకు 10గంటల పాటు కరెంటు ఇస్తున్నాం. కుమారస్వామితో బిజెపి, బిఆర్ఎస్ అబద్దాలు మాట్లాడించారు. బిజెపి పాలిత రాష్ట్రాలలో మహిళలు ఎక్కువగా మిస్సింగ్ అవుతున్నారు అక్కడ వారికి రక్షణలేదు. కెసిఆర్ తన కూతురు జైలుకు వెళ్ళకుండా వుండటానికి బిజెపితో చెలిమిచేశారు. బిసిలకు రిజర్వేషన్ కులగణనచేసి పెంచుతాం. రాహుల్‌గాంధీ కులగణన చేయడానికి కట్టుబడది వున్నారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఢిల్లీ లిక్కర్ పాలసితో సంపాదించిన డబ్బులతో ఎన్నికలలోకి వెళ్లింది అని బికె ప్రసాద్ ఆరోపించారు. మీడియా సమావేశంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్, అజయ్ రమణి తదితరులు పాల్గొన్నారు.




# గజ్వేల్ గమ్మత్తు రాజకీయం!

"రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి కేవలం 60కిలో మీటర్ల లోపే కూతవేట దూరంలో గజ్వేల్ నియోజకవర్గం ప్రస్తుత తెలంగాణ రాష్ట్రంలోనే ఒక ప్రతిష్టాత్మక నియోజక వర్గంగా నిలిచింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నప్పుడు గజ్వేల్ అంటే ఎవరికి తెలిసేది కాదు. చాలామంది మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలో ఉన్న గద్వాల్‌గా పొరబడేవారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు గజ్వేల్ నియోజకవర్గం నుంచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ముఖ్యమంత్రిగా మరోసారి ఇక్కడి నుంచే పోటీచేసి గెలవడంతో ఈ నియోజకవర్గానికి రాష్ట్రంలో అత్యంత ప్రాధాన్యమైన నియోజకవర్గంగా మారింది. ఇక్కడి నుండే మరోసారి గెలిచి ఎమ్మెల్యేగా ముఖ్యమంత్రిగా హ్యాట్రిక్ కొట్టడానికి సిద్ధంగా ఉన్న గజ్వేల్ నియోజకవర్గం ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన రాజకీయ పరిణామాలు పూర్వాపరాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు హైదరాబాద్‌లో తమ ఊరు పేరు గజ్వేల్ అని చెప్పుకుంటే ఓహో కేసీఆర్ నియోజకవర్గం కదా అని వెంటనే అందరూ గుర్తుచేస్తున్నారు. ఇలా ప్రస్తుత ముఖ్యమంత్రి రెండు సార్లు ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ పట్టణ చరిత్ర నియోజకవర్గం రాజకీయాల చరిత్ర కథకమామీషు తెలుసుకుందాం.

### గజ్వేల్ గ్రామ నామ చరిత్ర


గజ్వేల్‌గా మారిన గజపెల్లి గ్రామపట్టణ చరిత్రతోపాటు రాజకీయ చరిత్రను కూడా ఒకసారి పరిశీలిస్తే అనేక ఆసక్తికరమైన చారిత్రక సంఘటనలు గుర్తుకొస్తాయి. మొదటగా గజ్వేల్ గ్రామ నామం ఎలా ఏర్పడింది అనే చరిత్ర తీసుకుంటే ఆనాటి కులి కుతుబ్షా వంశస్తుడైన తానీషా రాజుగా ఆయన మంత్రివర్గంలో మల్కాభిరాముడు అనే మంత్రి ఉండేవాడు. ప్రస్తుత గజ్వేల్ పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఆయన కాలంలోనే ఒక దిగుడుమెట్ల బావి తవ్వించారట. అందుకే ఆ బావి పేరు మల్కిభరామ్ తవ్వించిన బావి కనక 'మల్కాబాయి' అని పేరు వచ్చింది. కెసిఆర్ గారు ముఖ్యమంత్రి అయితే తర్వాత ఆ ప్రాంతంలో ఉన్న అటవీప్రాంతాన్ని 'కల్పకవనంగా' మార్చి అందులోని 'నక్షత్రవనం' పేరు మీద చెట్లను పెంచి ఆ మల్కా బావికి కూడా మరమ్మత్తులు చేయించి దాన్ని సందర్శకులకు అందుబాటులో ఉంచారు. ఆ బావిలోని నీటిని పొలాల సాగుకోసం బయటకు తోడిపోయడానికి ఏనుగులతో మోట కొట్టారట. ఏనుగు అంటే 'గజము' కనుక గజములతో నీళ్లను పైకి తెప్పించారు కనుక గజాల వెల్లవ కాస్త "గజ వెల్లవ'గా తరువాత గజవెల్లిగా మారి కార్యక్రమంలో గజ్వేల్‌గా రూపు సంతరించుకుంది. ప్రస్తుతం గజ్వేల్ మున్సిపాలిటీగా సుమారు 60వేల జనాభాతో విరాజిల్లుతుంది. స్థూలంగా ఇది గజ్వేల్ గ్రామ నామచరిత్ర.

'1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలలో అప్పుడు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర వారసత్వంగా వచ్చిన నిషేధిత కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా సిపిఐ ప్రొగ్రెసివ్ డెమోక్రసీ ఫ్రంట్ పిడిఎఫ్ అనే పేరుతో పోటీచేసింది. అనాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వీరోచిత పోరాటం చేసిన అనేకమంది కమ్యూనిస్టు పార్టీలో నాయకులుగా ఎదిగారు. ఒక వంక కాంగ్రెస్ మరోపక్క ఆర్యసమాజ్ ఇట్లాంటి పార్టీలు సామాజిక సంస్థలు నిజాం నిరంకుశపాలన వ్యతిరేకంగా పోరాడాయి. కానీ చాలా గ్రామాలలో రజాకార్లకు మద్దతు ఇచ్చి నిజాం ప్రభుత్వానికి తాబేదారులుగా ఉండి గులాములుగా వ్యవహరించి సామాన్యప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసిన చాలా మంది భూస్వాములు, జాగిర్దాలు, దేశ్మక్‌లు, దొరలు, పటెండ్లు స్వాతంత్రానంతరం కాంగ్రెస్ టోపీ మాటన మళ్లీ గ్రామాలలోకి వచ్చారు. అలా ఆనాటి ఎన్నికల్లో నిజాంపై వేరువేరు సిద్ధంతాలతో, ఆశయాలతో ఉమ్మడిగా పోరాడిన కాంగ్రెస్, పిడిఎఫ్ ప్రధాన రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్నారు.

ఆనాడు జరిగిన మొట్టమొటి ఎన్నికల్లో గజ్వేల్ స్థానం అప్పటి నుంచి హైదరాబాద్ మొదటి మున్సిల్ ఛైర్‌పర్సన్‌గా చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాడపాటి హనుమంతరావు గారు కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తే ఆయనకు వ్యతిరేకంగా గజ్వేల్ పట్టణానికి తూర్పున ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి నుంచి వచ్చిన పెండెం వాసుదేవు పిడిఎఫ్ తరఫున

**బండారు రామ్మోహనరావు**

పోటీ చేసి హనుమంతరావు గారి మీద గెలిచారు. అప్పుడు పిడిఎఫ్ ఎన్నికల గుర్తు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి ఉన్న చేయి గుర్తు కేటాయించబడింది. కాంగ్రెస్ పార్టీకి కాడెద్ల గుర్తు ఉండేది. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఆనాడు ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుండి ఎక్కువ మంది పిడిఎఫ్ అభ్యర్థులే కాంగ్రెస్ అభ్యర్థుల మీద గెలిచారు. గజ్వేల్ నియోజకవర్గంలో మరొక ప్రత్యేకత ఏమిటంటే అప్పటి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మాడపాటి హనుమంతరావు గారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే




ముఖ్యమంత్రి అభ్యర్థిత్వానికి పోటీ పడుతున్నారు. కనుక ఆయనను గజ్వేల్ ఎమ్మెల్యేగానే ఓడించి ఆయన రాజకీయ భవితవ్యాన్ని మొగ్గలోనే తుంచి వేస్తే తనకు అడ్డంకని ఆనాటి మరొక ముఖ్యమంత్రి అభ్యర్థి బూర్గుల రామకృష్ణారావు వర్గము ఇతర రెడ్డి సామాజిక వర్గము హనుమంతరావుగారిని వెన్నుపోటు పొడిచి ఓడించారని ఒక ఆరోపణ ఉంది. అది ఎంత వరకు వాస్తవమో తెలియదు. కానీ చివరికి మాడపాటి హనుమంతరావు ఓడిపోయారు. పెండెం వాసుదేవ్‌గారు

పిడిఎఫ్ తరఫున గెలిచారు. ఇది పైకి కనిపించే వాస్తవం. అలాగే 1962లో అప్పటి రాజకీయ దిగ్గజం కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన జి.వెంకటస్వామిని కూడా గజ్వేల్ ప్రజలు ఓడించారు. అప్పటికి ఎవరికీ తెలియని అనామకుడైన ఇండిపెండెంట్ అభ్యర్థి జి.సైదయ్యను గెలిపించారు. జిల్లాల తెలంగాణ ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా నామ కరణ చేసి మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రంగా

### సైదయ్యకి సరిలేరెవ్వరు

'వరుసగా నాలుగు సార్లు గెలిచిన సైదయ్య ఇప్పటి వరకు ఆయనదే రికార్డు. ఇక 1962 ఎన్నికలకు వచ్చేసరికి గజ్వేల్‌కు అప్పటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ లీడర్ జి. వెంకటస్వామిగారు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఫారం తీసుకొని పోటీ చేయడానికి వచ్చారు. కానీ ఆయన స్థానిక దొరలను, పటేళ్లను నిందించడం ద్వారా వారికి ఆదిలోనే 'హంసపాదు' అన్నట్లు చుక్క ఎదురయింది. దాంతో ఇక్కడి స్థానిక భూస్వాములు దొరలు గజ్వేల్ పట్టణానికి సమీప గ్రామం కొడకండ్లలో పుట్టిన స్థానికుడైన గజ్వేల్ సైదయ్యను కాంగ్రెస్ పార్టీ దాంతో ఇక్కడి స్థానిక భూస్వాములు దొరలు గజ్వేల్ పట్టణానికి సమీప గ్రామం కొడకండ్లలో పుట్టిన స్థానికుడైన గజ్వేల్ సైదయ్యను కాంగ్రెస్ పార్టీ అధికారిక అభ్యర్థి అయిన జి.వెంకటస్వామికి వ్యతిరేకంగా ఇండిపెండెంట్ అభ్యర్థిగా నిలబెట్టారు. అలా మొదటిసారి ఇండిపెండెంట్ అభ్యర్థి సైదయ్యాగారు.

రెండు చోట్ల పోటీ చేస్తే, చరిత్రలో ఏం జరిగింది?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రెండు చోట్ల పోటీ చేసిన వ్యక్తుల ఫలితాల గురించి గజ్వేల్ ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. గజ్వేల్ నియోజకవర్గం మహామహులను ఓడించింది. సామాన్యులను గెలిపించింది. అలాగే దేశవ్యాప్తంగా రాష్ట్రంలో కూడా ఇందిరాగాంధీ రామారావు, ప్రస్తుతం రాహుల్ గాంధీ మొన్నటికి మొన్న ప్రజారాజ్యం చిరంజీవి కూడా రెండు చోట్ల పోటీ చేస్తే రెండు చోట్ల ప్రజలు ఓడించారు. అక్కడ గెలుస్తారని ఇక్కడ, ఇక్కడ గెలుస్తారని అక్కడ రెండు చోట్ల ఓడించారు. ఉప ఎన్నికలు రాకూడదని ఒక ఆలోచనతో అలాంటి తీర్పును యకూడా ప్రజలు ఇస్తారు. ఇలాంటి ఉదాహరణలుకూడా మనకు చాలా కనిపిస్తారు. అలా చూపినప్పుడు ఈ ఉదాహరణ ఈటెల రాజేందర్‌కి కూడా వర్తిస్తుంది. ఎందుకంటే ఆయన తన సొంత నియోజకవర్గం హుజురాబాద్‌తో పాటు గజ్వేల్‌లో కూడా పోటీ చేస్తున్నారు. మరి రెండు చోట్ల గెలిస్తే ఏ నియోజకవర్గం ఉంచుకుంటారు. మరి ఏది విడిచిపెడతారు అన్నది కూడా ఒక ప్రశ్న. ఇది అంతా కాదు గజ్వేల్‌లో మేము ప్రస్తుత ముఖ్యమంత్రి మూడవసారి హ్యాట్రిక్ కొట్టడానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థిని ఎలా వదులుకుంటామని గజ్వేల్ ప్రజలు ఆలోచిస్తే గజ్వేల్‌లో ఈటల రాజేందర్‌ని ఓడిస్తారు. హుజురాబాద్‌లో గెలిపిసానతరు. ఈ ఉదాహరణ కామారెడ్డికి కూడా వర్తిస్తుంది. కామారెడ్డిలో మరో రాజకీయ దిగ్గజం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి కెసిఆర్‌పై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన కూడా తన సొంత నియోజకవర్గం కొడంగల్‌తో పాటు కామారెడ్డిలో కెసిఆర్‌పై పోటీ పడుతున్నారు. కెసిఆర్, ఈటెల రాజేందర్, రేవంత్ రెడ్డి ఈ ముగ్గురు కూడా రెండు చోట్ల పోటీ చేస్తుండడం వల్ల ప్రజలు వారిని ఎక్కవ గెలిపిస్తారు, ఎక్కడ ఓడిస్తారు అనే ప్రశ్న కూడా వస్తుంది.

# చొప్పదండిలో త్రిముఖ పోటీ

**కరీంనగర్ ప్రతినిధి - ప్రభాతవార్త**

కరీంనగర్ జిల్లాలో చొప్పదండి నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. పూర్తిగా గ్రామీణ ప్రాంతం. ప్రశాంతతకు పెట్టింది పేరు. అయితే అందుకు భిన్నంగా ఓటర్లలో చైతన్యం. ఎస్సీ సామాజిక వర్గంకు రిజర్వ్ చేయబడిన ఈ నియోజకవర్గం లో గతంలో ఇక్కడి నుండి పోటీ చేసి మంత్రులు అయిన చరిత్ర కూడా నియోజకవర్గానికి ఉంది. చొప్పదండి నియోజకవర్గం లో ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. నాయకుల అంచనాలకు ధీటుగా విభిన్న తీర్పునిచ్చే ఓటర్ల కలిగిన నియోజకవర్గం చొప్పదండి.




ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడిన మొదట్లో ఎన్‌టీఆర్‌కు అండగా తెలుగు దేశం పార్టీకి కంచుకోటగా నిలబడింది. సుమారు మూడు దశాబ్దాల పాటు తెలుగుదేశం పార్టీ అభ్యర్థులనే ఆదరించింది. అయినప్పటికి ప్రతిసారి ఎన్నికల సమయానికి ఉత్కంఠ పోరు కొనసాగుతూ వస్తుంది. కరీంనగర్ జిల్లాలో ఆసక్తికరమైన పోటీ గల నియోజకవర్గాల్లో చొప్పదండి ఒకటి. ప్రస్తుతం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఈ నియోజక వర్గం నుండి ప్రాతి నిధ్యం వహిస్తున్నాడు. 2018 ఎన్నికల్లో అప్పటి సిట్టింగ్ ఎమ్మెల్యే బోడిగే శోభను పక్కన పెట్టి రవిశంకర్‌కు బీఆర్ఎస్ టిక్కెట్ ఇచ్చింది. దీంతో రవిశంకర్ గెలుపొందారు. 2018 ఎన్నికల్లో అయితే బోడిగే శోభ బిజేపీ నుండి పోటీ చేయగా మేడిపల్లి సత్యం కాంగ్రెస్ నుండి పోటీ చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా వీరి ముగ్గురి మధ్యనే పోరు ఉండేటట్లు కనిపిస్తుంది. జిల్లాల పునర్విభజనకు పూర్వం ఉన్న మండలాలు తొలగిపోయి, చొప్పదండి, రామడుగు, గంగాధర మండలాలతో పాటు కొడిమ్యాల,మల్యాల, బోయినపల్లి మండలాలతో కరీంనగర్, సిరిసిల్లా, జగిత్యాల మూడు జిల్లాల పరిదిలోకి చొప్పదండి నియోజకవర్గం విస్తరించింది. నియోజకవర్గంలో 2,29,346 ఓటర్లు ఉండగా అందులో పురుషులు 1,11,197 కాగా, మహిళలు 1,18,141 ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో మహిళల ఓటర్లే ఎక్కువ. గెలుపు ఓటములు నిర్ణయించేది కూడా వారే. అయితే ఇక్కడ షెడ్యూల్డ్ కులాలకు సంబంధించిన ఓట్లు 46వేల పై చిలుకు పైనే ఉన్నాయి. ప్రస్తుత శాసనసభ్యుడి సామాజిక వర్గానికి చెందిన ఓట్లు 38 పై చిలుకు పైగా ఉండడం ఆయనకు కలిసి వచ్చే అంశం.



పద్మశాలీలు 25వేలు, ముదిరాజ్‌లు 20వేలు, గొల్ల కురుమలు 20 వేల మంది ఉన్నారు. వీరే కాకుండా గీత కార్మికులు కూడా గెలుపు ఓటములను ప్రభావితం చేస్తారు. 1957లో చొప్పదండి నియోజకవర్గం ఏర్పడింది. 1967 నుండి 1972 వరకు ఈ నియోజకవర్గాన్ని కరీంనగర్ నియోజకవర్గంలో విలీనం చేశారు. 1978లో తిరిగి ప్రత్యేక నియోజకవర్గంగా చొప్పదండిని ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహిం చారు. 1978 నుండి 2004 వరకు చొప్పదండి జనరల్ నియోజకవర్గంగా ఉండగా 2009లో ఎస్సీ రిజర్వేషన్‌గా మారింది. ఎస్సీ రిజర్వేషన్‌గా మారిన తరువాత 2009లో టీడీపీ అభ్యర్థి సుద్దాల దేవయ్య, బీఆర్ఎస్ అభ్యర్థులు 2014లో బోడిగే శోభ, 2018లో సుంకె రవిశంకర్ ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. అయితే తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిన నాటి నుండి చొప్పదండి నియోజకవర్గం టీడీపీకి కంచుకోటగా ఉండేది. 1999లో మినహా 1883 నుండి 2009 వరకు ఆరు సార్లు టీడీపీ అభ్యర్థులు, రెండు సార్లు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు, ఒక్క సారి ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించారు.

### గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న ముగ్గురు అభ్యర్థులు

1985,1989,1994లలో జరిగిన ఎన్నికల్లో స్థానికుడైన న్యాలకొండ కిషన్‌రావు వరుస విజయాలతో హ్యాట్రిక్ సాధించి రికార్డు సృష్టించారు. 2009లో ఎస్సీ రిజర్వ్ కాగా ఆ ఎన్నికల్లో సుద్దాల దేవయ్య గెలుపొందారు. మూడు సార్లు గెలిచిన రాంకిషన్‌రావు ఇక్కడి నుండి అటవీ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ ఎన్నికల్లో ఇక్కడి నుండి ఒక్కరు మాత్రమే స్థానికుడైన రవిశంకర్ పోటీ పడుతుండగా, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు స్థానికేతరులు. నవంబర్ 30న జరిగే చొప్పదండి నియోజకవర్గ అసెంబ్లీ ఎన్నికలపై మరింత ఉత్కంఠ నెలకొంది. మూడు ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉండే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియోజక వర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదనే భిన్న వాధనలు నియోజకవర్గంలో వినిపిస్తున్నాయి. ఇదే అంశం ఎన్నికల్లో ప్రస్తుత ఎమ్మెల్యేను బలహీన పరిచే అంశంగా ప్రజలు చర్చించు కుంటున్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి తనను గెలిపిస్తాయని ధీమాను వ్యక్తం చేస్తూ ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మేడి పల్లి సత్యం గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికి మళ్ళీ తిరిగి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పొందుపరిచిన ఆరు గ్యారెంటీ స్కీంలు అమలు చేస్తామని ప్రజలకు వివరిస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. బీజేపీ పార్టీ అభ్యర్థి బోడిగే శోభ 2014లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. ప్రస్తుతం తాను బీజేపీ అభ్యర్థిగా పోటీలో కొనసాగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను నియోజకవర్గంలోని ప్రజలందరికి అందిస్తానని హామీలు ఇస్తూ ఎన్నికల ప్రచారం కొనసాగిస్తున్నారు. ఎస్సీ, బీసీ ఓటర్లు అధికంగా ఉన్న ఈ నియోజక వర్గంలో ప్రతిసారి ప్రజలు భిన్నమైన తీర్పును ఇస్తుండడం విశేషం. రెండు సార్లు బీఆర్ఎస్ నుండి పోటీ చేసిన అభ్యర్థులను నియోజకవర్గ ప్రజలు గెలిపించారు. ఈ సారి బీఆర్ఎస్, కాంగ్రెస్,బీజేపీ అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ హోరా హోరీగా ఉండే పరిస్థితి కనిపిస్తుంది. ఈ సారి నియోజకవర్గ ప్రజలు ఎవరికి పట్టం కడతారో తెలుసుకోవాలంటే ఓటర్లు తీర్పు కోసం ఎన్నికల ఫలితాలు వెలు వడే వరకు వేచి చూడాల్సిందే.




# వనభోజనాల్లో రాజకీయ సందడి

**హైదరాబాద్ - ప్రభాతవార్త నెట్‌వర్క్**

కార్తీక మాసం ప్రారంభం కావడంతో సహజంగానే వనభోజనాల సందడి ప్రారంభం అవుతుంది. కులాల వారీగా కొందరు, స్నేహితుల, కుటుంబాలు, కార్యాలయాల సిబ్బంది ఇలా బృందాలుగా తయారై సమీపంలోని తోటలకు వెళ్లి భోజనాలు చేసి వస్తారు. దీనితో శివారు ప్రాంత్రాల్లోని తోటలు సందడిగా మారుతుంటాయి. ఆటపాటలు, సమావేశాలు వంటివి నిర్వహించుకుంటారు. వన భోజనాలకు వెళ్లే బృందాలు రవాణాతో పాటు అక్కడ భోజనాలకు అయ్యే ఖర్చులను అందరూ కలిసి పంచుకుంటారు. అయితే ఈసారి ఎన్నికలు సమీపించడంతో అభ్యర్థులు ముందుకు వచ్చి ఖర్చులు భరించడానికి ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కుల సంఘాలకు అభ్యర్థులు అండగా నిలుస్తున్నారు. దీనివల్ల ఆయా కులాలకు చెందిన ఓటర్లను ఆకర్శించే అవకాశం ఉందని భావిస్తున్నారు. పైగా ఎన్నికల సమయంలో ప్రతి ఖర్చుకు లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఏమాత్రం ఖర్చు ఎక్కువైనా ఎన్నికల అధికారుల నుంచి ఇబ్బందులు తప్పవు, ఈ సమయంలో వన భోజనాలకు అయ్యే ఖర్చు తమది కాదని అభ్యర్థులు పేర్కొనే అవకాశం ఉంది. ఈ కారణం కూడా అభ్యర్థులకు కలిసి రావడంతో వనభోజనాల ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తున్నారు. తమ నియోజకవర్గానికి సమీపంలోనే ఉన్న తోటల్లో ఈ కార్యక్రమాలు ఏర్పాటుచేయడం వల్ల భోజనాల సమయంలో అభ్యర్థి పది నిమిషాలు అక్కడికి వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తే సరిపోతుంది. కులసంఘాల పెద్దలు కూడా రాజకీయ నాయకులతో టచ్‌లో ఉండటంతో ఈ కార్యక్రమానికి ఆయా అభ్యర్థులు అంగీకరిస్తున్నారు. రాబోయే ఆదివారం నుంచి పెద్ద సంఖ్యలో వనభోజనాలు ఏర్పాటయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జిల్లాల్లోని పట్టణాల్లో, నగరాల్లో ఎక్కువ మంది వన భోజనాలు ఏర్పాటుచేసుకుంటున్నారు. భోజనాలకు అయ్యే ఖర్చు కూడా పెద్దగా ఉండకపోవడంతో అభ్యర్థులకు కూడా ఆర్థిక భారం అందు బాటులోనే ఉంటోంది. ఒక్కొక్క కులసంఘానికి సుమారు వంద మంది వరకు హాజరయ్యే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు తమకు తెలిసిన కేటరింగ్ సర్వీసులకు నాన్ వెజ్ వంటకాలు ఆర్డర్ ఇస్తే సరిపోతుంది. ఇటు కుల సంఘాల ప్రతినిధులు కూడా అభ్యర్థి నుంచి ఎక్కువ మొత్తం తీసుకున్నారేమో అన్న అనుమానాలు తలెత్తకుండా ఉంటాయి. అభ్యర్థి కూడా నేరుగా కేటరింగ్ సంస్థలకు డబ్బు చెల్లించడం వృధా ఖర్చు జరిగిందన్న భావన అతనికి కలగదు. అదేవిధంగా కాలనీల్లో కూడా సంక్షేమ సంఘాలు ఉన్నాయి. తమ నియోజకవర్గం పరిధిలో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్,




నల్గొండ వంటి నగరాల్లో పది నుంచి 20 వరకు సంఘాలు ఉంటాయి. ఒక్కొక్క సంఘంలో సభ్యులు వెయ్యి నుంచి రెండు వేల మంది వరకు ఉంటారు. వారిలో రెండు వందల మంది వనభోజనాలకు వచ్చినా లక్ష నుంచి రెండు లక్షల రూపాయల ఖర్చు ఉంటుంది. ఈ మాత్రం ఖర్చు భరించేందుకు అభ్యర్థులు సిద్దంగానే ఉన్నారు. దీనితో ఈసారి వనభోజనాల సందడి ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది.

# పోలింగ్ సమీపిస్తున్న వేళ

## అభ్యర్థుల్లో ఉత్కంఠ

**హైదరాబాద్ - ప్రభాతవార్త నెట్‌వర్క్**

ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ అభ్యర్థులు గుబులు ప్రారంభమైంది. మొన్నటి వరకు నాదే గెలుపని ధీమాగా ఉన్న అభ్యర్థులు ఇప్పుడు ఆందోళనకు గురౌతున్నారు. ఇలాంటి పరిస్థితి బిఆర్ఎస్, కాంగ్రెస్‌తో పాటు బిజెపీలో కూడా నెల కొంది. పలువురు మంత్రులు సైతం తమ గెలుపుపై ఉత్కంఠతో ఉన్నారు. అధికారంలో ఉండగా కొందరు ఎమ్మెల్యే, మంత్రులు కోట్ల రూపాయలు ఆర్జించారు. ఈ విషయం ఆయనను వెన్నంటి ఉండే అనుచరులతో పాటు స్థానిక ఓటర్లు కూడా గమనిస్తున్నారు. అయితే గెలుపు ధీమా ఉండటంతో చాలా మంది అభ్యర్థులు డబ్బు ఖర్చు చేయడం లేదు. ప్రముఖ నేతలు వచ్చినప్పుడు హడావిడిగా వారితో తిరగడం, పొద్దు గడిచిన తరువాత మెల్లిగా ఇంటికి చేరుకోవడం, ఉదయాన్నే కార్యకర్తలు, నేతలు రాకముందే ఇంటి నుంచి వెళ్లిపోవడం వంటి తప్పించుకుతిరిగే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఎక్కువగా ఇలాంటి పోకడ అధికార పార్టీ అభ్యర్థులలో కనిపిస్తోంది. సాధారణంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలపై కొంత వ్యతిరేకత ఉంటుంది. ముఖ్యంగా రెండు మూడు ఎన్నికల్లో విజయం సాధించి ఈసారి మళ్లీ రంగంలో ఉన్న సిట్టింగ్‌ల వ్యవహారశైలి పార్టీకి తలనొప్పిగా మారింది. వారం రోజులుగా అభ్యర్థి వెంట తిరుగుతున్న కార్యకర్తలు, నాయకులు తమ అభ్యర్థి గెలవడం అనుమానమే అని విచారం వ్యక్తం చేస్తున్నారు. కొందరు ముందు జాగ్రత్తతో ప్రత్యర్థి శిబిరంలోకి వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా నగర శివారు ప్రాంతానికి చెందిన ఒక మంత్రి వ్యవహారం ఇటు పార్టీకి, అటు కార్యకర్తలకు మింగుడు పడకుండా ఉంది. అధికారంలో ఉండగా మంత్రి హోదాలో వందల కోట్లు వెనుకేసుకున్నారు. దీనితో తాము మంత్రితో తిరిగితే నాలుగు డబ్బులు వస్తాయి. పార్టీ విజయం సాధిస్తుందని ఈ ప్రాంతానికి చెందిన అధికార పార్టీ కార్యకర్తలు ఆశపడ్డారు. అయితే అందుకు భిన్నంగా మంత్రి వ్యవహారశైలి ఉండటంతో వారు ఆశ్చర్యపోతున్నారు. ఉదయాన్నే తనను కలవడానికి వచ్చిన స్థానిక నేతలను, కొందరు కార్యకర్తలను చూడగానే విసుగుదల ప్రదర్శిస్తున్నారు. పొద్దుగాల ఈడ ఏం పని మీకు పొండి రెండు రోజుల తరువాత కలుద్దాం అని చెప్పి వారిని మాట్లాడనీయకుండా కారెక్కి వెళ్లిపోతున్నారు. మరో అభ్యర్థి దురుసుగా ప్రవర్తించే కొందరు గూండాల్లాంటి వ్యక్తులను వెంట వేసుకుని తిరగడం సమస్యగా మారింది. అనేక నియోజకవర్గాల్లో అధికార పార్టీ బిఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు మధ్య నువ్వా నేనా అన్నట్లుగా పోటీ ఉంది. తమ గెలుపు సునాయాసంగా ఉంటుందని భావించిన కొందరు అభ్యర్థులు ప్రస్తుతం ఆందోళనకు గురౌతున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులు అధికారపార్టీ ఎమ్మెల్యే తప్పులను, అభివృద్ధి చేయని పనులను ప్రధానంగా ఎత్తి చూపుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. తమను గెలిపిస్తే అందుబాటులో ఉండటమే కాకుండా వెనుకబడిన కాలనీలను మెరుగుపరుస్తామని హామీ ఇస్తున్నారు. నగర శివారు ప్రాంతాల్లో ముఖ్యంగా మంచినీటి సమస్య ఎక్కువగా ఉంది. మహిళలు నీళ్లట్యాంకు వచ్చినప్పుడు చేంతాడు క్యూలలో నిలబడి నీరు పట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఈ ప్రాంతాల్లో ఓటర్లు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు పదేపదే ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో ఈసారి వేరొకరికి ఓటు వేయాలన్న నిర్ణయంతో ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థులు ఇంటింటి ప్రచారానికి వెళితే స్థానికులు సమస్యలు ఏకరువు పెట్టి ఏనాడూ వాటి పరిష్కారం కోసం ప్రయత్నించలేదని నిలదీస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో గతంలో నాలుగైదు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థితో అధికార పార్టీ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఇలాంటి ప్రాంతాల్లో ప్రత్యర్థికి సానుభూతి ఓట్లు పడతాయని సర్వేల్లో స్పష్టం కావడంతో ఈ గండం నుంచి ఎలా తప్పించుకోవాలే అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరికొందరు తమ పార్టీకి ఉన్న గాలి తమను గట్టెక్కిస్తుందన్న ధీమాతోఉన్నారు. ఇలాంటి నియోజకవర్గాల్లో కార్యకర్తల నుంచే నిరసన వ్యక్తం అవుతోంది. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్యకర్తలు, స్థానిక నేతలు ఇప్పటికే అధిష్టానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగిసిన తరువాత ఒక్కసారిగా అభ్యర్థుల అంచనాలు తప్పడంతో ఆందోళనగా ఉన్నారు.




# 23 నుండి టి20 సిరీస్

## విశాఖపట్నంలో తొలి మ్యాచ్

## హైదరాబాద్ వేదికగా డిసెంబరు 3న చివరి మ్యాచ్

## భారత్‌తో మరోసారి తలపడనున్న ఆస్ట్రేలియా

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** భారత్, ఆస్ట్రేలియా మధ్య నాల్గవ టీ20 స్క్వాడ్ 2023 ఇంటర్నేషనల్ సిరీస్ జరగనున్నాయి. ఈ సిరీస్ కింద జరుగనున్న ఐదు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో తొలి మ్యాచ్ ఈ నెల 23వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ప్రారంభం కానుంది. తదుపరి చివరి మ్యాచ్ డిసెంబరు 3తో ముగియనుంది. ఈ నెల 23న విశాఖపట్నంలోని వైఎస్సార్ రాజశేఖర్‌రెడ్డి క్రికెట్ స్టేడియంలోను, 26వ తేదీన కేరళలోని తిరువనంతపురం గ్రీన్‌ఫీల్డ్ ఇంటర్నేషనల్ స్టేడియం, 28వ తేదీన అస్సాంలోని గౌహతి వేదికగా బర్సాపారా క్రికెట్ స్టేడియం, డిసెంబరు 1వ తేదీన మహారాష్ట్రలోని నాగపూర్ విదర్భ క్రికెట్ అసోసియేషన్ గ్రౌండ్‌లో, చివరి మ్యాచ్ 3వ తేదీన హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలోనూ భారత్, ఆస్ట్రేలియా మధ్య రాత్రి 7 గంటల నుండి మ్యాచ్‌లు జరుగనున్నాయి.
అయితే ఈ మ్యాచ్‌లకు భారత్, ఆ స్ట్రేలియా నుండి కీలక ప్లేయర్లు పాల్గొవడం లేదు. ఈ మ్యాచ్‌లో ఆడే భారత్ జట్టులో యువ ఆటగాళ్లు ఉన్నారు. వీరిలో తిలక్ వర్మ, రింకు సింగ్, రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్ ఉన్నారు. అక్షర పటేల్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ భారత్ ఆల్‌రౌండర్లు కాగా, హార్ధిక్ పాండ్యా తదితరులు పాల్గోనున్నారు. హార్ధిక్ పాండ్యా ప్రపంచ కప్ సమయంలో గాయం కారణంగా విశ్రాంతి తీసుకోవడంతో టీ20లో పాల్గొనబోతున్నాడు. ఇక ఆసియా క్రీడల్లో సుందర్, దూబే మంచి ప్రతిభ కనపరచగా, అక్షర్ గాయం నుండి కోలుకుని పునరాగమనం చేయనున్నాడు. జితేష్ శర్మ, రిషబ్ పంత్ కూడా ఉండే అవకాశం ఉంది. అయితే ఈ జట్టులో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్ ఆడటం లేదు. వరల్డ్ కప్‌లో పాల్గొన్న వీరంతా విశ్రాంతి తీసుకోనున్నారు. ఆస్ట్రేలియా టీమ్‌లో మార్కస్ స్టోనిస్, జెలెన్ మ్యాక్స్‌వెల్, తన్వీర్ సింగ్, నేతన్ ఎల్లీస్ తదితరులు ఉన్నారు. కాగా ఐదవ, చివరి టీ20 ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు డిసెంబరు 3 నుండి షెడ్యూల్ చేయబడింది. ఈ ఏడాది అగస్టులో ఐర్లాండ్‌తో జరిగిన టీ20 అంతర్జాతీయ మ్యాచ్ తొలి రెండు గేముల్లో ఆధిక్యం సాధించిన తర్వాత స్వదేశంలో భారత్ 2-0 సోర్కుతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. వాతావరణం కారణంగా మూడో టీ20 రద్దయింది. అగస్టు 2023లో ఆస్ట్రేలియా తన ఆఖరి టీ20 సిరీస్‌ను విదేశీ పర్యటనలో ఆడింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆస్ట్రేలియా మూడు గేములను సులువుగా గెలుచుకుంది. 3-0తో విజయం సాధించింది.



# వరల్డ్ కప్ పట్ల ఆసిస్ జట్టు అహంకారం

### ట్రోఫీపై కాళ్లు పెట్టి అవమానించిన మిచెల్ మార్ష్

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** వరల్డ్ కప్ ట్రోఫీ పట్ల ఆస్ట్రేలియా జట్టుకు ఏ మాత్రం గౌరవ లేకపోగా, అవమానించేలా వ్యవహరించింది. గెలుపు అహంకారమో, బలుపో ఏమో వరల్డ్ కప్‌పై కాళ్లు పెట్టి తీవ్రంగా అవమానించడం ఇప్పుడు విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తోంది. వరల్డ్ గప్ గెలవడంతో ఆస్ట్రేలియా జట్టు సంబరాలు చేసుకుంటోంది. ట్రోఫీని తీసుకున్న తర్వాత ఆటగాళ్లు దాన్ని వారు బస చేసిన హొటల్ గదులకు తీసుకెళ్లారు. ఇంత వరకూ బాగానే ఉంది. అయితే హొటల్‌కు వెళ్లిన అక్కడ మందు పార్టీ చేసుకున్నారు. కాకపోతే సోఫాలో కూర్చుని చేతిలో బీరు బాటిలో ఉన్న ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్ వరల్ కప్ ట్రోఫీపై కాళ్లు పెట్టడం వివాదాస్పదమవుతోంది. అంతేకాకుండా ఈ ఫొటోను సోషల్ మీడియా ఎక్స్ (ట్విట్టర్)లో సైతం పోస్టు చేయడంపై నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తూ దుమ్మెత్తిపోస్తున్నారు. కనీసం కప్‌కు గౌరవం ఇవ్వాలి కదా, ఇంత బరి తెగింపా, కప్ అంటే అంత చులకనా అంటూ తిట్టిపోస్తున్నారు. ఆరోసారి కప్ గెలిచాక ఆసిస్ తన బుద్ధి చూపించిందంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. వరల్డ్ కప్ అంటే అంత అహంకారమా అని ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు.

## వరల్డ్ కప్ 2027కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఆతిథ్యం

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** వచ్చే వరల్డ్ కప్ 2027 మరో నాలుగేళ్లలో జరగబోతున్నాయి. ఈ వరల్డ్ కప్ మ్యాచ్‌కు దక్షిణాఫ్రికా, జింబాబ్వే ఉమ్మడిగా ఆతిధ్యమివ్వబోతున్నాయి. ఈ రెండు దేశాలతో పాటు, నమీబియా దేశం ప్రపంచ కప్‌ను హోస్ట్ చేయనుంది. ఈ టోర్నీలో పలు కీలక మార్పులు జరగనున్నాయి. 2023 వరల్డ్ కప్ 9 మ్యాచ్‌ల్లో 10 జట్లు ఆయా దేశాలతో తలపడ్డాయి. పాయింట్ల పట్టికలో టాప్‌లో నిలిచిన నాలుగు జట్లు సెమీస్‌కు చేరాయి. కాగా 2027 మ్యాచ్‌ల్లో 14 జట్లు పోటీలో నిలవబోతున్నాయి. ఈ జట్లను రెండేసి గ్రూప్‌లుగా విడదీస్తారు. ప్రతీ టీమ్ ఆరు జట్లతో తలపడుతుంది. తొలి నాలుగు స్థానాల్లో నిలిచే జట్టు సెమీస్‌కు చేరతాయి. అలాగే ఈ సారి 48 మ్యాచ్‌లు జరగ్గా, వచ్చే వరల్డ్ కప్‌లో వీటి సంఖ్య 54కు పెరగనుంది. వన్డే ర్యాంకింగ్స్‌లో 8 స్థానాలో నిలిచిన జట్లు నేరుగా ప్రపంచ కప్ ఆడనుండగా, అర్హత టోర్నీలో క్వాలిఫై అయిన మిగిలిన 4జట్లు వరల్డ్ కప్ సమరంలో పాల్గోనున్నాయి.

# వరల్డ్ కప్ కోసం మళ్లీ నిరీక్షణ

### మరో నాలుగేళ్లకు మెగా టోర్నీ

### అప్పటి భారత్ జట్టులో ఉండే దెవరు?

### రోహిత్, కోహ్లీ, షమీ తదితరులు ఔట్!

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** క్రికెట్‌లో వరల్డ్ కప్ సాధించి విశ్వ విజేతగా నిలవాలని 12 ఏళ్లుగా భారత్ నిరీక్షణ ఈ సారి కూడా ఫలించ లేదు. 2003 వరల్డ్ కప్ చరిత్ర ముగిసింది. ఫైనల్‌లో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా వరల్డ్ కప్ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. అయితే అన్ని విభాగాల్లో పటిష్టంగా ఉన్న భారత్ ఈ సారి కచ్చితంగా ట్రోఫీని కొడుతుందని యావత్ భారత్‌తో, పాటుగా, వివిధ దేశాలు సైతం ఎంతో నమ్మకంగా ఉన్నాయి. కానీ చివరి మ్యాచ్‌లో భారత్ జట్టుకు కలిసి రాలేదు. వరల్డ్ కప్‌ను మళ్లీ సాధించాలంటే మరో నాలుగేళ్ల పాటు భారత్‌కు ఈ నిరీక్షణ తప్పదు. ఈ నేపధ్యంలో ఇప్పుడున్న ప్లేయర్లు అప్పటి భారత్ జట్టులో ఎందరు ఉంటారనేది ఇప్పుడు భారత్ ముందున్న ప్రశ్న. ఈ టోర్నీలో ఆడిన పలువురు ప్లేయర్లు వయసు రీత్యా 2027 వరల్డ్ కప్ టోర్నీలో పాల్గొనే భారత్ జట్టులో ఉండే అవకాశాలు అరుదుగా ఉన్నాయి. ఫిట్‌నెస్ ఇబ్బందులతో ఆయా ప్లేయర్లు 2027లో జరిగే వరల్డ్ కప్‌లో వీరు కనిపించే పరిస్థితి ఉండకపోవచ్చనేది క్రికెట్ ప్రియుల్లో ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో భారత్ టీమ్ కెప్టెన్ రోహిత్ శర్మ వచ్చే వరల్డ్ కప్‌లో ఆడటం కష్టమే అంటున్నారు. ప్రస్తుతం రోహిత్ శర్మ వయస్సు 36 ఏళ్లు. వచ్చే వరల్డ్ కప్ సమయానికి అతనే 40 ఏళ్లు పూర్తి చేసుకుంటాడు. ఈ వయస్సులో పూర్తి ఫిట్‌నెస్ సాధించడం కష్టమైన పనే అవుతుంది. ఇప్పటికే ఫిట్‌నెస్ సమస్యలతో రోహిత్ కొన్ని మ్యాచ్‌లు ఆడటం లేదు. ఇక మరో నాలుగేళ్లకు అంటే భారత్ జట్టు తరపున వరల్డ్ కప్ మ్యాచ్‌లో ఆడగలడనేది సందేహాస్పదమే అవుతోంది. అలాగే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ వయస్సు ప్రస్తుతం 35 సంవత్సరాలు. ఇప్పుడైతే విరాట్‌కు ఫిట్‌నెస్ పరంగా ఎటువంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు. అయితే మరో నాలుగేళ్ల నాటికి అంటే 39 సంవత్సరాల వయస్సు వచ్చే టప్పటికి ఇప్పుడున్న ఫిట్‌నెస్‌తోనే ఉంటాడన్న నమ్మకం మాత్రం లేదు. అతడి ఆట తీరు ఇలాగే కొనసాగితే 2027 వరల్డ్ కప్‌లో మరోసారి ఆడే అవకాశం లభిస్తుంది. కానీ అది అంత సులువేం కాదనే వాదన వ్యక్తవుతోంది. అదేవిధంగా పేస్ బౌలర్ మహ్మద్ షమీ కూడా ప్రపంచ కప్‌కు గుడ్ బై చెప్పినట్లే. ప్రస్తుతం షమీ వయస్సు 33 సంవత్సరాలు కాగా, ఇంకో నాలుగేళ్లు జట్టులో కొనసాగే ఛాన్స్ దాదాపు లేనట్టే. దీంతో కెరీర్ అత్యుత్తమ ఫామ్‌లో ఉన్న ఈ పేసర్ వచ్చే వరల్డ్ కప్‌లో ఆడకపోచ్చు. ఇక స్పిన్ ఆల్ రౌండర్లు 37 ఏళ్ల రవిచంద్రన్ అశ్విన్, 34 సంవత్సరాల రవీంద్ర జడేజా కూడా వచ్చే 2027 వరల్డ్ కప్ టోర్నమెంట్‌లో ఆడే అవకాలు తక్కువగా ఉన్నాయి. దీంతో వచ్చే వరల్డ్ కప్‌లో ఇటువంటి ప్లేయర్లకు మళ్లీ ఎంత వరకూ భారత్ జట్టులో స్థానం ఉంటుందనేది సందేహాస్పదమే అవుతోంది. ఇదే సమయంలో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టులో మహ్మద్ నబీ (38), డేవిడ్ వార్నర్ (37), స్టివ్ స్మిత్ (34), స్టార్క్ (33), కేన్ విలియమ్సన్ (33), ట్రెంట్ బౌల్ట్ (34), టిమ్ సౌథీ (34), షకీబుల్ హసన్, డేవిడ్ మలన్, మొయిన్ అలీ, క్రిస్ వోక్స్, ఆదిల్ రషీద్, బవుమా, మిల్లర్, వాండర్ డసన్‌కు కూడా 2003 వరల్డ్ కప్ ఆఖరిది అవుతోంది.



## టీమ్ ఆఫ్ ది టోర్నీకి ఆరుగురు భారత్ ఆటగాళ్లు

### సారధిగా రోహిత్‌ను ఎంపిక చేసిన అతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్

**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** ప్రపంచ కప్ 2023లో అత్యుత్తమంగా ఆడిన ఆటగాళ్లతో కూడిన జట్టును అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ ముగిసిన మరుసటి రోజే సోమవారం క్రికెట్ మండలి తన అత్యుత్తమ జట్టును ప్రకటించింది. 11 మంది ఆటగాళ్లతో కూడిన టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌ను అంతర్జాతీయ క్రికెట్ మండలి ఎంపిక చేసింది. తన జట్టుకు 12వ ఆటగాడిని కూడా ఎంపిక చేసుకుంది. ఈ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌కు సారధిగా భారత్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మను ఎంపిక చేసుకుంది. అలాగే దక్షిణాఫ్రికా యువ పేసర్ గెరాల్డ్ కోయెట్జీని 12వ ఆటగాడిగా ఎంచుకుంది. వన్డ్ వరల్డ్ కప్ మ్యాచ్‌ల్లో వరుసగా 10 విజయాలు సాధించి ఫైనల్‌కు చేరిన భారత్ జట్టు నుండి ఏకంగా 6 గురు ఆటగాళ్లకు అవకాశం కల్పించింది. మొత్తంగా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ జట్టులో ఎంపిక చేసిన 12 మందిలో క్వింటన్ డికాక్, రోహిత్ శర్మ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, డారిల్ మిచెల్, కెఎల్ రాహుల్ (కీపర్), గ్లెన్ మాక్స్‌వెల్, రవీంద్ర జడేజా, జస్ప్రీత్ బుమ్రా, దిల్షాన్ మధుశంక, ఆడమ్ జంపా, మహ్మద్ షమీ, గెరాల్డ్ కోయెట్జీ ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ నిర్వహించిన ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచ కప్ 2023 సందడి ముగిసింది. భారత్ గడ్డపై అక్టోబరు 5వ తేదీన మొదలైన వరల్డ్ కప్ పండుగ ఈ నెల 19 తేదీతో ముగిసిపోయింది. నరేంద్ర మోదీ స్టేడియంలో రిగిన ఫైనల్స్‌లో 6 వికెట్ల తేడాతో భారత్‌పై విజయం సాధించిన ఆస్ట్రేలియా ఆరోసారి ట్రోఫీని కవసం చేసుకుంది. ఆ మరుసటిరోజునే క్రికెట్ మండలి ఈ టోర్నీలో ప్రతిభ కనపరచిన 12 మందితో జట్టును ఏర్పాటు చేయడం విశేషం.

## మహ్మద్ షమీని గుండెలకు హత్తుకున్న ప్రధాని మోడీ




**హైదరాబాద్, నవంబరు 20, ప్రభాతవార్త:** ఎంతో ఆశలు పెట్టుకున్న వరల్డ్ కప్ చేజారిపోవడంతో యావత్ భారత్‌తో పాటు, రోహిత్ సే తీవ్ర విచారంలో మునిగిపోయింది. ఫైనల్ మ్యాచ్ ముగిసిన తదుపరి భారత్ జట్టు డ్రెస్సింగ్ రూంలో సీరియస్ వాతావరణం నెలకొంది. మోడల్ సెర్మనీలో ఆటగాళ్ల ముఖాలపై నవ్వు కనిపించినా, గుండెల్లో బాధ సుడులు తిరుగుతోంది. ఈ సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డ్రెస్సింగ్ రూమ్‌లోకి అడుగుపెట్టారు. విచారంలో ఉన్న ఆటగాళ్ల మనసులు తేలికపరిచేందుకు ప్రయత్నించారు. ముఖ్యంగా ఆస్ట్రేలియా చేతిలో పరాజయం పాలవడాన్ని జీర్ణించుకోలేని భారత్ స్టార్ పేసర్ మహ్మద్ షమీ పడుతున్న తీవ్ర మనోవేదనకు ప్రధాని గుర్తించి సమదాయించే యత్నం చేశారు. షమీని ప్రధాని అప్యాయంగా దగ్గరికి తీసుకుని హృదయానికి హత్తుకున్నారు. వీపుపై చేయి వేసి వాత్సల్యంతో నిమురుతూ షమీని ఊరడించారు. దీనికి సంబంధించిన ఫొటోను షమీ సోషల్ మీడియలో పంచుకున్నాడు. దురదృష్టవశాత్తూ నిన్న (19వ తేదీ) మాకు కలిసి రాలేదు. ఈ టోర్నీ ఆసాంతం భారత్ జట్టుకు, నాకు మద్దతుగా నిలిచిన అభిమానులందరికీ కృతజ్ఞతలు. ప్రత్యేకంగా మా డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చి మాలో స్ఫూర్తిని ఇనుమడింపచేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. మేం తప్పకుండా పుంజుకుంటాం అని షమీ ఎక్స్ (ట్విట్టర్)లో ట్వీట్ చేశాడు.

# వాణిజ్యం

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**ముంబై, నవంబరు 20:** దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిసాయి. నిఫ్టీ 37 పాయింట్లు క్షీణించి 19,694 పాయింట్ల వద్ద నిలిచింది. సెన్సెక్స్ కూడా 139 పాయింట్లు నష్టపోయి 65,655 పాయింట్ల వద్ద నిలిచింది. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడం, అమెరికా బాండ్లపై రాబడులు తగ్గుముఖం పట్టడం వంటి అంశాలు మార్కెట్లకు కలిసివచ్చినట్లు తెలుస్తోంది. ఈ వారం ఫెడ్ రిజర్వ్ మినిట్స్ సమావేశం ఉండడంతో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు కొంత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం స్మాల్‌క్యాప్ స్టాకలు అంతగా నష్టాల్లోకి వెళ్లడం లేదని, కానీ లార్జ్‌క్యాప్ కంపెనీలు మంచి డిస్కౌంట్లో ట్రేడవుతున్నాయని కొందరు నిపుణులు తెలియచేస్తున్నారు. అయితే మంచి లార్జ్‌క్యాప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలు సంపాదించవచ్చని సూచిస్తున్నారు. భారతీ ఎయిర్‌టెల్, విప్రో, హెచ్‌సిఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టిసిఎస్, ఇండస్ ఇండ్ బ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు, మారుతి సుజుకి, టైటాన్, ఎస్‌బిఐ స్టాకలు లాభాల్లో ముగిసాయి. బాజాజ్ ఫైనాన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టాటా మోటార్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఏసియన్ పెయింట్స్, ఎల్అండ్‌టి, జెఎస్‌డబ్ల్యు స్టీల్, సన్‌ఫార్మా వంటి కంపెనీలు నష్టాల్లో ముగిసాయి.



## ప్రభుత్వ ఖజానాకు సహారా సొమ్ము!

**ముంబై, నవంబరు 20:** సహారా ఇండియా అధినేత సుబ్రతా రాయ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన విషయం విదితమే. అయితే అసలు ఆయన మరణించిన తర్వాత కేసు ఏమౌతుంది?



దాచుకున్న డబ్బులు పెట్టుబడిదారులకు వస్తాయా? అనే అనుమానాలు పెద్ద చర్చకు దారితీశాయి. ఈ క్రమంలో చిన్న మొత్తాలను సహారాలో దాచుకున్న లక్షలాది పెట్టుబడిదారుల సొమ్ము ఏమవుతుందనే ప్రశ్న మరోసారి తెరపైకి వచ్చింది. నివేదికల ప్రకారం ప్రస్తుతం సహారా-సెబి రిఫండ్ ఖాతాలో క్లెయిమ్ చేయబడని నిధులను ఏకీకృత ఫండ్‌కు బదిలీ చేయాలనే ఆలోచన పరిగణించబడుతోంది. దీనిపై ప్రభుత్వం న్యాయ సలహా తీసుకుంటోంది. దీనివల్ల భవిష్యత్తులో పెట్టుబడిదారులు తమ రీఫండ్‌ను క్లెయిమ్ చేసినప్పుడు డబ్బు తిరిగి ఇవ్వబడుతుంది. ఈ యేడాది మార్చి 31 వరకు 48,326 ఖాతాలకు రూ.138 కోట్లు బదిలీ అయ్యాయి. క్లెయిమ్ చేయని డబ్బును సంక్షేమ పథకానికి ఉపయోగించవచ్చని ఒక అధికారి చెప్పారు. సహారా గ్రూప్ నుంచి మొత్తం రూ.25,163 కోట్లు రికవరీఅయ్యాయి. ఈ మొత్తం సొమ్ము ప్రభుత్వ బ్యాంకుల్లో జమ చేయబడింది. వాస్తవానికి 2012లో మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి తన ఆర్డర్‌లో పెట్టుబడిదారుల డబ్బును వడ్డీతో సహ తిరిగి ఇవ్వాలని సహారా గ్రూప్ కంపెనీలను ఆదేశించిన విషయం విదితమే. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది. పెట్టుబడిదారులను గుర్తించలేకపోయినట్లయితే ఆ నిధులను ప్రభుత్వానికి జమ చేస్తామని సుప్రీంకోర్టు తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ యేడాది ప్రారంభంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రూ.5వేల కోట్లు కేంద్ర సహకారా సంఘాల రిజిస్ట్రార్‌కు బదిలీ చేయబడ్డాయి. కొత్త ఆర్డర్ ప్రకారం డబ్బును 9 నెలల్లో పెట్టుబడిదారుల ఖాతాలకు బదిలీ చేయాలి. లేకుండా డబ్బు మళ్లీ సహారా-సెబి రీఫండ్ ఖాతాకు పంపబడుతుంది. డబ్బును తిరిగి వెనక్కి అందించేందుకు వీలుగా రీఫండ్ పోర్టల్ రూపొందించబడినప్పటికీ, ఇంకా పెద్ద సంఖ్యలో హక్కుదారులు తమ సొమ్ము తీసుకునేందుకు ముందుకు రాలేదు. పోర్టల్‌కి వెళ్లి తన రశీదును అప్‌లోడ్ చేయడం ద్వారా వాపసు పొందవచ్చు. అలాగే పోర్టల్‌లో అందించిన ఫారమ్ నింపి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.


## టిసిఎస్ చేతికి ఆస్ట్రేలియా స్టాక్ మార్కెట్

**ముంబై, నవంబరు 20:** అనిశ్చిత వ్యాపార వాతావరణంలో దేశీయ టెక్ కంపెనీలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో దిగ్గజం టిసిఎస్ ఆస్ట్రేలియా నుంచి మంచి డీల్ కొట్టేసింది. ఆస్ట్రేలియన్ స్టాక్ ఎక్ఛేంజ్ ఆపరేటర్ ఎస్ఎస్ఎక్స్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌కు తన క్లియరింగ్ అండ్ సెటిల్‌మెంట్ సాఫ్ట్‌వేర్‌ని తిరిగి నిర్మించడానికి నియమించుకున్నట్లు వెల్లడించింది. అనేక విమర్శలు ఎదుర్కొన్న తర్వాత బ్లాక్‌చెయిన్ ఆధారిత ప్రయత్నాన్ని విరమించుకుని తాజా చర్యకు ఉపక్రమించింది. 2017లో ఆస్ట్రేలియన్ స్టాక్ ఎక్ఛేంజ్ తీసుకున్న నిర్ణయం నుంచి తాజాగా నిష్క్రమించింది. ఎఎస్ఎక్స్ దాని వినియోగదారులు ప్రమాదకరమని భావించే 'బిగ్ బ్యాంగ్' మార్పు కాకుండా దశలవారీగా కొత్త సాఫ్ట్‌వేర్‌కి మారుతోంది. అయితే దీనికి సమయం పడుతుంది. ఈ క్రమంలో భారతదేశానికి చెందిన టెక్ దిగ్గజం టిసిఎస్ సాఫ్ట్‌వేర్‌ను ఫిన్‌లాండ్, కెనడాతో సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎక్ఛేంజీలు ఎఎస్ఎక్స్ క్లియరింగ్ హౌస్ ఎలక్ట్రానిక్ సబ్‌రిజిస్టర్ సిస్టమ్ లేదా చెస్ కోసం నిర్వహించగల ఫంక్షన్ల కోసం ఉపయోగిస్తున్నాయని ఆస్ట్రేలియన్ ఎక్ఛేంజ్ సోమవారం తెలిపింది. వాస్తవానికి ఆస్ట్రేలియా స్టాక్ ఎక్ఛేంజీ బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఆధారంగా నిర్మించిన టెక్నాలజీలో కోడ్‌లో చాలా తప్పులు ఉన్నాయని, వాటిని తిరిగి రీరైట్ చేయాలని సమీక్షలో వెల్లడికావడంతో తన ప్రయత్నాలను రద్దు చేసుకుంది.




## ఎల్అండ్‌టికి ఖతార్ రూ.111.30 కోట్లు జరిమానా

**ముంబై, నవంబరు 20:** దిగ్గజ కంపెనీ లార్సెన్ అండ్ టూబ్రో లిమిటెడ్‌కు ఖతార్ పన్నుశాఖ రూ.111.30 కోట్లు, రూ.127.60 కోట్ల చొప్పున రెండు జరిమానాలు విధించినట్లు ఎల్అండ్‌టి తెలిపింది. సోమవారం కంపెనీ షేర్లు రూ.3,090.15 స్థాయిలో ట్రేడవుతున్నాయి. మార్చి 2017 నుంచి మార్చి 2018 మధ్యకాలంలో కంపెనీపై ఈ జరిమానా విధించబడింది. ఈ జరిమానాపై కంపెనీ తన పిటిషన్‌ను దాఖలు చేయనుంది. కంపెనీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో రెండవ అతిపెద్ద నిర్మాణ సంస్థగా కొనసాగుతోంది. లార్సెన్ అండ్ టూబ్రో హైడ్రోకార్బన్ వ్యాపారం పశ్చిమాసియాలో పెద్దకాంట్రాక్టును పొందింది. కంపెనీ రూ.15 వేల కోట్ల కంటే ఎక్కువ విలువైన ప్రాజెక్టులను అల్ట్రా మెగా కేటగిరీలో వర్గీకరిస్తుంది. ఎల్అండ్‌టి హైడ్రోకార్బన్ వ్యాపారం పశ్చిమాసియాలోని ఒక ప్రసిద్ధ కస్టమర్ నుంచి పెద్దకాంట్రాక్ట్ కోసం లెటరన ఆఫ్ ఇంటెంట్‌ను అందుకున్నట్లు కంపెనీ స్టాక్ ఎక్ఛేంజ్ ఫైలింగ్‌లో వెల్లడించింది. కొత్త కస్టమర్ నుంచి ఈ ప్రధాన ఒప్పందం మాసామర్థ్యాలకు ప్రపంచ ఆమోదాన్ని పునరుద్ఘాటిస్తుందని ఎల్అండ్‌టి హోల్ టైమ్ డైరెక్టర్‌అండ్‌సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యం శర్మ పేర్కొన్నారు.




## క్షీణించిన 'సన్‌రెస్ట్ లైఫ్' షేర్లు




**ముంబై, నవంబరు 20:** ఎస్ఎస్ఇ ఎస్ఎమ్ఇ కేటగిరీలో వచ్చిన సన్‌రెస్ట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఐపిఒ రూ.84 రేట్ల వద్ద షేర్లు ఫ్లాట్ లిస్టింగ్‌ను నమోదుచేశాయి. అయితే కొద్ది సేపటికే షేర్లు 5శాతం లోయర్ సర్క్యూట్‌కు చేరాయి. దీంతో షేరు ధర ఒక్కసారిగా రూ.79.80 స్థాయికి పడిపోయింది. ఐపిఒ సబ్‌స్క్రిప్షన్ సమయంలో సన్‌రెస్ట్ లైఫన సైన్సెస్ లిమిటెడ్ ప్రైస్ బ్యాండ్ ఒక్కో షేరుకు రూ.84గా నిర్ణయించింది. ఈ క్రమంలో పెట్టుబడిదారుల కోసం లాట్ సైజుకు 1600 షేర్లుగా నిర్ణయించింది. రిటైల్ ఇన్వెస్టర్లు ఐపిఒలో పాల్గొనేందుకు కనీసం రూ.1,4,000 పందెం వేయాల్సి వచ్చింది. సన్‌రెస్ట్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఐపిఒ రిటైలర్ల కోసం నవంబర్ 7 నుంచి నవంబరు 9 వరకు తెరచి ఉంది. అలాగే నవంబరు 15న దరఖాస్తుదారులకు షేర్ల కేటాయింపు జరిగింది. తాజా ఐపిఒ ద్వారా దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి కంపెనీ రూ.10.85 కోట్లను సమీకరించింది. ఐపిఒ తెరవబడిన మూడు రోజుల్లో 62 సార్లు సబ్‌స్క్రిప్షన్ పొందింది. కేవలం చివరి రోజున మొత్తం 48 కంటే ఎక్కువ సార్లు సబ్‌స్క్రిప్షన్ పొందింది. ఐపిఒ తర్వాత ప్రమోటర్ల వాటా 100 శాతం నుంచి 69.91 శాతానికి తగ్గింది.

## మైక్రోసాఫ్ట్‌కు సామ్ ఆల్ట్‌మాన్..

**వాషింగ్టన్, నవంబరు 20:** ఓపెన్‌ఎఐ ఇటీవల కంపెనీ సిఇఒ సామన ఆల్ట్‌మాన్‌ను కంపెనీ నుంచి తొలగించింది. ఆయన పనితీరుతో సంతృప్తి చెందలేదంటూ బోర్డు దీనికి కారణంగా పేర్కొంది. అయితే తొలగింపు జరిగిన రోజుల వ్యవధిలోనే ఈ వ్యవహారంలోకి ప్రపంచ టెక్ దిగ్గజ కంపెనీ అయిన మైక్రోసాఫ్ట్ రంగంలోకి దిగింది. దీంతో మాజీ సిఇఒ సామ్ ఆల్ట్‌మాన్ ఇప్పుడు మైక్రోసాఫ్ట్‌లో చేరబోతున్నారని వెల్లడైంది. ఇదే క్రమంలో కంపెనీ సహ-వ్యవస్థాపకుడు గ్రెగ్ బ్రోక్ మ్యాన్ కూడా మైక్రోసాఫ్ట్‌లో చేరనున్నట్లు వార్తలు వస్తున్నాయి. సామ్, గ్రెగ్‌తో పాటు వారి బృందం చేరికను మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్ల స్వయంగా సోషల్ మీడియా



ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో ధృవీకరించారు. మైక్రోసాఫ్ట్ ప్రకటనపై ఎలాన్ మస్క్ కూడా స్పందించారు. సామన టీమ్ విజయవంతం కావడానికి అవసరమైన వనరులను అందించడానికి తాము ఎదురు చూస్తున్నామని సత్య నాదెళ్ల తన ట్వీట్‌లో వెల్లడించారు. సామ్ ఆల్ట్‌మాన్ తొలగించబడిన తర్వాత ఓపెన్‌ఎఐ పెట్టుబడిదారులు ఆయనను తిరిగి నియమించుకోమని కంపెనీ బోర్డుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఓపెన్‌ఎఐ బోర్డు తర్వాత సంస్థకు సిఇఒగా తిరిగి రావడానికి సామ్ ఆల్ట్‌మాన్‌తో చర్చలు ప్రారంభించింది. అయితే ఇకపై సామ్ ఆల్ట్‌మన్ మైక్రోసాఫ్ట్‌తో కలిసి పని చేయనున్నట్లు సత్య నాదెళ్ల ప్రకటించడం సంచలనంగా మారింది. ప్రస్తుతం ఉన్న వ్యాపార వాతావరణంలో గూగుల్ బార్డ్‌కు గట్టి పోటీ ఇచ్చేందుకు అవసరమైన సాంకేతికత పూర్తిస్థాయిలో మైక్రోసాఫ్ట్ వద్ద సంసిద్ధంగా సామ్ రూపంలో ఉంటుందని ఈ రంగంలోని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.